www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆర్టీసీలో కొలువుల జాతర

3,038 పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్

ఎస్సీ వర్గీకరణతో నియామకాలకు మార్గం సుగమం

రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 14

నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచన

'మహాలక్ష్మి'తో మహిళలకు రూ.5,500 కోట్ల లబ్ధి



సోమవారం | 21-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 22 | శ్రీవిశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం తిథి: అష్టమి రా.6.59 తదుపరి నవమి, నక్షత్రం: ఉత్తరాషాఢ మ.12.37 తదుపరి శ్రవణం, వర్జ్యం: సా.4.38-6.14, దుర్ముహూర్తం: మ.12.39-1.29, మ.3.09-3.59, అమృతఘడియలు: రా.2.16నుంచి తె. 3.53 వరకు, రాహుకాలం: ఉ. 7.30-9.00, సూర్యోదయం: 5.58, సూర్యాస్తమయం: 6.29 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

క్యాన్సర్ పరీక్షలు ఫ్రీ

18 ఏళ్లు దాటిన వారందరికీ.. సర్కారు నిర్ణయం



మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్ర్కీనింగ్

మగవారిలో నోటి క్యాన్సర్ పరీక్షలు

గ్రామగ్రామాన నిర్వహణకు వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయం

పది క్యాన్సర్ ప్రాంతీయ కేంద్రాలు

జిల్లాకో మొబైల్ స్ర్కీనింగ్ వాహనం

ఏటా 20 శాతం జనాభాకు పరీక్షలు

ఐదేళ్లలో 100% జనాభాకు అవకాశం

ప్రస్తుతం హైదరాబాద్‌లోనే స్ర్కీనింగ్

తాజా నిర్ణయంతో గ్రామాలకూ సేవలు

ప్రపంచ బ్యాంకు నిధులతో కార్యక్రమం

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాచ పుండు.. క్యాన్సర్.! పేరు ఏదైనా ఇప్పుడు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న మహమ్మారుల్లో అగ్రస్థానంలో ఉంది. ఏటా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. హైదరాబాద్‌లోని ఒక్క ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో నెలకు సగటున వెయ్యి కొత్త కేసులు నిర్ధారణ అవుతున్నాయి. గడిచిన నాలుగేళ్లలో ఇక్కడ కొత్త కేసుల సంఖ్య 49,166గా ఉంది. చాలా మందిలో క్యాన్సర్ లక్షణాలు కనిపించకుండా.. బాగా ముదిరి, చివరి దశకు చేరుకున్నాక నిర్ధారణ అవుతోంది. ఈ దశలో ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నా.. ఉపయోగం ఉండదు. మరోవైపు ఆరోగ్యశ్రీ కేసుల్లోనూ క్యాన్సర్ చికిత్సలు సింహభాగం ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో

మిగతా 13వ పేజీలో...

హైదరాబాద్‌లో ఎకో టౌన్

జపాన్‌లోని కిటాక్యుషు మాదిరిగా భాగ్యనగరం

భవిష్యత్తు తరాలకు ఆహ్లాదకరమైన వాతావరణం

పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం: రేవంత్

కిటాక్యుషు నగరాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి

జపాన్ సంస్థలతో తెలంగాణ సర్కారు ఒప్పందం

హైదరాబాద్‌లో జపనీస్ పాఠశాల ఏర్పాటు యోచన 13



జపాన్‌లోని కిటాక్యుషులో ఆ నగర మేయర్‌తో స్థానిక సంప్రదాయ దుస్తుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



పాతిక.. ముప్పై.. నలభై.. ఇలా వయసు పెరుగుతుందిగానీ.. మనసు మాత్రం యూత్‌లోనే ఉండిపోతుంది. ఇంటర్, డిగ్రీ చదివే పిల్లలు 'ఆంటీ', 'అంకుల్' అని పిలుస్తుంటే అదోలా ఉంటుంది. వద్దని చెప్పలేరు. అలాగని అంగీకరించి ఊరుకోనూ లేరు. "నిన్న మొన్ననే కదా.. కాలేజీలో లైలాతో రొమాన్స్ చేసింది" అని పాత తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటుందో పురుష హృదయం!! 'ఆంటీ' అన్న పిలుపుతోనే భగ్గున మండుతుందో మహిళ హృదయం!! చెవిలో సీసం పోసినట్టే ఉంటుందా సంబోధన వింటుంటే! కారణం.. మధ్య వయసు అనే భావనకు ప్రమాణాలు మారడమే!

యూత్ అంకుల్స్.. యంగ్ ఆంటీస్

పెరుగుతున్న ఆయుర్దాయంతో.. నడివయసు భావన ఆలస్యం

ఒకప్పుడు 20 ఏళ్లలోపే పెళ్లిళ్లు.. 40 ఏళ్లకే మధ్యవయసు భావన

మనకు స్వాతంత్ర్యం వచ్చేనాటికి సగటు జీవితకాలం 32 ఏళ్లు

2021నాటికి 67.2 ఏళ్లు.. 2050నాటికి 76 సంవత్సరాలు

జీవితం మొదలయ్యేదే నాలుగు పదులకు అంటున్న నేటితరం

యాభై సంవత్సరాలు వచ్చినా అందం, ఫిట్‌నెస్‌పై తరగని శ్రద్ధ

ఒకప్పుడు నాలుగు పదుల వయసు వస్తే నడివయసు కిందే లెక్క! 1947లో మనకు స్వాతంత్ర్యం వచ్చేనాటికి భారతదేశంలో ప్రజల సగటు ఆయుర్దాయం కేవలం 32 సంవత్సరాలు. 2021 నాటికి అది 67.2 సంవత్సరాలకు చేరుకుంది. 2050 నాటికి మనదేశంలో పురుషుల సగటు ఆయుర్దాయం 76, మహిళల సగటు జీవితకాలం 80 సంవత్సరాలకు చేరుతుందని అంచనా. ఒకప్పుడు సగటు జీవితకాలం తక్కువగా ఉండేది కాబట్టే.. జీవన విధానం కూడా దానికి తగ్గట్టుగా ఉండేది. 20 ఏళ్లలోపే పెళ్లి చేసుకోవడం.. నలభై ఏళ్లకే పిల్లలకు పెళ్లిళ్లు చేయడం.. యాభై ఏళ్లొచ్చేసరికి మనవలు, మనవరాళ్లను ఆడించడం.. ఇలా ఒక సంప్రదాయ పద్ధతిలో సాగిపోయేది. పిల్లలకు పెళ్లి చేయడంతో.. నాలుగు పదుల వయసుకే పెద్దరికం వచ్చేసి, మానసికంగా మధ్యవయసువారిలాగా నడుచుకునేవారు! సగటు జీవితకాలం

మిగతా 2వ పేజీలో...



ప్రైవేటుకు దీటుగా!

ప్రభుత్వ ఆస్పత్రులు.. పాఠశాలల అభివృద్ధి

సీఎస్ఆర్ నిధులతో ఆస్పత్రులకు కొత్తకళ

జిల్లా దవాఖానాల్లో ఆన్‌లైన్ సేవలు

అందుబాటులో ఎమర్జెన్సీ వైద్యులు

ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ 14

ప్రత్యేక టీచర్ల నియామకం.. సౌకర్యాలు

రెండు శాఖల అధికారులతో బృందాలు

ఎయిమ్స్, చండీగఢ్ పీజీఐఎంఈఆర్ కేంద్రం, ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం

త్వరలో ప్రభుత్వానికి ప్రాథమిక నివేదికలు


2

చైనా సరికొత్త హైడ్రోజన్ బాంబు!

ప్రయోగాత్మక పరీక్ష విజయవంతం

సాధారణ బాంబు తరహాలోనే.. అయినా తీవ్ర విధ్వంసం సృష్టించే సామర్థ్యం

బాంబు పేలినప్పుడు కొన్ని సెకన్ల పాటు భారీ అగ్నిగోళం

1000 డిగ్రీలకుపైగా వేడితో వినాశనం

కర్ణాటక మాజీ డీజీపీని చంపేసిన భార్య

ముఖంపై కారం కొట్టి.. కత్తితో దాడి

ఓంప్రకాశ్‌ని చంపేశానంటూ మరో ఐపీఎస్ భార్యకు ఫోన్ చేసిన వైనం

హత్యలో కుమార్తెకూ భాగస్వామ్యం 2

నువ్వు ఎన్నికల కమిషనర్ కాదు..

ముస్లిం కమిషనర్‌వి

మాజీ సీఈసీ ఖురేషీపై బీజేపీ ఎంపీ దూబే విమర్శలు

ముస్లింల భూములు లాక్కొనేందుకే వక్ఫ్ చట్ట సవరణ అంటూ ఖురేషీ వ్యాఖ్యలు

సుప్రీంకోర్టుపై నిశికాంత్ దూబే వ్యాఖ్యలు వ్యక్తిగతం

వాటితో బీజేపీకి సంబంధం లేదు: పార్టీ అధ్యక్షుడు నడ్డా



నిశికాంత్ దూబే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీం విచారణ, కోర్టుపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే వివాదాస్పద వ్యాఖ్యల దుమారం కొనసాగుతోంది. ముస్లింల భూములను లాక్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని భారతఎన్నికల సంఘం మాజీ ప్రధాన కమిషనర్ (సీఈసీ) ఎస్‌వై ఖురేషీ ఆరోపించారు. ఆ కుటిల ప్రయత్నాలను సుప్రీంకోర్టు అడ్డుకుంటుందన్న నమ్మకం తనకు ఉందంటూ ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. దీనిపై నిశికాంత్ దూబే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఖురేషీ సీఈసీగా ఉన్న సమయంలోనే ఝార్ఖండ్‌లోని సంతాల్ పరగణాలో బంగ్లాదేశీ చొరబాటుదారులకు ఓటర్ కార్డులు ఇచ్చారని.. ఆయన ఎన్నికల కమిషనర్ కాదు, ముస్లిం కమిషనర్ అని దూబే విమర్శించారు. చరిత్ర ప్రకారం క్రీస్తుశకం 712వ సంవత్సరంలో భారత్‌లోకి ఇస్లాం ప్రవేశించిందని, అప్పటిదాకా ఈ భూమి అంతా హిందువులు, గిరిజనులు, జైనులు, బౌద్ధులదేనని

మిగతా 2వ పేజీలో...



అమెరికాలోని ఓ యూనివర్సిటీలో ప్లకార్డులతో నిరసన

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై

న్యాయపోరాటం

కోర్టు మెట్లెక్కిన భారత్, చైనా విద్యార్థులు 12

తమ స్టూడెంట్ వీసా రద్దును సవాలు చేస్తూ కేసులు

నిర్బంధాలు, బహిష్కరణలను తక్షణం నిలిపేయాలని వినతి

ట్రంప్ తీరుకు నిరసనగా మరోసారి రోడ్లపైకి అమెరికన్లు

అమెరికా వ్యాప్తంగా పలు నగరాల్లో భారీ ర్యాలీలు

అమెరికాకు తగ్గిన విమాన చార్జీలు 12

ఢిల్లీ-అమెరికా టికెట్ ధరలు 10-15% పడిపోయిన వైనం

ముంబై నుంచి బయలుదేరే విమానాల్లోనూ తగ్గుదల

16,347 పోస్టులతో ఏపీలో మెగా డీఎస్సీ

వేర్వేరుగా 2 నోటిఫికేషన్లు.. మే 15 వరకు దరఖాస్తులకు గడువు

జూన్ 6 నుంచి జూలై 6 వరకు పరీక్షలు.. పూర్తిగా ఆన్‌లైన్‌లోనే

ఉపాధ్యాయ పోస్టుల్లో స్థానికులకు 80%.. స్థానికేతరులకు 20%

అమరావతి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): లక్షలాది మంది ఉద్యోగార్థులు ఆశగా ఎదురుచూస్తున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ఆదివారం జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం రెండు వేర్వేరు నోటిఫికేషన్లను ప్రకటించింది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్ స్కూళ్లు, మునిసిపల్ కార్పొరేషన్ స్కూళ్లు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, జువెనైల్ సంక్షేమ విభాగంలో

మిగతా 3వ పేజీలో...

తెలుగుజాతి అభ్యున్నతికి పునరంకితమవుతా

2047నాటికి ప్రపంచంలోనే శక్తిమంతంగా ఉండాలి: చంద్రబాబు

జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన అందరికీ ఏపీ సీఎం ధన్యవాదాలు

చంద్రబాబుకు 75వ జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

మరింత సుభిక్షంగా పాలన అందించాలి: కేసీఆర్, కేటీఆర్

హ్యాపీ బర్త్‌డే టూ యూ.. చంద్రబాబు: సీఎం రేవంత్‌రెడ్డి



30 సెకన్ల మాయాబజార్

రీల్స్, షార్ట్స్‌తో సోషల్ మీడియా ద్వారా వ్యాపారం.. జోరుగా బిజినెస్

ఆన్‌లైన్ వ్యాపారుల్లో గృహిణులే అధికం.. చేసుకున్నోళ్లకు చేసుకున్నంత

ఒక్క వీడియో హిట్ అయినా కాసుల మోతే.. కాస్త తేడా జరిగితే సర్వం పాయే!

అలేఖ్య చిట్టి పికిల్స్.. ఈ మధ్య సోషల్ మీడియాలో దుమారం రేపిన వ్యాపారం ఇది. పెద్ద ఎత్తున పచ్చళ్ల వ్యాపారం చేసి ఎంతో ప్రాచుర్యం పొందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు.. తాము చేసిన ఒకేఒక్క తప్పు బయటపడడంతో ఊహించనంత నష్టపోయారు. నెలల తరబడి శ్రమించి అభివృద్ధి చేసుకున్న వ్యాపారాన్ని పూర్తిగా కోల్పోవడమేకాక.. విపరీతమైన సోషల్ మీడియా ట్రోలింగ్‌కు గురై నానా అవస్థలు పడ్డారు. ఈ అక్కాచెల్లెళ్ల ఉదంతం వారికే కాదు.. అపరిమిత అవకాశాలు ఉన్న సోషల్ మీడియాను నమ్ముకుని వ్యాపారాలు చేసేవారందరికీ ఓ గుణపాఠం. చిన్న తప్పు చేసినా సరే.. భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే. ఒక్కసారి కొనుగోలుదారుల నమ్మకం కోల్పోయినా, తప్పుడు అభిప్రాయం ఏర్పడినా.. అంతే సంగతి. ట్రోలర్లకు, మీమర్లకు మేత అయిపోయినట్టే..!! 12

ఎండల మంట..

వానల తంటా!

రాష్ట్రంలో ఆదివారం కొనసాగిన విచిత్ర వాతావరణం

ఆదిలాబాద్ సహా పలు జిల్లాల్లో మండిన సూరీడు

'ఉమ్మడి మహబూబ్‌నగర్'లో రైతుల్ని దెబ్బతీసిన అకాల వర్షం

పలుచోట్ల తడిసిన మొక్కజొన్న, ధాన్యం, నేలకొరిగిన పంటలు

వనపర్తి జిల్లాలో పిడుగుపాటుకు 25 గొర్రెల మృత్యువాత

ములుగు జిల్లాలో వడదెబ్బకు ఒకరి మృతి

నేడు పలుచోట్ల వర్షాలు, రేపట్నుంచి తీవ్రం కానున్న ఎండలు !

14



నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లిలో నేల కొరిగిన మొక్కజొన్న పంట

అథ్లెటిక్స్ కోచ్ రమేశ్‌పై వేటు



డోప్ టెస్టుల నుంచి అథ్లెట్లు తప్పించుకునేందుకు సహకరించారని అభియోగం 11

తెలుగు అథ్లెట్లు శ్రీనివాస్, ప్రత్యూష సహా ఏడుగురి సస్పెన్షన్

ఏ తప్పూ చేయలేదు: రమేశ్

ద్యూతీ చంద్, దీప్తి, నందిని వంటి ఎందరినో మేటి అథ్లెట్లుగా తీర్చిదిద్దిన ప్రముఖ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్‌పై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) సస్పెన్షన్ వేటు వేసింది. మొత్తంగా ఏడుగురు అథ్లెట్లు, ముగ్గురు కోచ్‌లను సస్పెండ్ చేస్తున్నట్టు నాడా ప్రకటించింది. డోప్ టెస్టుకు నమూనాలు ఇచ్చేందుకు నిరాకరించినందున అథ్లెట్లపై, వారికి శిక్షణ ఇస్తున్న కోచ్‌లపై చర్య తీసుకున్నారు. హైదరాబాద్‌లోని 'సాయ్' కేంద్రంలో కోచ్‌గా పనిచేస్తున్న రమేశ్ వద్ద శిక్షణ తీసుకుంటున్న తెలుగు అథ్లెట్లు షణ్ముగ శ్రీనివాస్, ప్రత్యూష డోప్ టెస్టుకు శాంపిల్స్ ఇవ్వకుండా గైర్హాజరయ్యారు. వీరితోపాటు వేటుపడిన వారిలో కోచ్‌లు కరమ్‌వీర్ సింగ్, రాకేశ్, అథ్లెట్లు పరాస్ సింఘాల్, పూజారాణి, కిరణ్, జ్యోతి, శుభమ్ మహ్రా ఉన్నారు. కాగా తెలుగు రాష్ట్రాల్లోని ప్రతిభావంతులైన, పేద క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు కృషి చేశానని, తాను ఏ తప్పూ చేయలేదని నాగపురి రమేశ్ అన్నారు.

కమీషన్ పెంపు కోసం వంట గ్యాస్ డీలర్ల సమ్మె హెచ్చరిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: తమ సమస్యలను పరిష్కరించకుంటే దేశ వ్యాప్త సమ్మె చేస్తామని వంటగ్యాస్ డీలర్లు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇందుకు మూడు వారాల సమయం ఇస్తున్నట్టు ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల సంఘం అధ్యక్షుడు బి.ఎస్.శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పెట్రోలియం, సహజవాయుల మంత్రిత్వ శాఖకు కూడా లేఖ రాసినట్టు తెలిపారు. సిలిండర్ల పంపిణీకి సంబంధించిన నిర్వహణ వ్యయం పెరుగుతున్న దృష్ట్యా ప్రస్తుతం ఇస్తున్న కమీషన్ సరిపోవడం లేదని, అందువల్ల దాన్ని కనీసం రూ.150కి పెంచాలని డిమాండు చేశారు. తాము అడగకపోయినా ఆయిల్ కంపెనీలు వాణిజ్య సిలిండర్లను పంపిస్తున్నాయని, ఇది తమకు సమస్యలు తెచ్చిపెడుతున్నాయని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అమలు చేస్తున్న ఈ విధానాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండు చేశారు.

ఎస్ఎస్‌సీ పరీక్షలకు 'ఆధార్' బయోమెట్రిక్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: పరీక్షల్లో అభ్యర్థుల గుర్తింపును స్వచ్ఛందంగా ధ్రువీకరించడానికి ఆధార్ ఆధారిత బయోమెట్రిక్‌ను అమలు చేయాలని స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) నిర్ణయించింది. వచ్చే నెల నుంచి నిర్వహించే అన్ని నియామక పరీక్షల్లో ఈ విధానాన్ని అమలు చేయనున్నట్టు అధికారులు వెల్లడించారు. అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సమయంలో, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేటపుడు, పరీక్షా కేంద్రాలకు హాజరైనపుడు తమ గుర్తింపు ధ్రువీకరణకు ఆధార్ ఉపయోగించాలని తెలిపారు. ఇటీవల ఎస్ఎస్‌సీ ఈ మేరకు ప్రకటన విడుదల చేసినట్టు పేర్కొన్నారు.

ప్లీజ్ పాస్ చేయండి..నా ప్రేమ మీ చేతుల్లో ఉంది

- జవాబు పత్రంలో పదో తరగతి విద్యార్థి అభ్యర్థన

బెంగళూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో భిన్నమైన అంశాలను ప్రస్తావిస్తూ కొందరు విద్యార్థులు రాస్తుంటారు. అటువంటిదే బెళగావి జిల్లా చిక్కోడిలో ఏర్పాటు చేసిన పదో తరగతి మూల్యాంకన కేంద్రంలో వెలుగులోకి వచ్చింది. ఓ విద్యార్థి జవాబు పత్రంలో విచిత్ర సందేశాన్ని చూసి అక్కడున్నవారు ఆశ్చర్యానికి లోనయ్యారు. పదో తరగతి పాస్ అయితేనే నీతో ప్రేమ కొనసాగిస్తానని ప్రియురాలు చెప్పిందని ఏకంగా విద్యార్థి ఆన్సర్‌షీట్‌లో రాశాడు. 'నా ప్రేమ మీ చేతుల్లో ఉంది.. అమ్మాయి ప్రేమ కొనసాగాలంటే నేను పాస్ కావాలి సార్/మేడం. దయచేసి పాస్ చేయండి. ఈ 500తో టీ తాగండి, నన్ను పాస్ చేయండి' అంటూ ఆన్సర్ షీట్ల మధ్యన 500 రూపాయల నోటు జత చేశాడు.

జంధ్యం వివాదంలో ప్రిన్సిపాల్ తొలగింపు

బెంగళూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యాకోర్సుల ప్రవేశ పరీక్ష (సీఈటీ) రాసేందుకు వెళ్లే విద్యార్థులను జంధ్యం తొలగించాలని నిబంధన విధించిన ఘటనలో బీదర్ జిల్లా సాయిస్ఫూర్తి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ బిరాదార్‌ను విధుల నుంచి తొలగించారు. ఈమేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ప్రిన్సిపాల్‌తోపాటు ఉద్యోగి సతీశ్‌పవార్‌ను కూడా తొలగించారు. ఈ వివాదంలో మ్యాథ్స్ పరీక్ష రాయలేకపోయిన విద్యార్థి సుచివ్రత్ కులకర్ణి ఇంటికి బీదర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఈశ్వర్ ఖండ్రే వెళ్లారు. భాల్కిలోని బీమణ్ణఖండ్రె ఇంజనీరింగ్ కళాశాలలో ఉచితంగా సీటు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

10 వేల మంది జన్యు క్రమాల ఆవిష్కరణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: భారతీయుల జన్యు క్రమాలకు సంబంధించిన డేటాబేస్ రూపకల్పన కోసం జీనోమ్ ఇండియా చేపట్టిన ప్రాజెక్టులో భాగంగా తొలి దశలో 10 వేల మంది జన్యువులను పూర్తిగా ఆవిష్కరించారు. భారతీయుల జన్యు వైవిధ్యాన్ని ఆవిష్కరించే లక్ష్యంతో 2020లో ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. ఇందులో భాగంగా దేశంలోని నాలుగు ప్రధాన భాషా సమూహాలు.. ఇండో-యూరోపియన్, ద్రవిడియన్, ఆస్ట్రో-ఆసియాటిక్, టిబెటో-బర్మన్‌కు చెందిన 10 వేల మంది జన్యు క్రమాలను విశ్లేషించారు. ఈ జన్యు క్రమ ఆవిష్కరణ వల్ల ఎవరికి ఎలాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది? వాటిని నివారించడం ఎలా? ఎలాంటి మందులు వాడాలి? అనే విషయాలు తెలుసుకోవచ్చు.

మోదీ... మా దేశానికి రండి: చైనా

బీజింగ్, ఏప్రిల్ 20: అమెరికాతో వాణిజ్య యుద్ధం ముదురుతున్న వేళ పొరుగు దేశం చైనా స్వరం మారుతోంది. భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి డ్రాగన్ ఇప్పుడు స్నేహ హస్తం చాపుతోంది. భారత్, ఇతర సభ్య దేశాలతో కలసి షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో)కు నాయకత్వం వహించడానికి సిద్ధమవుతున్న తరుణంలో ఈ ఏడాది తమ దేశంలో పర్యటించాలని ప్రధాని మోదీని ఆహ్వానించింది. ప్రతీకార సుంకాలతో బీజింగ్, వాషింగ్టన్ మధ్య సంబంధాలు క్షీణిస్తున్న దశలో చైనా వైఖరిలో ఈ మార్పు రావడం గమనార్హం.

ఏటీఎంలో బంగారం వేస్తే బ్యాంకు ఖాతాలో నగదు జమ

చైనాలో నూతన ఆవిష్కరణ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: వినూత్న ఆవిష్కరణల్లో ముందున్న చైనా మరో ప్రయోగాన్ని చేసింది. ఎవరైనా ఏటీఎంలో తమ బంగారాన్ని వేస్తే దాని మార్కెట్ విలువ సంబంధిత వ్యక్తి బ్యాంకు ఖాతాలో జమయ్యేలా ఏర్పాట్లు చేసింది. షాంఘైలో 'గోల్డ్ మెల్టింగ్ ఏటీఎం'ను నెలకొల్పింది. ఎవరైనా తమ వద్ద ఉన్న బంగారం నగలు, కాసులు వంటివి ఈ ఏటీఎంలో జమ చేయవచ్చు. వెంటనే దాన్ని కరిగించి స్వచ్ఛతను లెక్కిస్తుంది. అత్యాధునిక తూనిక విధానం ద్వారా దాని బరువును కొలుస్తుంది. ఆ రోజుకు ఉన్న మార్కెట్ ధరల ప్రకారం దాని విలువను లెక్కిస్తుంది. ఆ సొమ్మును సంబంధిత వ్యక్తి బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. ఇదంతా నిమిషాల వ్యవధిలో జరిగిపోతుంది.

యూత్ అంకుల్స్.. యంగ్ ఆంటీస్



(మొదటి పేజీ తరువాయి)

తక్కువగా ఉండడం వల్ల.. అరవై ఏళ్లు జీవించిన వారికి ఆ పుట్టినరోజును షష్టిపూర్తి పేరుతో వేడుకగా జరిపేవారు. వైద్యప్రమాణాల ప్రకారం కూడా.. 40 నుంచి 60 ఏళ్ల దాకా నడివయసు కింద లెక్క. కానీ అదంతా గతం. ఇప్పుడా లెక్కలన్నీ మారిపోయాయి. ఆడ, మగ అనే తేడా లేకుండా.. చాలా మందికి చదువు పూర్తిచేసుకుని, కెరీర్‌లో స్థిరపడేసరికే మూడు పదుల వయసు దాటుతోంది. పెద్ద చదువులు చదవకుండా డిగ్రీ, పీజీతో సరిపెట్టుకున్నవారు సైతం 'ఇప్పుడే ఎందుకు' అంటూ పెళ్లిని వాయిదా వేస్తున్నారు. దీంతో వారికి పెళ్లయి, పిల్లలు పుట్టేసరికే 35-36 ఏళ్లు వస్తున్నాయి. అంటే.. ఆ వయసులోనే వారికి అసలు జీవితం మొదలవుతోంది. దీనికితోడు.. గడిచిన యాభై సంవత్సరాలుగా అందుబాటులోకి వచ్చిన అత్యంత అధునాతన వైద్యరీతులు, ఔషధాలు, పెరిగిన సౌకర్యాల కారణంగా.. ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగి శారీరకంగా దృఢంగా ఉండడంతో 50 ఏళ్లు దాటితేగానీ మధ్య వయసులోకి వచ్చిన భావన వారికి కలగని పరిస్థితి ఉంది. మరోకారణం ఏంటంటే.. విదేశాలతో పోలిస్తే మనదేశంలో పిల్లలు ఎంత పెద్దవారైనా తల్లిదండ్రులతో కలిసి ఉండడం సర్వసాధారణం. ఇంటికి సంబంధించిన నిర్ణయాలు ఏవి తీసుకోవాలన్నా పెద్దలపై ఆధారపడేవారి శాతం ఎక్కువ. తల్లిదండ్రులు నిర్ణయాలు తీసుకోలేనంత వృద్ధులైతే తప్ప.. చాలా మంది ఇంటి బాధ్యతలు తీసుకోని పరిస్థితి ఉంటుంది. అలా బాధ్యతలు స్వీకరించేనాటికి వారి వయసు దాదాపు 50 సంవత్సరాలకు దగ్గర్లో ఉంటోంది! అప్పుడుగానీ వారికి మధ్యవయసుకు వచ్చిన భావన కలగట్లేదు.

యోగా.. వ్యాయామంతో..

'వయసు పెరగడం.. ముసలితనం రావడం సహజం' ..అనే భావన మునుపటి తరంవారిలో ఉండేది. కానీ, ఈ తరం ఆలోచనలు అలా లేవు. "వయస్సనేది కేవలం లెక్కలకు సంబంధించినది. మానసికంగా ఉత్సాహంగా ఉంటే శారీరకంగా కూడా దృఢంగా ఉండి, వృద్ధాప్యాన్ని ఎక్కువకాలం అల్లంతదూరాన ఉంచొచ్చు' అనేది నేటితరం భావన. అందుకే.. నలభై, యాభై ఏళ్ల వయసున్న స్త్రీ పురుషులూ జిమ్‌కు వెళ్లి వ్యాయామం చేస్తూ, యోగా, ప్రాణాయామం వంటివి చేస్తూ.. వైద్యుల సలహాలు, సూచనలతో పౌష్టికాహారం తీసుకుంటూ.. ఫిట్‌నెస్‌ను, ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. అనివార్యమైన వృద్ధాప్యాన్ని వాయిదా వేయడానికి గట్టిగా చెమటోడుస్తున్నారు. దీనివల్ల శారీరక దారుఢ్యం పెరిగి.. ఏడు పదుల వయసులోనూ ఉద్యోగాలు, పని చేస్తున్నవారి సంఖ్య కూడా క్రమంగా పెరుగుతుండడం గమనార్హం. మన దేశంలో రిటైర్మెంట్ వయసు ప్రాంతాన్ని బట్టి 60-65 సంవత్సరాలు అయినప్పటికీ.. 70 ఏళ్లు దాటినా కూడా హుషారుగా పనిచేస్తున్నవారు కోటిమందికిపైగానే ఉన్నట్టు 2011 జనాభా లెక్కలు చెబుతున్నాయి. ఆ సంఖ్య.. ఆ ఏడాది మనదేశంలో ఉన్న 70-79 ఏళ్ల వారిలో 32 శాతం కావడం గమనార్హం. 2001 లెక్కల ప్రకారం ఆ సంఖ్య 76.7 లక్షలే. గడిచిన పదమూడేళ్లలో అలా పనిచేస్తున్న వారి సంఖ్య ఇంకా పెరిగి ఉంటుందని అంచనా. మధ్యవయసు.. దరిమిలా ముదిమి... వాయిదా పడడం అనే కాన్సెప్ట్ మనదగ్గర ఇప్పుడిప్పుడు ఊపందుకుంటోందిగానీ.. పాశ్చాత్యదేశాల్లో ఈ ట్రెండ్ చాలాకాలంగా ఉంది. 2012లో బ్రిటన్‌లో నిర్వహించిన ఒక సర్వేలో అత్యధికులు.. 55 ఏళ్లు వస్తేగానీ నడివయసుకు వచ్చినట్టు కాదని కుండబద్దలు కొట్టి చెప్పారు. 20 శాతం మంది దృష్టిలో మధ్యవయసు అంటే కనీసం 60 ఏళ్లు!! నిజమే.. ప్రముఖ రచయిత మార్క్‌ట్వెయిన్ అన్నట్టు వయస్సనేది కేవలం మానసిక భావన! పట్టించుకుంటేనే సమస్య.. పట్టించుకోకపోతే అద్భుతాలు సృష్టించవచ్చు!!

తప్పా? ఒప్పా?

కాబోయే అల్లుడితో అత్త పరారీ.. కూతురి మామగారితో తల్లి వివాహేతర సంబంధం.. పెళ్లిచూపుల్లో కూతుర్ని చూపించి పెళ్లికి సిద్ధమైన తల్లి వంటి ఘటనలు ఇటీవలికాలంలో పెరగడానికి వయసు పెరిగినా మనసు యవ్వనంలోనే ఉండిపోవడం ఒక కారణమని మనస్తత్వ శాస్త్ర నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఉదాహరణకు కూతురి మామగారితో తల్లి వివాహేతర సంబంధం పెట్టుకున్న ఘటనలో.. వారిద్దరి వయసూ 43, 46 ఏళ్లు. వారుచేసింది తప్పా? ఒప్పా? అనే మీమాంస పక్కన పెడితే.. పెళ్లయిన పిల్లలున్నా.. మానసికంగా వారిద్దరూ నడివయస్సులోకి వచ్చినట్టు భావించకపోవడం వల్లే వారు అలాంటి అసాధారణమైన నిర్ణయం తీసుకున్నారని వారు పేర్కొంటున్నారు.

రిటైర్డ్ డీజీపీని చంపిన భార్య

- ముఖంపై కారం కొట్టి కత్తితో దాడి..బెంగళూరులో దారుణం
- హత్యలో కుమార్తెకూ భాగస్వామ్యం..ఆస్తి గొడవలే కారణం?




భార్య పల్లవితో ఓంప్రకాశ్(ఫైల్)

బెంగళూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మాజీ డీజీపీ ఓంప్రకాశ్(68) దారుణ హత్యకు గురయ్యారు. బెంగళూరు నగరం హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని ఆయన నివాసంలోనే ఈ దారుణం జరిగింది. భార్య పల్లవి, కుమార్తె కృతి ఆయనను ముఖంపై కారం చల్లి కత్తితో పొడిచి చంపేసినట్టు తెలుస్తోంది. అనంతరం పల్లవి మరో ఐపీఎస్ అధికారి భార్యకు వీడియోకాల్ చేసి, రాక్షసుడిని చంపేశానంటూ మృతదేహాన్ని చూపించినట్టు సమాచారం. ఆస్తి తగాదాలే హత్యకు కారణంగా తెలుస్తోంది. పల్లవి ఆదివారం సాయంత్రం ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వగా హెచ్ఎస్ఆర్ లే అవుట్ పోలీసులు ఆయన ఇంటికి చేరుకొని రక్తపు మడుగులో ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. భార్య, కుమార్తెను బయటకు రావాలని పోలీసులు కోరినా చాలా సమయంపాటు వారు పైఅంతస్తులోనే ఉండడం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. బిహార్ రాష్ట్రానికి చెందిన ఓంప్రకాశ్ 1981 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. తొలుత బళ్లారి జిల్లా హరపనహళ్లిలో ఏఎస్పీగా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో పనిచేసి 2015 నుంచి 2017 వరకు కర్ణాటక డీజీపీగా వ్యవహరించారు. రిటైర్మెంట్ తర్వాత బెంగళూరులోనే నివసిస్తున్నారు. భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరిగేవని ఇరుగు పొరుగువారు పోలీసులకు తెలిపినట్లు సమాచారం. భార్య, కుమార్తెను పోలీసులు విచారణ నిమిత్తం స్టేషన్‌కు తీసుకెళ్లారు.

ఇంట్లో తుపాకీతో తిరుగుతున్నాడని..

తన భర్త ఇంట్లో తుపాకీతో తిరుగుతున్నాడని, తనను చంపేస్తాడని భయంగా ఉందంటూ ఓంప్రకాశ్ భార్య పల్లవి మూడు రోజుల క్రితం ఐపీఎస్ ఫ్యామిలీ వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ పెట్టారు. తనను, కుమార్తెను వేధిస్తున్నాడని, షూట్ చేస్తానంటూ హింసిస్తున్నాడని పేర్కొన్నారు. ఆయనపై సుమోటో కేసు నమోదు చేయాలని ఆ మెసేజ్‌లో ఆమె డిమాండ్ చేశారు.

లోకం తీరు



మహిళ అంటే?

బ్రిటన్ సుప్రీంకోర్టు తీర్పుపై నిరసన వెల్లువ

హక్కులు కోల్పోతామని ట్రాన్స్‌జెండర్ల ఆందోళన..వేలాదిమంది ర్యాలీ

లండన్, ఏప్రిల్ 20: మహిళ నిర్వచనం గురించి బ్రిటన్ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై నిరసన వెల్లువెత్తింది. లండన్‌లోని పార్లమెంటు స్క్వేర్ వద్ద ఆదివారం వేలాది మంది ట్రాన్స్‌జెండర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. పుట్టుకతో ఉన్న లింగం ఆధారంగానే మహిళగా పరిగణించాలని, లింగమార్పిడి చేయించుకున్నవారికి ఈ నిర్వచనం వర్తించదని బ్రిటన్ సుప్రీంకోర్టు గత బుధవారం తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు వల్ల తాము హక్కులను కోల్పోతామని ఆందోళనకు గురైన ట్రాన్స్‌జెండర్లు మూకుమ్మడిగా ఆందోళనకు దిగారు. మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, ఆస్పత్రి వార్డులు తదితర సేవలను వినియోగించుకునే విషయంలో ఈ తీర్పు ప్రభావం చూపనుందని వారంతా ఆందోళన చెందుతున్నారు. పుట్టుకతో ఉన్న లింగం ఆధారంగానే ఈ సేవలన్నీ వర్తిస్తాయని కోర్టు పేర్కొనడమే దీనికి కారణం. ఈ తీర్పు అనంతరం స్త్రీల మరుగుదొడ్లను లింగమార్పిడి మహిళలు వినియోగించుకోలేరని, ఆస్పత్రిలోని మహిళా వార్డులు, మహిళా క్రీడా బృందాల్లోనూ వారికి చోటు దక్కకపోవచ్చని సమానత్వ-మానవ హక్కుల కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. స్కాట్లాండ్ పాలక మండళ్లలో మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పిస్తూ 2018లో స్కాట్లాండ్ పార్లమెంటు చేసిన చట్టం నేపథ్యంలోనే తాజా తీర్పు వెలువడింది. ట్రాన్స్‌జెండర్ మహిళలు కూడా లింగనిర్ధారణ సర్టిఫికెట్‌తో ఆ కోటాను వినియోగించుకోవచ్చని పార్లమెంటు పేర్కొనడంపై కోర్టు విభేదించింది. లింగ నిర్ధారణ సర్టిఫికెట్ల వల్ల స్త్రీ, పురుష నిర్వచనాల్లో గందరగోళం నెలకొందన్న కోర్టు.. 2010 సమానత్వ చట్టం పేర్కొన్న వివక్ష వ్యతిరేక నిబంధనల్లో పుట్టుకతో వచ్చిన లింగాన్నే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టీకరించినట్టు తెలిపింది.

డీసీసీ చెబితే.. ఏఐసీసీ వింటుంది!

- కాంగ్రెస్‌లో అధికార వికేంద్రీకరణ
- జిల్లా అధ్యక్షులకు విస్తృత అధికారాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయి నుంచీ పార్టీని ప్రక్షాళన చేసి, పునర్ వైభవం సాధించేందుకు కాంగ్రెస్ సన్నద్ధమవుతోంది. ముఖ్యంగా పార్టీ జిల్లా కమిటీలను బలోపేతం చేసి.. జిల్లా అధ్యక్షులకు విస్తృత అధికారాలు, బాధ్యతలు అప్పగించేందుకు సన్నాహాలు చేస్తోంది. 1967 వరకూ పార్టీలో కీలక పాత్ర నిర్వహించిన జిల్లా అధ్యక్షులు.. తర్వాతికాలంలో క్రమంగా ప్రాముఖ్యత కోల్పోయారని, వారికి పూర్వ వైభవం కల్పించాలని అగ్రనేత రాహుల్‌గాంధీ భావిస్తున్నారని ఏఐసీసీ వర్గాలు తెలిపాయి. పీసీసీలకు, డీసీసీలకు నిర్దిష్ట బాధ్యతలు నిర్దేశించాలని నిర్ణయించారని పేర్కొన్నాయి. అనేక అంశాల్లో డీసీసీలకు స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే అధికారం ఇవ్వాలని.. జాతీయ స్థాయిలో తీసుకునే ప్రతీ నిర్ణయం జిల్లా అధ్యక్షుల సలహాలు, సంప్రదింపుల ద్వారా తీసుకోవాలని భావిస్తున్నట్టు వెల్లడించాయి. నిత్యం ప్రజల్లో ఉండే జిల్లా నేతలకే జనం నాడి తెలుస్తుందని.. వారి ఫీడ్‌బ్యాక్ ద్వారా జాతీయ స్థాయిలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం అవసరమని రాహుల్ భావిస్తున్నారని ఏఐసీసీ నాయకుడొకరు వెల్లడించారు. 3నెలల్లో దేశవ్యాప్తంగా జిల్లా కమిటీలను పటిష్ఠం చేయాలని పార్టీ భావిస్తోందని వెల్లడించారు. జిల్లా కమిటీల సూచనల మేరకు పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లను ఖరారు చేసే యోచన కూడా ఉందని తెలిపారు. కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలు నేరుగా డీసీసీలతో టచ్‌లో ఉంటారని, ఇందుకోసం ఏఐసీసీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తారని సీనియర్ నేత ఒకరు తెలిపారు.

చైనా సరికొత్త హైడ్రోజన్ బాంబు!

ప్రయోగాత్మక పరీక్ష విజయవంతం.. పేలుడు కోసం మెగ్నీషియం హైడ్రైడ్ వినియోగం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: అణ్వస్త్రాల తరహాలో కాకుండా సాధారణ బాంబుల్లోనే అత్యధిక విధ్వంసం సృష్టించగల హైడ్రోజన్ బాంబును చైనా విజయవంతంగా పరీక్షించింది. ఏకంగా 1000 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతను వెలువరిస్తూ, కొన్ని సెకన్ల పాటు అగ్ని గోళం (ఫైర్ బాల్) నిలిచి ఉండే ఈ బాంబులతో.. తీవ్రమైన విధ్వంసం జరగడమే కాదు అల్యూమినియం అల్లాయ్ వంటి లోహాలు కరిగి, రక్షణ పరికరాలు, సామగ్రి దెబ్బతింటాయని చెబుతున్నారు. చైనా చేసిన ఈ ప్రయోగాత్మక పరీక్ష వివరాలతో సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక తాజాగా కథనాన్ని ప్రచురించింది. చైనా షిప్ బిల్డింగ్ కార్పొరేషన్ పరిధిలోని '705 రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' ఈ హైడ్రోజన్ బాంబు పరీక్షను నిర్వహించినట్టు తెలిపింది. రెండు కిలోల మెగ్నీషియం హైడ్రైడ్ వినియోగించిన పేలుడు పరికరాన్ని.. నియంత్రిత పరిస్థితుల్లో క్షేత్ర స్థాయిలో పరీక్షించినట్టు వెల్లడించింది. పేలుడు సమయంలో రెండు సెకన్ల పాటు 1000 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతతో కూడిన అగ్నిగోళం ఏర్పడిందని.. అది సంప్రదాయ టీఎన్‌టీ పేలుడు కంటే 15 రెట్లు ఎక్కువని వివరించింది.



మెగ్నీషియం హైడ్రైడ్ ఇంధనంగా..

హైడ్రోజన్‌కు ఆక్సిజన్‌ను జతకలిపినప్పుడు రసాయన చర్య జరిగి నీటిగా మారుతుంది. ఈ క్రమంలో తీవ్రమైన ఉష్ణం వెలువడుతుంది. హైడ్రోజన్‌కు ఉన్న ఈ లక్షణాన్ని ఆధారంగా చేసుకుని బాంబు తయారీ కోసం ఎప్పటి నుంచో ప్రయత్నాలు సాగుతున్నాయి. ఎక్కువ హైడ్రోజన్ ఒకచోట కావాలంటే.. దాన్ని తీవ్ర ఒత్తిడితో ట్యాంకులో నింపాల్సి ఉంటుంది. అలా బాంబు తయారు చేయడం కష్టం. ఈ క్రమంలోనే చైనా శాస్త్రవేత్తలు మెగ్నీషియం హైడ్రైడ్ పొడిని పేలుడు పదార్థంగా వాడి.. బాంబు తయారు చేశారు. ఈ బాంబు పేలడం మొదలవగానే.. మెగ్నీషియం హైడ్రైడ్ పొడి వెదజల్లినట్టుగా అవుతుంది. పేలుడు సమయంలో ఏర్పడే వేడికి కొంత మెగ్నీషియం హైడ్రైడ్ విడిపోయి.. హైడ్రోజన్ వాయువు వెలువడుతుంది. అది అంటుకుని మరింత వేడి ఉత్పత్తి అవుతుంది. ఈ వేడికి మరింత మెగ్నీషియం హైడ్రైడ్ విడిపోయి.. హైడ్రోజన్ వెలువడటం, అది మండిపోయి మరింత వేడిని విడుదల చేయడం ఒక గొలుసుకట్టు చర్యగా జరుగుతుంది. ఈ క్రమంలో పేలుడు పదార్థమంతా మండిపోయేవరకు కొన్ని సెకన్ల పాటు వెయ్యి డిగ్రీల సెల్సియస్‌కుపైగా ఉష్ణోగ్రతతో భారీ అగ్నిగోళం ఏర్పడుతుంది. అది విస్తరిస్తూ.. తీవ్ర విధ్వంసం సృష్టిస్తుంది. అతి తీవ్ర ఉష్ణోగ్రత కారణంగా.. అల్యూమినియం అల్లాయ్ వంటి లోహాలు కరిగిపోతాయి. దానితో రూపొందించే యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, ఇతర రక్షణ పరికరాలు తీవ్రంగా దెబ్బతింటాయి. నిజానికి మెగ్నీషియం హైడ్రైడ్‌ను వివిధ రంగాల్లో శక్తి ఉత్పాదన కోసం వినియోగించేందుకు అభివృద్ధి చేశారు. ఈ పదార్థాన్ని వేడి చేసినప్పుడు హైడ్రోజన్‌ను విడుదల చేస్తుంది. దాన్ని ఇంధనంగా వినియోగిస్తారు.

అణ్వస్త్రాలకు బదులుగా..

సాధారణంగా బాంబులలో టీఎన్‌టీ (ట్రై నైట్రో టోలిన్)ను పేలుడు పదార్థంగా వినియోగిస్తారు. దానికి కొంత పరిమితి ఉంటుంది. భారీ పేలుడు సృష్టించాలంటే ఎక్కువ స్థాయిలో టీఎన్‌టీని వినియోగించాల్సి ఉంటుంది. దీనికి బదులుగానే అణుబాంబులను అభివృద్ధి చేశారు. వాటి పేలుడు తీవ్రతతోపాటు అనంతరం రేడియేషన్ కారణంగా ఏర్పడే దుష్పరిమాణాలు ఎన్నో. ఈ క్రమంలోనే అణ్వస్త్రాల తరహాలో తీవ్ర విధ్వంసం సృష్టిస్తూనే.. తదనంతర దుష్ప్రభావాలు ఉండని బాంబుల రూపకల్పనపై అగ్రరాజ్యాలు దృష్టిపెట్టాయి. రష్యా, అమెరికాలు ఇప్పటికే ఈ తరహా బాంబులను రూపొందించాయి. తాజాగా చైనా ఆ తరహా బాంబును పరీక్షించింది.

నువ్వు ఎన్నికల కమిషనర్ కాదు.. ముస్లిం కమిషనర్‌వి



(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. కాగా, సుప్రీంకోర్టుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నిశికాంత్ దూబేపై కోర్టు ధిక్కరణ కింద క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి అనుమతించాలంటూ అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణికి న్యాయవాది అనాస్ తన్వీర్ ఆదివారం లేఖ రాశారు. సుప్రీంకోర్టుపై, చీఫ్ జస్టి‌స్‌పై నిశికాంత్ దూబే వ్యాఖ్యలు వివాదస్పదం కావడంతో ఈ అంశంపై బీజేపీ అధికారికంగా స్పందించింది. దూబే వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పేర్కొన్నారు. "న్యాయవ్యవస్థపై, సీజేఐపై పార్టీ ఎంపీలు నిశికాంత్ దూబే, దినేశ్ శర్మ చేసిన వ్యాఖ్యలతో బీజేపీకి ఎటువంటి సంబంధం లేదు. ఆ వ్యాఖ్యలు వారి వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే. వారి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం" అని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయవద్దని ఆ ఇద్దరు నేతలతోపాటు పార్టీ శ్రేణులను ఆదేశించినట్టు తెలిపారు. తమకు న్యాయవ్యవస్థపై గౌరవం ఉందని పేర్కొన్నారు. నిశికాంత్ దూబే, మరో ఎంపీ వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని బీజేపీ చీఫ్ నడ్డా తప్పించుకోవడంలో అర్థం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేష్ మండిపడ్డారు. ఆ ఎంపీలు తరచూ తప్పుడు వ్యాఖ్యలు చేస్తూనే ఉంటారని, వారికి పార్టీ షోకాజ్ నోటీసులు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. నడ్డా ప్రకటన కేవలం నష్ట నివారణ ప్రయత్నమని విమర్శించారు.

'హిందీ'పై ఠాక్రేలు ఏకం!

ముంబై, ఏప్రిల్ 20: అన్నదమ్ములు రాజ్ ఠాక్రే, ఉద్ధవ్ ఠాక్రే మళ్లీ చేతులు కలుపబోతున్నారా? మహారాష్ట్రలో ఫడణవీస్ సారథ్యంలోని మహాయుతి ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు హిందీ భాష నేర్చుకోవడం తప్పనిసరి చేస్తూ ఇచ్చిన ఆదేశాలు ఇందుకు దోహదపడతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాజ్.. ఉద్ధవ్ తండ్రి బాల్ ఠాక్రే తమ్ముడి కుమారుడన్న సంగతి తెలిసిందే. తనను కాదని ఉద్ధవ్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించాక ఆయన శివసేనకు దూరమై ఎంఎన్ఎస్‌ను ఏర్పాటు చేసుకున్నారు. కొద్దికాలంగా రాష్ట్రంలో మరాఠీ భాష అమలు కోసం తీవ్ర స్థాయిలో ఉద్యమం చేస్తున్నారు. హిందీ భాషా వివాదం నేపథ్యంలో శనివారం సినీదర్శకుడు మహేశ్ మంజ్రేకర్‌తో పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో రాజ్ మాట్లాడారు. మహారాష్ట్ర ప్రజల కోసం చిన్న చిన్న విభేదాలను పక్కనపెట్టేందుకు తాను సిద్ధమని రాజ్ స్పష్టంచేశారు. 'మహారాష్ట్ర ప్రయోజనం నాకు సర్వోచ్చం. ఉద్ధవ్‌తో కలిసి పనిచేసేందుకు నేను సిద్ధం. మరి ఆయన సంసిద్ధంగా ఉన్నారా అనేదే ప్రశ్న. రెండు పార్టీల మధ్య విభేదాలు మహారాష్ట్రకు, మరాఠా ప్రజలకు చాలా ఇబ్బందికరంగా పరిణమించాయి' అని వ్యాఖ్యానించారు. దీనిపై ఉద్ధవ్ కూడా వేగంగా స్పందించారు. 'మరాఠా భాష కోసం, మహారాష్ట్ర ప్రజల కోసం మా విభేదాలను పక్కనపెట్టేందుకు నేనూ సిద్ధమే' అని ప్రకటించారు. అయితే బీజేపీ పేరెత్తకుండా.. మహారాష్ట్ర వ్యతిరేక శక్తులకు రాజ్ దూరంగా ఉండాలన్నారు. ఈ అంశంపై ఉద్ధవ్ సన్నిహితుడు, ఎంపీ సంజయ్ రౌత్ కూడా స్పందించారు. 'రాజ్, ఉద్ధవ్ సోదరులు. వారి బంధం తెగిపోలేదు. ఇప్పుడు పొత్తులేమీ లేవు. కుటుంబ సంబంధంగా భావోద్వేగ చర్చలు మాత్రమే నడుస్తున్నాయి' అని తెలిపారు. కాగా, కొద్ది నెలల్లో రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరుగనున్నాయి. ఎంఎన్ఎస్‌తో చేతులు కలిపితే పుంజుకోవచ్చని ఉద్ధవ్ శివసేన భావిస్తోంది. అందుకే రాజ్‌తో పొత్తు కోసం ఉద్ధవ్ చూస్తున్నారని.. హిందీ వ్యతిరేక ఉద్యమం ఇందుకు ఉపకరిస్తుందని భావిస్తున్నారని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మరోవైపు.. రాజ్, ఉద్ధవ్‌లు కలవడాన్ని బీజేపీ స్వాగతిస్తుందని ఫడణవీస్ అన్నారు. విభేదాలు పరిష్కరించుకుంటే సంతోషదాయకమే కదా అని వ్యాఖ్యానించారు.



హిందీ వ్యతిరేకతపై ఫడణవీస్ విస్మయం

మహారాష్ట్ర ప్రతిపక్షాలు హిందీని వ్యతిరేకిస్తూ ఆంగ్ల భాషను వెనకేసుకు రావడం ఆశ్చర్యంగా ఉందని సీఎం ఫడణవీస్ అన్నారు. మరాఠీకి ఎవరైనా ఆటంకం కలిగిస్తే ఊరుకునేదే లేదని ఆయన హెచ్చరించారు. మహారాష్ట్రలో మరాఠీని అందరూ తప్పనిసరి నేర్చుకోవాల్సిందేనని, మిగతా భాషలు నేర్చుకోవాలా వద్దా అనేది వారి వ్యక్తిగతమని స్పష్టం చేశారు. అయితే మహారాష్ట్రలో 1-5తరగతుల వరకు మూడో భాషగా హిందీని ప్రభుత్వం తప్పనిసరి చేయడాన్ని ఆ రాష్ట్ర భాష సలహా కమిటీ వ్యతిరేకించింది. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ఆదివారం ఫడణవీస్‌కు లేఖ రాసింది.

నేషనల్ హెరాల్డ్ కేసు కాంగ్రెస్‌ను భయపెట్టడానికే

- బిహార్ బహిరంగ సభలో ఖర్గే

బక్సర్, ఏప్రిల్ 20: కాంగ్రెస్ పార్టీని భయపెట్టేందుకే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ పేర్లను చేర్చిందని ఏఐసీసీ చీఫ్ ఖర్గే ఆరోపించారు. బిహార్‌లోని బక్సర్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ తాము ఎవ్వరికీ భయపడబోమన్నారు. ఈ కేసులో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు సోదాలు చేపట్టాయని, వారికి ఏమీ దొరకలేదని చెప్పారు. బిహార్‌లో అధికారం కోసం సీఎం నితీశ్ పార్టీలు మారుతుంటారని ఖర్గే ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ బిహార్‌కు ఇస్తామన్న 1.25 లక్షల కోట్ల ప్యాకేజీ సంగతి ఏమైందని ఖర్గే ప్రశ్నించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేను ఓడించాలని ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు. మరోవైపు నేషనల్ హెరాల్డ్ కేసులో బీజేపీ అబద్ధాలను వెల్లడించేందుకు ఈ నెల 21 నుంచి 24 వరకు 57 నగరాల్లో కాంగ్రెస్ నేతలు ప్రెస్ కాన్ఫరెన్సులు నిర్వహిస్తారని ఆ పార్టీ అధికార ప్రతినిధి పవన్ ఖేరా తెలిపారు.


యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ దర్శన క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

యాదగిరిగుట్టలో భక్తుల సందడి

దర్శించుకున్న 45వేల మంది భక్తులు.. రామయ్యను దర్శించుకున్న సీపీ ఆనంద్


రామయ్య సన్నిధిలో కుటుంబ సభ్యులతో సీపీ సీవీ ఆనంద్

యాదగిరిగుట్ట రూరల్, భద్రాచలం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వారాంతపు సెలవు దినం కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులతో కొండపైన ఆలయ తిరువీధులు, స్వామివారి ఉభయ దర్శనాల క్యూలైన్లు నిండిపోయాయి. ధర్మదర్శనానికి మూడు గంటలు, ప్రత్యేక దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. సుమారు 45వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. మరోవైపు భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామిని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు డీజీ సీవీ ఆనంద్‌కు ఆశీర్వచనం చేశారు.


ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దంటూ రాసివున్న జయచంద్ర చొక్కా, జయచంద్ర(ఫైల్)

ఆన్‌లైన్ గేమ్స్‌కు యువకుడి బలి

- ప్లీజ్.. ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దని చొక్కాపై లేఖ
- ఆపై రైలు కింద పడి ఆత్మహత్య.. ఏపీలో ఘటన

హిందూపురం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): 'ప్లీజ్.. ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దు. విద్యార్థులూ.. ప్లీజ్ ఆన్‌లైన్ గేమ్ యాప్స్‌ను క్లోజ్ చేయండి' అని చొక్కాపై రాసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఏపీలోని శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం ఫైడేటి గ్రామానికి చెందిన జయచంద్ర (23) డిగ్రీ వరకు చదువుకున్నాడు. రెండేళ్లుగా గ్రామంలో ఓ ప్రైవేటు డెయిరీ నడుపుతున్నాడు. మూడు నెలలుగా పాల రైతులకు రూ.3 లక్షలు చెల్లించాల్సి ఉంది. దీంతో రైతుల నుంచి ఒత్తిడి పెరిగింది. దీనికి తోడు మరికొంత మంది వద్ద రూ.3 లక్షల వరకు అప్పులు చేశాడు. ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటు పడి డబ్బు పోగొట్టుకున్నాడని, దీనివల్ల అప్పులపాలయ్యాడని సమాచారం. నెల క్రితం పాల వ్యాపారం ఆపేశాడు. ఈ నేపథ్యంలో ఉద్యోగం కోసం బెంగళూరు వెళ్తానని చెప్పి శనివారం ఫైడేటి నుంచి బయల్దేరాడు. రాత్రి హిందూపురం పట్టణ పరిధిలోని గుడ్డం సమీపంలో రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. తల, మొండెం వేరు పడ్డాయి. మృతుడి చొక్కాపై, పక్కనే పడిపోయిన ఓ కాగితంపై ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దని రాసి ఉంది. రైల్వే పోలీసులు వీటిని గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

తెలుగుజాతి అభ్యున్నతికి పునరంకితమవుతా

- 2047 నాటికి ప్రపంచంలోనే శక్తిమంతంగా ఉండాలి
- నాకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన అందరికీ ధన్యవాదాలు : చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం.. తెలుగు ప్రజల అభ్యున్నతి కోసం పునరంకితమవుతానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఆయన 'ఎక్స్'లో ధన్యవాదాలు తెలియజేశారు. '75 ఏళ్ల నా జీవన ప్రయాణంలో, 47 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో నాకు ఎప్పుడూ తోడునీడగా ఉండి, ముందుకు నడిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ప్రజాసేవ చేసేందుకు నాలుగోసారి సీఎంగా అవకాశం కల్పించిన తెలుగు ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. తెలుగు సమాజం పురోగతి కోసం అలుపు లేకుండా పనిచేసేలా మీరంతా నాలో ఉత్సాహం నింపారు. మీ భవిష్యత్ కలలు, ఆకాంక్షలను సాకారం చేయడానికి నిరంతరం కష్టపడి పనిచేస్తానని మాటిస్తున్నాను' అని ప్రజలకు హామీ ఇచ్చారు. స్వర్ణాంధ్ర- 2047 విజన్ అందరి ఆకాంక్షల సమాహారమన్నారు. అందరి సహకారంతో ఆ కలను నిజం చేస్తానని తెలిపారు. '2047నాటికి ప్రపంచంలోనే శక్తిమంతమైన జాతిగా తెలుగుజాతిని నిలపాలన్నది నా అభిలాష. ఏపీని ప్రపంచ ఆవిష్కరణలకు, అవకాశాలకు కేంద్రం గా తీర్చిదిద్దాలన్నదే నా తపన, 'థింక్ గ్లోబల్లీ- యాక్ట్ గ్లోబల్లీ' విధానంతో రాష్ట్రాన్ని నాలెడ్జ్ ఎకానమీ కేంద్రం గా తీర్చిదిద్దుకుందాం. పేదరికం లేని సమాజమే నా సంకల్పం. అందుకే పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. మూడు దశాబ్దాల నాడు నేను ప్రవేశపెట్టిన జన్మభూమి సమాజంలో ఎంతో మార్పు తెచ్చింది. ఈసారి తీసుకొచ్చిన పీ4 రాష్ట్రంలోని పేద కుటుంబాలను స్వర్ణ కుటుంబాలుగా చేయాలన్నది నా ప్రయత్నం. దేశభక్తి చాటేలా వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు చేయిచేయి కలుపుదాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.



బసవతారకం ఆస్పత్రిలో ఆదివారం నాడు కేక్ కట్ చేస్తున్న ఎన్టీఆర్ మనవళ్లు నందమూరి చైతన్యకృష్ణ, గారపాటి శ్రీనివాస్, తదితరులు.. ఎన్టీఆర్ భవన్‌లో చంద్ర దర్శనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ రవిచంద్ర, తెలుగుదేశం నాయకులు

హ్యాపీ బర్త్‌డే టూ యూ..

- సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబునాయుడి పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబుకు.. భగవంతుడు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని, ప్రజలకు మరింత సేవ చేసే శక్తినివ్వాలని కోరుకుంటున్నానంటూ ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు ఫొటోను కూడా రేవంత్ ట్యాగ్ చేశారు.

చంద్రబాబుకు శుభాకాంక్షల వెల్లువ

హైదరాబాద్/బంజారాహిల్స్/నార్సింగి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబుకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మరింత సుభిక్షంగా పాలన అందించేందుకు దేవుడు చంద్రబాబుకు మరింత శక్తినివ్వాలని కోరుతున్నానని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిరంతరం ప్రజాసేవకు అంకితమై పనిచేసే చంద్రబాబు ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్ల సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. చంద్రబాబుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హ్యాపీబర్త్‌డే చంద్రబాబు నాయుడు (సీబీఎన్)అంటూ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు ప్రకటించారు. చంద్రబాబుకు మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 75 ఏళ్ల వయస్సులో కూడా యువలోకం ఊహించే నవలోకం సృష్టించే సత్తా చంద్రబాబులో ఉందని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. చంద్రబాబు జన్మదినం సందర్భంగా ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ నాయకులు 75 కిలోల కేక్ కట్‌చేశారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, అరవింద్ కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు జూబ్లీహిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నాయకులు చంద్రబాబు, ఆయన కుటుంబసభ్యుల పేరిట ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బంటు వేంకటేశ్వర్లు, నందమూరి సుహాసిని, కాట్రగడ్డ ప్రసూన, ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవో కె. రాజేంద్రకుమార్, సీఓఓ గోపి తదితరులు పాల్గొన్నారు.

బసవతారకం ఆస్పత్రిలో..

వయస్సుతో నిమిత్తం లేకుండా ఏపీ రాజధాని అమరావతిని హైదరాబాద్‌కు ధీటుగా అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు శ్రమిస్తున్నారని ఎన్టీఆర్ మనవళ్లు నందమూరి చైతన్యకృష్ణ, గారపాటి శ్రీనివాస్ అన్నారు. సీబీఎన్ ఫోరం, బసవతారకం క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సంయుక్తాధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో చంద్రబాబు జన్మదిన వేడుకల్లో వారు పాల్గొని మాట్లాడారు. మణికొండ పంచవటి కాలనీలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. సినీ నటుడు, మాజీ ఎంపీ మురళీమోహన్. నందమూరి రామకృష్ణ, నందమూరి సుహాసిని ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

తిరుమలలో 'భాష్యం' ఒకరోజు అన్నదానం

చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా ఆదివారం తిరుమలలో ఒకరోజు అన్నదానం చేశారు. భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ ఇందుకోసం రూ. 44 లక్షలు విరాళంగా అందజేశారు.

సైబర్ నేరగాళ్లకు కమీషన్‌పై ఖాతాల అందజేత

- ముంబై యువకుడిని అరెస్ట్ చేసిన సైబర్ క్రైం పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లకు కమీషన్ పద్ధతిలో బ్యాంకు ఖాతాలు సమకూర్చుతూ సహకరిస్తున్న ముంబై యువకుడిని హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. నవీ ముంబైలో ఉంటున్న రష్మిత్ రాజేంద్ర పాటిల్ (22) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపి వారికి బ్యాంకు ఖాతాలు సమకూర్చడం మొదలుపెట్టాడు. సైబర్ నేరగాళ్లు తాము మోసం చేసి కాజేసిన సొమ్మును రష్మిత్ ఇచ్చిన ఖాతాలకు బదిలీ చేసేవారు. వాటిలోకి వచ్చిన డబ్బులో కొంత కమీషన్ తీసుకొని మిగతా డబ్బును వారు చెప్పిన ఖాతాలకు బదిలీ చేస్తున్నాడు. ఇదిలాఉండగా.. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి (56)ని షేర్ మార్కెట్లో పెట్టుబడి పేరుతో మోసం చేసిన సైబర్ నేరగాళ్లు ఆయన నుంచి రూ.2.43 కోట్లు వసూలు చేశారు. ఈ డబ్బును రష్మిత్ అందించిన బ్యాంకు ఖాతాల్లో జమ చేయించారు. బాధితుడు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రష్మిత్ సమకూర్చిన బ్యాంకు ఖాతాల్లో బాధితుడి డబ్బు డిపాజిట్ అయినట్లు గుర్తించారు. సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ పి. ప్రమోద్, ఎస్సై షేక్ అజీజ్‌ల బృందం ముంబై వెళ్లి నిందితుడు రష్మిత్‌ను అరెస్ట్ చేసి నగరానికి తరలించారు.

క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో యువకుడి మృతి

- మేడ్చల్ జిల్లా కీసరలో ఘటన


ప్రణీత్ (ఫైల్)

కీసరరూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆదివారం కదా అని సరదాగా క్రికెట్ ఆడేందుకు వచ్చిన ఓ యువకుడు గ్రౌండ్‌లోనే గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన మేడ్చల్ జిల్లా కీసరలో జరిగింది. ఓ ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్న సికింద్రాబాద్ బోయిన్‌పల్లికి చెందిన ప్రణీత్ (32) ఆదివారం కార్యాలయానికి సెలవు కావడంతో క్రికెట్ ఆడేందుకు తన మిత్రులతో కలిసి నాగారం మునిసిపాలిటీ రాంపల్లి దాయరలోని త్యాగి క్రికెట్ గ్రౌండ్‌కు వచ్చాడు. ఆట మధ్యలో ప్రణీత్ ఒక్కసారిగా తీవ్ర గుండెపోటుకు గురయ్యాడు. మిత్రులు అతడిని సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ప్రణీత్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

బైక్‌ను తప్పించబోయి

ఆర్టీసీ బస్సు బోల్తా

- బస్సు డ్రైవర్ సహా 25 మందికి గాయాలు
- సూర్యాపేటజిల్లా చింతలపాలెం వద్ద ప్రమాదం

హైదరాబాద్/ మేళ్లచెర్వు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల కేంద్ర సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులతోపాటు డ్రైవర్ సహా బస్సులోని 25 మందికి గాయాలయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం కోదాడ డిపో ఆర్టీసీ బస్సు మేళ్లచెర్వు మండల కేంద్రంలో 65 మంది ప్రయాణికులతో చింతలపాలెం మండలం నక్కగూడెం బయలుదేరింది. చింతలపాలెం మండల కేంద్రానికి సమీపాన ప్రమాదకర మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను బస్సు డ్రైవర్ తప్పించబోయాడు. ఈ ప్రయత్నంలో డివైడర్‌ను ఢీకొట్టిన బస్సు బోల్తా పడింది. దీంతో బైక్ నడుపుతున్న ప్రైవేటు సిమెంట్ ఫ్యాక్టరీ సెక్యూరిటీ గార్డు బనిగెలపాటి చినకోటిలింగ, మేళ్లచెర్వు మండలం శివబాలాజీ నగర్ తండా వాసులు బానోత్ వెంకటేశ్వర్లు, బానోత్ గోపి, బస్సు డ్రైవర్ నర్సయ్య సహా 25 మంది గాయపడ్డారు. నాలుగు అంబులెన్స్‌ల ద్వారా క్షతగాత్రులను హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన నలుగురు క్షతగాత్రులకు సూర్యాపేట జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉన్న ఇద్దరు క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జిల్లా వైద్యాధికారికి ఫోన్ చేసి క్షతగాత్రులందరికీ మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆదేశించారు. బస్సు బోల్తా పడిన సమాచారం తెలియగానే స్థానిక యువత అక్కడికి చేరుకుని సహాయ చర్యల్లో పాలుపంచుకున్నారు. బస్సు డ్రైవర్ నర్సయ్యపై కేసు నమోదు చేసినట్లు చింతలపాలెం ఇన్‌చార్జి ఎస్ఐ పరమేష్ తెలిపారు.

అతి వేగం.. అజాగ్రత్త

- కారు అదుపుతప్పి ఓఆర్ఆర్‌పై ఇద్దరు ఐటీ ఉద్యోగుల దుర్మరణం
- నిజామాబాద్ జిల్లాలో లారీ ఢీకొని ఇద్దరు బాలుర మృతి
- అదే జిల్లాలో కూలీలపైకి ట్రాక్టర్.. ఒకరి మృత్యువాత



భానుప్రసాద్ (ఫైల్)

దుండిగల్/ఆర్మూర్ టౌన్/ సిరికొండ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆదివారం రహదారులు నెత్తురోడాయి. హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై, నిజామాబాద్ జిల్లాలో జరిగిన మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఒడిశాకు చెందిన భానుప్రకాశ్ (36), నలీన్ కంటబిస్వాల్ (36) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. కోకాపేటలో ఉంటున్న వీరు ఆదివారం తెల్లవారుజామున మేడ్చల్ నుంచి పటాన్‌చెరుకు కారులో బయలుదేరారు. మల్లంపేట వద్ద కారు అదుపు తప్పి వేగంగా డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరి తలలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదానికి అతి వేగం, అజాగ్రత్తే కారణమేనని పోలీసులు భావిస్తున్నారు. మరో ఘటనలో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పెర్కిట్ 44వ జాతీయ రహదారిపై లారీ బైక్‌ను ఢీకొని ఇద్దరు బాలురు మరణించగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆర్మూర్ అశోక్‌నగర్‌కు చెందిన బంజ విశ్వనాథ్ ఆదివారం పెర్కిట్‌లో ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు తన కుమారుడు ఓంకార్ (14) అతడి స్నేహితుడు భానుప్రసాద్ (11)ను బైక్‌పై తీసుకొని బయల్దేరాడు. పెర్కిట్ 44వ జాతీయ రహదారి వద్ద రోడ్డు దాటుతుండగా నిర్మల్ నుంచి వస్తున్న ఓ లారీ వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో భానుప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందగా గాయాలపాలైన తండ్రీ కుమారులు విశ్వనాథ్, ఓంకార్‌ను పోలీసులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఓంకార్ మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన విశ్వనాథ్‌ను ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. అదే జిల్లా సిరికొండ మండలం కొండాపూర్‌లో రోడ్డు పక్కన నిద్రిస్తున్న కూలీలపైకి ట్రాక్టర్ దూసుకెళ్లిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. కొండాపూర్ గ్రామశివారులో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించేందుకు బిహార్ నుంచి వచ్చిన కూలీలు లారీలోకి ఎక్కించారు. అనంతరం వారిలో ముగ్గురు రోడ్డు పక్కన చెట్టు కింద సేద తీరుతుండగా ఓ ట్రాక్టర్ వారిపై నుంచి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో భూమశ్రీ (50) అనే కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు కూలీలు చింటు, గోవింద్‌కు తీవ్ర గాయాలవగా వారిని ఆస్పత్రికి తరలించారు. తప్పతాగి వాహనం నడిపిన ట్రాక్టర్ డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16,347 పోస్టులతో

ఏపీలో మెగా డీఎస్సీ

(మొదటిపేజీ తరువాయి)



వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు, స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీ పోస్టులకు ఒక నోటిఫికేషన్ ఇచ్చింది. మోడల్ స్కూళ్లు, సంక్షేమ సొసైటీల్లో పోస్టులకు మరొక నోటిఫికేషన్ జారీ చేసింది. ఆదివారం నుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. అభ్యర్థులు మే 15వ తేదీ వరకు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. పోస్టులకు సంబంధించిన సిలబస్‌ను కూడా పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. జూన్ 6 నుంచి జూలై 6 వరకు నిర్వహించే పరీక్షలను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. 'ఫస్ట్ కమ్ ఫస్ట్' విధానంలో అభ్యర్థులకు పరీక్షా కేంద్రాలు కేటాయిస్తారు. డీఎస్సీ దరఖాస్తులకు ప్రభుత్వం వయోపరిమితిని సడలించింది. 2024 జూలై 1 కటాఫ్ తేదీతో 18 నుంచి 44 ఏళ్ల వయసున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వుడు కేటగిరీ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితి 49ఏళ్లు, దివ్యాంగులకు 54ఏళ్లుగా నిర్ణయించింది. మరిన్ని వివరాలకు అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

మూడు ప్రధాన మార్పులు

గత డీఎస్సీలతో పోలిస్తే ఈసారి ప్రధానంగా మూడు మార్పులు చేశారు. గతంలో దరఖాస్తు సమయంలో అభ్యర్థులు సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం ఉండేది కాదు. దానివల్ల పరీక్షల అనంతరం సర్టిఫికెట్ల పరిశీలనకు ఎక్కువ సమయం పట్టేది. ప్రస్తుత డీఎస్సీలో దరఖాస్తు సమయంలోనే అభ్యర్థులు అన్ని రకాల అర్హత సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలి. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) వివరాలు కూడా సమర్పించాలి. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లను తొలుత పాఠశాల విద్యాశాఖ పరిశీలిస్తుంది. అనంతరం సాధారణ విధానంలో పరిశీలన ఉంటుంది.

- ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటే ముందే ప్రాధాన్యాలు ఇవ్వాలి. అంటే ఒకే అభ్యర్థి గణితం, సైన్స్ రెండు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకుంటే తొలుత ఏ పోస్టు కావాలో ప్రాధాన్యం పేర్కొనాలి. తుది ఎంపికలో రెండు పోస్టులకు అర్హత సాధిస్తే తొలి ప్రాధాన్యానికి అనుగుణంగా ఎంపిక చేస్తారు. మిగిలినవి రద్దు అవుతాయి. దీనివల్ల పరీక్షల అనంతరం మళ్లీ ప్రాధాన్యాల ఎంపిక వివాదాలు తలెత్తవు.
- గతంలో తుది ఫలితాలు ప్రకటించాక కూడా పోస్టులు మిగిలిపోతే డీఎస్సీలో తర్వాత మెరిట్‌ను తీసుకునేవారు. అందుకోసం తొలుత ప్రొవిజినల్ జాబితా ప్రకటించేవారు. ప్రస్తుత డీఎస్సీలో నేరుగా తుది జాబితా ప్రకటిస్తారు. పోస్టుకు ఒకరిని చొప్పున ఎంపిక చేస్తారు. ఏవైనా కారణాలతో ఎంపిక చేసినవారు చేరకుండా పోస్టులు మిగిలిపోతే, వాటిని తర్వాత నోటిఫికేషన్‌కు క్యారీ ఫార్వర్డ్ చేస్తారు. మెరిట్‌లో తర్వాత వారికి అవకాశం ఇవ్వరు. దీనివల్ల న్యాయ వివాదాలు ఏర్పడవని అధికారులు చెబుతున్నారు.

1200 కోట్ల ప్రభుత్వ భూమి పంచుకున్నారు

- ఏళ్లుగా 2 సొసైటీల పోరు
- ఫోర్జరీ పత్రాలతో చెరబట్టేందుకు మరొకరి యత్నం
- రాజీకి వచ్చిన సొసైటీలు.. వాటాలు వేసుకున్నాయి
- సర్కారు స్థలమని తేల్చిన రెవెన్యూ అధికారులు


స్థలం చుట్టూ ప్రహరీ, సూచిక బోర్డు పెట్టిన అధికారులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఎక్కడైనా భూమి బంగారమే.. అదే నగరం నడిబొడ్డున ఖరీదైన బంజారాహిల్స్‌లోని రోడ్ నంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీ రోడ్డు సమీపాన గల ఏసీబీ కార్యాలయం ఎదురుగా 102/1 సర్వేనంబర్‌లోని 12 ఎకరాల ప్రభుత్వ భూవి విలువ సుమారు రూ.1200 కోట్లపై మాటే. అత్యంత విలువైన ఈ భూమిపై రెండు సొసైటీలు కన్నేశాయి. తమదంటే తమదంటూ బంజారా కుంజ్ రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్, యమునా నగర్ కోఆపరేటివ్ సొసైటీ స్వాధీనం చేసుకునేందుకు పోటీ పడ్డాయి. ఆ సొసైటీల మధ్య కొన్నేళ్లుగా గొడవలు జరిగాయి. క్రిమినల్ కేసులూ నమోదయ్యాయి. రెండు సొసైటీల ప్రతినిధులూ డాక్యుమెంట్లు సృష్టించి యాజమాన్య హక్కులు తమవంటే తమవని కోర్టుకూ వెళ్లారు. మధ్యలో మరో ప్రైవేటు వ్యక్తి ఫోర్జరీ సంతకాలతో తప్పుడు పత్రాలు సృష్టించి.. భూమిని చెరబట్టేందుకు ప్రయత్నించాడు. ఈ పరిస్థితుల్లో ఆ రెండు సొసైటీల ప్రతినిధులు రాజీకి వచ్చి మధ్యేమార్గంగా భూమిని పంచుకుని సరిహద్దులు నిర్ణయించుకున్నారు. బంజారా కుంజ్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్.. తమ భవనం వైపు కొంత స్థలంలో గది నిర్మిస్తే.. యమునా నగర్ కోఆపరేటివ్ సొసైటీ హద్దులు నిర్ణయించింది. ఇంత జరుగుతున్నా ఇటువైపు చూడని షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు ఇటీవల రికార్డులు తనిఖీ చేశారు. తమ పరిధిలోని హకింపేట గ్రామం టీఎస్-193 వార్డు లోపల 102/2 సర్వేనంబర్‌లోని 12 ఎకరాల భూమి సర్కారుదేనని నిర్ధారించారు. ఆ వెంటనే షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి, తమ సిబ్బందితో కలిసి రంగంలోకి దిగారు. నిర్మాణాలు కూల్చేసి స్థలం స్వాధీనం చేసుకుని.. దాని చుట్టూ ఇనుప కడ్డీలతో ప్రహరీ, నీలిరంగు షీట్లు ఏర్పాటుచేశారు.

తెలంగాణ ప్రభుత్వము
మహిళా, శిశు, వికలాంగుల మరియు వయో వృద్ధుల శాఖ:: నిజామాబాదు జిల్లా

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

నెం.A/1192/2023 తేది:19.04.2025, నిజామాబాదు జిల్లాలోని 05 ఐసిడియస్ ప్రాజెక్టుల పరిధిలోని (1500) అంగన్‌వాడి కేంద్రాలకు కందిపప్పును (01 Kg) కిలో ప్యాకెట్ చొప్పున సరఫరా చేయుటకు ఆసక్తి గల ప్రభుత్వ వాణిజ్య పన్నుల శాఖ నందు రిజిస్టర్ అయిన వ్యాపారస్తులు మరియు ప్రభుత్వ ఏజెన్సీల నుండి ఒక సంవత్సర కాలపరిమితితో టెండర్ కోర్నైనది. ఆన్‌లైన్ నందు బిడ్ ప్రారంభ తేది: 21.04.2025 11.00 గంటల నుండి మరియు బిడ్ దాఖలుకు చివరి తేది: 28.04.2025 ఉదయం: 10.30 గం.ల వరకు స్వీకరించబడును. కందిపప్పును బయో-మెట్రిక్ విధానము ద్వారా సరఫరాదారే నేరుగా (1500) అంగన్‌వాడి కేంద్రాల వరకు సరఫరా చేయవలసి ఉంటుంది. టెండరుదారు ప్యాకింగ్ ఛార్జీలు, ముద్రణ ఛార్జీలు, లోడింగ్ మరియు అన్‌లోడింగ్ ఛార్జీలు, రవాణా మరియు పన్నులు వగైరాలతో సహా ఒక కిలోకు ధరను కోట్ చేయవలెను. మిగతా వివరాలను https://tender.telangana.gov.in నందు పొందగలరు. టెండర్ ప్రాసెసింగ్ ఫీజు (రూ.10,000/-) మరియు ఇ.ఎం.డి (వివరాలకు టెండర్ షెడ్యూల్ నందు చూడగలరు) District Welfare Officer, Women, Children, Disabled & Senior Citizen, Nizamabad వారి పేరు మీద డి.డి. ఆర్డర్ చేయవలెను. టెండర్‌ను, ఆన్‌లైన్‌లో https://tender.telangana.gov.in నందు మాత్రమే దాఖలు చేయవలెను. ఇ.ఎం.డి మరియు ప్రాసెసింగ్ ఫీజును చెల్లించని టెండర్ దరఖాస్తును తిరస్కరించబడును. ఇ.ఎం.డి విషయంలో ఎవరికి మినహాయింపు లేదు. ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన ప్రతి డాక్యుమెంట్లను టెండర్ తెరిచే సమయములో ఒరిజినల్స్ సమర్పించగలరు. టెండర్ ప్రచురణ తేది: 21.04.2025, ఆన్‌లైన్ నందు టెండర్ షెడ్యూల్ అమ్మకం ప్రారంభ తేదీ మరియు సమయం: 21.04.2025 (ఉదయం 11.00 గం.లకు), ఆన్‌లైన్ టెండర్ షెడ్యూల్ అమ్మకం ముగింపు తేది మరియు సమయం: 28.04.2025 (ఉదయం 10.30 గం.లకు), ఆన్‌లైన్ టెండర్ దాఖలుకు ముగింపు తేది మరియు సమయం: 28.04.2025 (ఉదయం: 10.30 గం.లకు), టెక్నికల్ బిడ్ తెరిచే తేది మరియు సమయం: 28.04.2025 (ఉదయం 11.30 గం.లకు), ఫైనాన్షియల్ బిడ్ తేదీ మరియు సమయం: 28.04.2025 (మధ్యాహ్నం 03.00 గం.లకు) సం/- అదనపు కలెక్టరు / చైర్మన్, జిల్లా కొనుగోలు కమిటీ, నిజామాబాదు

DIPR RO.No.604-PP/CL/ADVT/1/2025-26, Dt: 20.04.2025

తెలంగాణ ప్రభుత్వం
కలెక్టర్ కార్యాలయం (పంచాయతీ విభాగం), జయశంకర్ భూపాలపల్లి

No.367/A2/2024 సంక్షిప్త టెండరు ప్రకటన తేది: 19.04.2025

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలోని కాళేశ్వరం గ్రామపంచాయతీ వద్ద **సరస్వతి పుష్కరాలు - 2025కు శానిటేషన్ మెటీరియల్ & ఎలక్ట్రికల్ మెటీరియల్ (లైటింగ్)** సరఫరా కోసం సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి: **1. శానిటేషన్ మెటీరియల్స్: ఐటమ్-1:** బ్లీచింగ్ పౌడర్, సున్నం, సెంటెడ్ ఫినాయిల్, బ్లాక్ ఫినాయిల్. **ఐటమ్-2:** హ్యాండ్ స్ప్రేయర్ విత్ స్టిక్ (పార), గడ్డపార, ప్లాస్టిక్ గంప (డబ్బా), బ్రూమ్‌స్టిక్స్ (చీపురుకట్టలు), ప్లాస్టిక్ బకెట్లు, ప్లాస్టిక్ క్యాన్లు, మగ్గులు, గ్లౌజులు, పొల్యూషన్ మాస్కులు, డస్ట్‌బిన్ బిన్స్, వైట్ గార్బేజ్ బ్యాగులు, బ్లాక్ గార్బేజ్ బ్యాగులు, లేబర్ రేడియం జాకెట్లు, టార్చ్‌లైట్లు మరియు ఫ్లెక్సీ. **2. ఎలక్ట్రికల్ మెటీరియల్స్:** ఎల్ఈడి బల్బులు, హోల్డర్లు, స్విచ్చులు, స్విచ్‌బోర్డులు, వైర్లు మొ.వి. 1. టెండరు నోటిఫికేషన్: 21.04.2025. 2. టెండరు ఫారాల అమ్మకం షెడ్యూలు: 21.04.2025 నుండి 25.04.2025 మ.12.00 గం. వరకు కార్యాలయ పని రోజులలో. 3. పూర్తిచేసిన టెండరు ఫారాల దాఖలుకు చివరి తేది: 25.04.2025 మ.2.00 గం. 4. టెండరు షెడ్యూలు తెరుచు తేది: 25.04.2025 సా.4.00 గం. ప్రతీ టెండరు షెడ్యూలు కోసం **రూ.10,000/- (పది వేల రూపాయలు మాత్రమే)**లను డి.డి. రూపంలో చెల్లించి జిల్లా పంచాయతీ అధికారి, జయశంకర్ భూపాలపల్లి నుండి కొనుగోలు చేయవచ్చును మరియు ఇతర నియమ నిబంధనలను పొందవచ్చును. బయానాగా మొత్తం **రూ.1,00,000/- (ఒక లక్ష రూపాయలు మాత్రమే)**లను District Panchayat Officer, Jayashankar Bhupalpally పేరున ప్రతీ టెండరు షెడ్యూలుతో పాటు జతచేయవలెను. సం/- అడిషనల్ కలెక్టర్ (ఆర్), జయశంకర్ భూపాలపల్లి తరపున

DIPR RO No.575-PP/CL/ADVT/1/2025-26, తేది: 19.04.2025

OFFICE OF THE DISTRICT MARKETING OFFICE KARIMNAGAR

Tender Notice No. DMO/K/JA/274/2024 Date: 19.04.2025

SHORT TENDER NOTICE

The District Purchase Committee, Karimnagar, invites sealed tenders for Supply, Commissioning and Installation of (8) Mobile Grain Dyers for use at various Paddy Purchase Centers (PPCs) in AMCs in Karimnagar District during the Yasangi (Rabi) Marketing Season 2024-25. **Specifications: Tractor Compatibility:** The machine should be able to operate with standard small tractors of below 25 **HP. Drying & tempering System:** It shall employ a mixed — flow design an integrated tempering chamber and grain Recirculation to ensure uniform drying and minimize breakage. **Drive & Protection:** Shall feature a single integrated drive system with optimized airflow (via Axial fan) and built-in PTO speed protection to reduce tractor load and prevent damage. **Burner & Automation: the machinery shall be equipped with** An auto-ignition burner, An automated feeding, User-friendly controls, and Essential weather protection. **Complete Specifications are issued in Tender Document, Submission Details:** Earnest Money Deposit (EMD): Rs. 1,00,000 (Rupees One Lakh only), drawn in favor of the District Marketing Officer, Mancherial. **1.** Sale of Tender document From : 21.04.2025 10.30 a.m. To : 02.05.2025 up to 01.00 p.m. during Office working Hours **2.** Cost of Tender Schedule: Rs. 1000/- (Rs. Thousands only) Non-Refundable **3.** Last Date for Submission: 02.05.2025 up to 01.00 p.m. **4** Opening Date: 02.05.2025 at 03.00 p.m. **5.** Address for Submission: District Marketing Office, Karimnagar **6.** Contact Information: 8019503896, 9441145135, Tender documents can be obtained from the District Marketing Office, Karimnagar.The District Purchase Committee reserves the right to reject any or all tenders without assigning any reason.

Sd/- District Marketing Officer Karimnagar | **Sd/- Chairman DPC & Addl. Collector Karimnagar**

DIPR RO.NO.602-PP/CL/ADVT/1/2025-26, Dt:20.04.2025

సోమవారం 21 ఏప్రిల్ 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



చీకటి గుహ

ఎక్కడో, ఒక 'పదం'
ఇంకా 'మాట'గా మారలేక
కన్నీటి అంచులో తడబడుతూనే ఉంది.
ఇంతలో ఒక చెరిపేయబడ్డ వాక్యం
గోడ మీద మళ్లీ రాయబడుతుంది.
ఒక చిదిమేయబడ్డ కంఠం
గాలిని చీల్చుకుంటూ మళ్లీ మోగుతుంది.
అందరూ మౌనంగా నిలిచిన చోట
అసలు దాని మాట వినేవారెవరు?
ఆ వీధి చివర నిలిచి
ఈ ఇంటి నీడను తడిమేవారా?
గతపు ధూళిని దులిపి
కొత్త చరిత్రకు పాలు దాపేవారా?
ఇప్పుడీ శిథిల గృహం
తన నిప్పుల కణుపులు విప్పుకుని,
ఊరు విడిచి బయటికి రావాలని తపిస్తోంది,
ఎదురొచ్చే మనుషులెవరు?
ఈ భూమి
అన్నింటినీ
గుర్తుపెట్టుకుంటుంది.
కాలం గొంతులో ముసిరిన దుమ్మును,
గొంతు బిగిసిన అనుభవాలను,
అంతుచిక్కని కథనాలను,
అన్నింటిని
అన్నింటినీ గుర్తుపెట్టుకుంటుంది.
గోడలపై చెదిరిన నినాదాలు,
గుర్తులేని చిహ్నాలు,
రక్తం తుడిచిన అక్షరాలు
ఇవన్నీ మరచిపోవడం ఎలా?
నిశ్శబ్దం రగిలి అగ్నిపర్వతమై
తన కన్నీటిని మరిగించినప్పుడు
ఈ నేల దాని రక్తస్మృతిని ఎలా మరిచిపోగలదు?
మనమంతా చూస్తూనే ఉన్నాం...
ఈ ఇంటి గుమ్మానికి
ఒక అమానవీయ తీర్పు
ఇంకా వేలాడుతూనే ఉంది!
ఒకప్పుడు
ఇక్కడెవరో గుండెను వదిలి వెళ్లిపోయారు
కాల తరంగంలో చిరిగిన తెరలా
ఇక్కడి చరిత్ర తుడిచివేయబడుతోంది
ఇప్పుడిది ఓ శూన్య పదకల్పన!
ఇక్కడ వాకిళ్ళు కన్నీళ్లను ఒడిసిపట్టాయి.
ఈడ గోడలు గాయాలను దాచుకున్నాయి,
తలుపుల వెనకాల
మలుపులు తిరిగిన సాలెగూడులున్నాయి!
ఒకప్పుడు
పసిపిల్లలు నవ్విన చోటు ఇది,
సూర్యోదయాన్ని తాకిన స్వప్నాల వేదిక ఇది.
కానీ ఇప్పుడు...
ఈ ఇల్లు ఓ చీకటి గుహ.
ఇక ఈ గడప దాటి ఎవరూ రారు!

■ వేణు ఊడుగుల



దేహపు మాటలు

చీకటిలో నా గుండెల మీద నీ తలను ఉంచి కురులను ఆరేసుకున్నావు
మన కాళ్లు ఏ భయాలూ లేకుండా నగ్నంగా పెనవేసుకున్నాయి
నువ్వు అమాయకంగా, ప్రేమగా హత్తుకున్న నా ఒళ్ళంతా నీ వెచ్చని స్పర్శతో మురిసిపోతూ ఉంది.

నువ్వు కలలు కంటూ ఉంటావు
గాఢనిద్రలో నక్షత్ర పడవ మీద తేలిపోతూ కూడా హాయిగా నిద్రపోతూ ఉంటావు
నువ్వు నిద్రపోవటం కోసమే ఈ రాత్రి ఇంత ప్రశాంతంగా ఉందేమో!
నీ కడుపులో ఇన్నాళ్లూ ఒక చల్లని నిద్రను మోసుంటావు
పొద్దునే అంట్లు తోమే, కసువు ఊడ్చే పని లేకుండా
పిలగాడో, పాపో అర్ధరాత్రి మేలుకోకుండా,
నేను నీ భుజం కదపకుండా ఉండే ఒక చల్లని నిద్రను ఇన్నాళ్లూ మోసుంటావు...

నీ కురులు ఎంత మెత్తటివో ఇప్పుడే తెలిసింది నాకు
అవి నా ముఖం మీద మబ్బుల్లా తారాడుతున్నాయి
నీ తలను నిమురుతుంటే ఒడ్డున కూర్చొని సముద్రాన్ని జోకొడుతున్నట్టు
నా వేళ్ళు గవ్వలుగా మారిపోతున్నట్టు ఉంది.

నోటితో మాట్లాడటమే మాట్లాడటం అనుకున్నాను
కాళ్లు పడుతూనో, కాలి వేళ్ళతోనో, చూపులతోనో, పెదవులతోనో నీతో మాట్లాడవచ్చని
ఎంత ఆలస్యంగా తెలుసుకున్నాను
నా దేహమంతా మాట్లాడుకోవటానికే నిన్ను చేరుకుందేమో అనిపిస్తోంది.

ఇదిగో నీ ముక్కు మీద ముద్దు పెట్టి నిజం చెప్తున్నా
ఇన్ని కౌగిళ్లు నీకు దోసిట్లో పెట్టి ఇవ్వటమే ప్రేమని ఇన్నాళ్లూ తెలియలేదు నాకు.

ఇంత గాఢరాత్రి మరి నక్షత్రాలు కూడా ఆవులిస్తోన్న
నిశ్శబ్దంలో మేలుకొని, తేరుకొని ఏమిటో పిచ్చిగా రాసుకుంటున్నా
నిన్ను హత్తుకొని చెప్పలేని, అర్థంకాని మాటలతో, సుదూరాల నుంచి మోసుకొచ్చిన నిన్నటి కబురులా,
మిగిలినదేదో చెప్పాలని మాట్లాడుతున్నట్టే ఉంది.

కానీ చూడూ నిన్ను పొదువుకొని నిద్రపోతే సరిపోయేదానికి,
వెర్రిగా ఇంత ఆరాటమూ పడుతున్నాను
అయినా నీకు కొత్తగా చెప్పగలిగింది ఏముంది
యుగాల నుంచీ నిన్ను మౌనంగా ఉంచానుగా
నువ్వే ఒక్కసారి మాట్లాడవూ.

■ గూండ్ల వెంకట నారాయణ

'ఒట్టి చాపలు' కథా సంపుటి

కీ.శే. మండల స్వామి కథా సంపుటి 'ఒట్టి చాపలు' ఆవిష్కరణ సభ ఏప్రిల్ 25 సా.6 గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. కార్యక్రమంలో నాళేశ్వరం శంకరం, ఏనుగు నరసింహారెడ్డి, నామోజు బాలాచారి, పసునూరి రవీందర్, తండు కృష్ణ కౌండిన్య, రాపోలు సీతారామరాజు, సాగర్ల సత్తయ్య, ఏబూషి నరసింహ తదితరులు పాల్గొంటారు.

పెరుమాళ్ళ ఆనంద్

'పోకల పలుకులు ఆవిష్కరణ'

కీ.శే. పోకల చందర్ పుస్తకం 'పోకల పలుకులు' ఆవిష్కరణ సభ ఏప్రిల్ 26 ఉ.10 గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షత పొట్లపల్లి శ్రీనివాసరావు, ఆవిష్కరణ జె.డి. లక్ష్మీనారాయణ, ముఖ్య అతిథి కల్వ సుజాత గుప్త

ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

కందికొండ రామస్వామి పురస్కారం

కందికొండ రామస్వామి స్మారక జాతీయ పురస్కారం 2024కు శ్రీఊహ రచించిన 'బల్కావ్' కథల సంపుటి ఎంపికైంది. పురస్కారంగా రచయిత్రిని రూ.పది వేల నగదు, శాలువా మెమెంటోతో సత్కరిస్తారు. వివరాలకు: 9492765358.

నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక

నారాయణబాబు కవిత్వ ఆల్కెమీ

"కవిత్వం ఒక ఆల్కెమీ, దాని రహస్యం కవికే తెలుసును" అని దేవరకొండ బాల గంగాధర తిలక్ ప్రకటిస్తూ ఓ నలుగురు కవుల పేర్లు ఇచ్చాడు. కానీ కవిత్వాన్ని ఆల్కెమీ (రసచర్య) చేయగల తెలుగుకవి శ్రీరంగం నారాయణబాబు మాత్రమే! తన కాలం నాటి భావకవులు రాత్రి ఆకాశాన్ని పూలతోటగాను, నక్షత్రాలను పూలుగాను వర్ణన చేశారు. నారాయణబాబు "నల్లని త్రాచు కోరలు/ తెల్లని మశూచి కుండలు/ గగనమ్మున చుక్కలు" అని రాయగలిగాడు. తానూ, శ్రీశ్రీ తొలినాళ్లలో భావకవిత్వాన్ని రాశామని, అనంతర కాలంలో దానిని తామే విసిరి కొట్టామని నారాయణబాబు అన్నాడు. పురిపండా అన్నట్లు "తొలిదినాల్లో నారాయణబాబు అచ్చమైన భావకవి. కట్టుబడిలో, జుత్తులో, వేషంలో కూడా!"

కవిత్వంపై నారాయణబాబు తన అభిప్రాయాన్ని ఇలా ప్రకటించాడు: "కవిత్వమంటే అతి మృదులమైనదీ, బహు సరళమైనదీ, మందుగుండులాంటిదీ. జాగ్రత్త! ఖబడ్దార్! సాంద్రతరమైన నిబిడమైన భాషావిపిన విటపీ వీథుల గంభీరత కాదు; గుబురులు గుబురులుగా గుమిగూడిన పాదపశ్యామల పత్రాళిలో అలముకొంటున్న నీరవ నీరంధ్ర భయదాంధకార జీమూతాళి!"

1930–50 సంవత్సరాల నడుమ నారాయణబాబు రాసిన నలభై కవితల్ని ఆరుద్ర 1972లో 'రుధిరజ్యోతి' కవితా సంపుటిగా ముద్రించాడు. 47 ఏళ్ళ తరువాత 2019లో ఈ పుస్తకాన్ని విజయనగరం నుండి ఎస్. కె. బాబు పునర్ముద్రించాడు.

'కపాలమోక్షం' కవితలో శివుని తపస్సును ఉగ్రంగా, స్వభావసిద్ధంగా వర్ణిస్తాడు నారాయణబాబు. మునులూ, ప్రాణులూ శివుడిని తపస్సు వీడమని ప్రార్థిస్తారు. కళ్ళు తెరిచేసరికి చేతి లోని బ్రహ్మకపాలం నశించిపోతుంది. భిక్షాపాత్రగా కపాలం కావాలని "పటపట పళ్ళు కొరికినాడు" శివుడు. "తురకల గోరీలందున/ క్రైస్తవుల సమాధులందున/ హిందూ శ్మశానవాటుల/ కపాలములు వికవిక నవ్వినవి" అంటాడు. ఔను! మతం మానవులకే గాని, కపాలాలకు లేదు కదా! అదే సమయంలో భగత్ సింగ్‌ను ఉరితీస్తారు. "భారతవీరుని/ కపాల మొక్కటి/ కపర్ది చేతిని/ రివ్వున వాలింది" అని రాస్తాడు నారాయణబాబు, భగత్ సింగ్ పేరు చెప్పకుండానే! శివుని కంటి మంటకు చేతిలోని బ్రహ్మకపాలం నశిస్తే దాని స్థానంలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్ పుర్రె చేరిందట. దేశభక్తుని పుర్రె బ్రహ్మకపాలం కంటే గొప్పదని ధ్వనిస్తోంది కదూ! పౌరాణిక ఇతివృత్తాన్ని నేరుగా తీసుకొని, ఆధునిక సంఘటనకు ముడిపెట్టి గొప్ప ఫలితాన్ని సాధిస్తాడు. ఈ కవిత చదివిన రోణంకి అప్పలస్వామి "నారాయణబాబు కవనం మన్ను నుంచి మానవులను సృష్టిస్తుంది," అన్నాడు. "వెయ్యేళ్ళ తెలుగు కవితా భవనానికి నారాయణబాబు ఈ 'కపాలమోక్షం' ద్వారా ఒక ఆధునిక కవితా గవాక్షాన్ని ఆవిష్కరించాడు" అని విశ్లేషిస్తాడు సోమసుందర్.

'ఊరవతల' కవితలోని ఈ పంక్తులను చూడండి: "పోయిన ఆ యేటి నవ్వో/ పుక్కిట నెమరేసుకుంటు/ గండశిల నీడ లోన/ కను మోడ్చెను/ గార్దభస్వామి" – ఇక్కడ కవి ఎండిన సెలయేరును వర్ణిస్తున్నాడు. కెరటాల పొంగును ఏటి నవ్వుగా ఉత్ప్రేక్షించాడు. ప్రస్తుతం ఏరు ఎండిపోయింది. ఆ పొంగును గాడిద తన నోటి నురుగుగా నది గతకాలపు ఉచ్ఛ స్థితిని నెమరు వేసుకుంటుందట. "బ్రహ్మజెముడు కంచె మధ్య/ పూర్ణిమ సంధ్యల్లోన/ గడియైనా ఉదయాద్రిని/ రుధిరజ్యోత్నై వెలిగే జాబిల్లి/ మృతశరీర ఆక్రమణ/ ఘటాకాశ అరుణారుణ/ రక్తసిక్త మోముతోడ.. గాజుకళ్ళ



దీర్ఘ సంస్కృత సమాసాలను తృణీకరించి, ఐదారు అక్షరాల సాదా పదాలే పాదాలుగా, అనితర సాధ్యమైన ఊహాశాలిత్వంతో కవితలు రాసిన వాస్తవికవాది, అతి నవ్యకవి శ్రీరంగం నారాయణబాబు. శ్రీశ్రీ ప్రకాశంలో, ప్రభావంలో కనుమరుగై, తెలుగు సాహితీలోకంలో పొందదగ్గ ప్రఖ్యాతి పొందలేని కవి.

పురిటి పిల్ల!" తల్లిచే పారేయబడ్డ రక్తసిక్త పురిటిపిల్లను రుధిరజ్యోత్నై వెలిగే జాబిల్లిగా ఊహ చేయడం నారాయణబాబుకే తెలిసిన విద్య.

"శ్రీశ్రీ కవిత ఛందస్సుల జలపాత వేగంతో ఉరకలిడి బాహ్య స్వరూపంతో పాఠకుణ్ణి లోగొంటే, నారాయణబాబు కవిత సెలయేటి మార్దవంతో పఠిత హృదయంలో చేరి అనంత భావ జాలాన్ని ప్రేరేపుతుంది," అని సోమసుందర్ తీర్పునిస్తాడు.

"రుధిర జ్యోతిర్/ జ్వలనా లలనా/ ప్రియుండ!/ విప్లవ ఋషిని/ విద్రోహ కవిని," అని రాస్తాడు నారాయణబాబు. రుధిర జ్యోతిర్జ్వలనాన్ని లలనతోను, ఋషిని విప్లవంతోనూ సంపర్కం చేయించి, కొత్తదైన రసాయన చర్యను కలిగిస్తాడు. పాఠకుల మనసుల్లో భావాన్ని గింగిర్లు కొట్టిస్తాడు. 'విద్రోహం' అనే పదం నజ్రుల్ ఇస్లాం ప్రభావంలో నారాయణబాబు రాశాడు. 1930ల్లో బంగ్లా మహాకవి నజ్రుల్ ఇస్లాం, హరీంద్రనాథ చటోపాధ్యాయల ప్రభావం దేశమంతటా ప్రసరించింది.

"భారతీయ సంప్రదాయం ఇతని కవితలో చక్కగా జాలు వారుతూ ఉంటుంది; అధివాస్తవికత ఉందంటారే గాని నారాయణబాబు సర్రియలిస్టు కాదు. చివరికి 'మౌన శంఖం' అనే ఒక్క సర్రియలిస్టు కవిత రాశాడు. అంతే!" అని రోణంకి అప్పలస్వామి చెప్పిన మాటలు అక్షరసత్యాలు.

ప్రాచీన సాహిత్యంలో శ్రీకృష్ణదేవరాయల వారి 'ఆముక్తమాల్యద' కావ్యం ఎలాంటిదో, ఆధునిక సాహిత్యంలో నారాయణ బాబు 'రుధిరజ్యోతి' అలాంటిది. "పలికితుత్ప్రేక్షోపమలు" అని కంఠోక్తిగా చెప్పుకున్న రాయలవారు ఉత్ప్రేక్షాలంకారాన్ని చాలా చోట్ల తన కావ్యంలో వాడుకున్నారు. నారాయణ బాబు కూడ 'రుధిరజ్యోతి'లోని కవితల్ని గొప్ప ఊహాశాలిత్వంతో రాశారు. 'ఆముక్తమాల్యద' ఆసాంతం రసవంతంగా ఉంటుంది. మనుచరిత్ర వరూధినీ ప్రవరుల ఘట్టం తరువాత చప్పగా ఉంటుంది. శ్రీశ్రీ కవిత్వం పెద్దన మనుచరిత్ర లాంటిది. మహాప్రస్థానం, ప్రాసక్రీడలు వదిలేస్తే ఇతర రచనలేవీ అంతగా చదవాలనిపించవు.

శ్రీరంగం నారాయణ బాబు, శ్రీశ్రీ తాతాసహోదరులు. వీరికి దగ్గరి బంధువు ఆరుద్ర. ముగ్గురూ సమకాలికులై, పొయ్యి పొక్కిళ్ళ లాంటి సాహిత్య మిత్రులు. 1906లో శ్రీమంతుల ఇంట జన్మించాడు నారాయణబాబు. వైవాహిక జీవితం సుఖమయం కాకపోగా, విదుషీమణి అయిన బాలవితంతువుతో ప్రేమలో పడ్డాడు. ప్రేమ పరిణయంగా మారక ముందే ఆమె మరణించింది. "చూడలేని పాపిష్టి తుఫాను ఊడపీకె లతను/ మోడైపోయి మామిడి చెట్టు మొహము వేలవేసె" అని భగ్నహృదయంతో భావగీతాలను ఆలపించాడు. చివరలో తిండికి రొక్కట పడి 1961లో చనిపోయాడు.

దీర్ఘ సంస్కృత సమాసాలను తృణీకరించి, ఐదారు అక్షరాల సాదా పదాలే పాదాలుగా, అనితర సాధ్యమైన ఊహాశాలిత్వంతో కవితలు రాసిన వాస్తవికవాది, అతి నవ్యకవి శ్రీరంగం నారాయణ బాబు. శ్రీశ్రీ ప్రకాశంలో, ప్రభావంలో కనుమరుగై, తెలుగు సాహితీ లోకంలో పొందదగ్గ ప్రఖ్యాతి పొందలేని కవి. నారాయణబాబు, శ్రీశ్రీ వ్యక్తిత్వ, కవితా వైరుధ్యాలను టార్చ్ వేసి చూపించగల చిన్ని గ్రంథం సోమసుందర్ రచించిన 'రుధిరజ్యోతిర్దర్శనం'. దానిని చదవకుండా 'రుధిరజ్యోతి' కవితా సంపుటిని అంచనా వేయడం, ఒడ్డున ఒంగొని నూతి లోతు ఎంతుందో చెప్పడమే!

■ గార రంగనాథం

✆ 98857 58123

'యోధ' కథా సంకలనం విజయోత్సవ సభ

'యోధ' విజయోత్సవ సభ ఏప్రిల్ 27, ఉ.11లకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షత భండారు విజయ, గౌరవ అతిథి ఓల్గా, నిర్వహణ గిరిజ పైడిమర్రి. 11.30 నుంచి శ్రామిక మహిళ–అవగాహన సదస్సు జరుగుతుంది. ఇందులో ఎస్. ఆశాలత, యు. వింధ్య, బి.వి. విజయలక్ష్మి, వి. సంధ్య తదితరులు పాల్గొంటారు.

వి. శాంతి ప్రబోధ

కథా సంపుటాలకు ఆహ్వానం

సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ, వరంగల్ ఒద్దిరాజు సోదర కవుల స్మృత్యంకంగా రూ.10వేలతో ప్రదానం చేసే సాహిత్య పురస్కారానికి 2018–24 మధ్య ప్రచురితమైన కథా సంపుటలను మే 31 లోగా చిరునామా: ఎస్. వి. ఎన్. చారి, 2-11-387, విజయగణపతి నగర్, రోడ్ నం.10బి, హనుమకొండ – 506009, ఫోన్: 98666 10429కు పంపాలి.

గిరిజా మనోహరబాబు

అమృతలత – అపురూప అవార్డ్స్ 2025

'అమృతలత–అపురూప అవార్డ్స్' ప్రదానోత్సవం మే 11 సా.4.30 గం.లకు ఎన్‌టిఆర్ ఆడిటోరియం, తెలుగు యూనివర్సిటీ, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి తనికెళ్ళ భరణి. అమృతలత జీవన సాఫల్య పురస్కారాలను అరుణావ్యాస్, గంటి సుజల, కోసూరి ఉమాభారతి; అపురూప పురస్కారాలను చాగంటి కృష్ణకుమారి, మాడభూషి లలితాదేవి, శ్యామల గడ్డం, శ్రీదేవి మురళీధర్, గౌరీలక్ష్మి, భండారు విజయ, హిమజ, సమ్మెట విజయ, వెంకట కామేశ్వరి, రుబీనా పర్వీన్, సలీమా, వీణాధరి అందుకుంటారు.

నెల్లుట్ల రమాదేవి

విప్లవాచరణ మలిచిన కథలు

కథా రచయిత్రి రేణుక రాసిన 37 కథలను స్థూలంగా రెండు రకాలుగా గుర్తించవచ్చు. ఒకటి: మైదాన, పట్టణ ప్రాంత కథలు, రెండు: దండకారణ్యం తదితర ప్రాంతాల్లోని విప్లవానుభవ కథలు. ఆమె 2005లో విప్లవోద్యమంలోకి పూర్తి కాలం కార్యకర్తగా వెళ్లడానికి ముందు కూడా విప్లవానుభవాన్ని ఇతివృత్తంగా కథలు రాసింది. ఉదాహరణకు 'మెట్ల మీద' కథ అట్లా రాసిందే. ఈ రెండు రకాల కథలకూ విశేష పాఠకులు ఉన్నారు. ఈ ఏడాది మార్చి 31న ఆమె హత్య జరిగాక వచ్చిన ప్రతిస్పందనలో మరోసారి ఇది రుజువైంది.

అయితే ఆమె మిడ్కోగా పాఠకులకు చేరువైంది రెండో రకం కథలతోనే. దండకారణ్య ఆదివాసీ ఇతివృత్తంతో ఆమె కథలు రాయడానికి సుమారు పాతికేళ్ల కిందటి నుంచే అలాంటి సాహిత్యం తెలుగు పాఠకులకు పరిచయం. మనిషికి – చరిత్రకు సంబంధం ఏమిటి? ప్రజలు చరిత్రను నిర్మిస్తారని ఎందుకు నమ్మాలి? శ్రామిక వర్గం మీద మార్క్సిజం మోపిన ఈ భారాన్ని వాళ్లు ఎందుకు నిర్వర్తించాలి? సొంత సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాల్లోకి వచ్చిన ప్రజలు ఆ తర్వాత కూడా ఎందుకు ఉద్యమాలను కొనసాగించాలి? ..ఇలాంటి సందేహాలు తీవ్రంగా ఉన్న రోజుల్లో మిడ్కో మహిళా ఉద్యమంలోకి వచ్చింది. ఇంకో వంక స్త్రీవాద ధోరణి బలంగా ఉండిన రోజుల్లో స్త్రీల జీవిత ఇతివృత్తంతో రాయడం మొదలుపెట్టింది. రేణుక పితృ స్వామ్యాన్ని కేవలం భావజాలంగా, సంస్కృతిగా చూడలేదు. ఉత్పత్తి సంబంధాలతో, రాజ్యంతో ముడిపడి, సొంత ఆస్తి కేంద్రంగా ఉండే కుటుంబంలో స్త్రీల జీవితాన్ని అర్థం చేసుకున్నది. స్త్రీవాదాన్ని అధిగమించి స్త్రీని సమాజమంతటా చూడగలిగింది.


మిడ్కోగా మారిన తర్వాత రేణుక తన కథా రచనను మరింత ఉన్నత స్థాయికి తీసికెళ్లింది. అక్కడ కూడా స్త్రీలు, భార్యాభర్తల సంబంధాలు, ప్రేమ మొదలైన అంశాలు ఫోకస్ చేస్తూ కథలు రాసింది. ఏ ఇతివృత్తాన్ని తీసుకున్నా స్త్రీలు ప్రధానంగా కథలు రాసింది. బహుశా 1990ల నుంచి విప్లవోద్యమ బహిరంగ, అజ్ఞాత విభాగాలన్నిట్లోనూ మహిళలు నిర్ణాయకంగా ఎదగడమే దీనికి కారణం కావచ్చు. సారాంశంలో విప్లవాన్ని స్త్రీల వైపు నుంచి చూడటం ఆమె ప్రత్యేకత.

మిడ్కో కథలన్నిటిలోని సాధారణాంశం మానవ మనస్తత్వంలోని మార్పుల చిత్రణ. మానవ వ్యక్తీకరణలకు ఆమె అపార విలువ ఇస్తుంది. మనుషులు ఎప్పుడు ఎట్లా వ్యక్తమవుతారు? ఎందుకు అట్లా స్పందిస్తారు? తీవ్రమైన సంఘర్షణల మధ్య తమను తాము ఎట్లా రుజువు చేసుకుంటారు? ఈ క్రమంలో వాళ్ల మనస్తత్వంలో వచ్చే మార్పులేమిటి?... ఇవన్నీ మిడ్కో చాలా సూక్ష్మస్థాయిలో చిత్రికపడుతుంది. ఇది కేవలం స్వీయాత్మక పరిధిలో జరగదు. ఒక పెద్ద చారిత్రక యుగావధిలోని సామూహిక సంఘర్షణలో భాగంగా జరుగుతూ ఉంటుంది. అక్కడ మనిషికీ, చరిత్రకూ ఉండే సంబంధం రుజువవుతుంది.

దండకారణ్యంలోని ప్రజాయుద్ధంలో ఆమెకు అనేక సాహిత్య ఇతివృత్తాలు కనిపించాయి. వాటితో శక్తివంతమైన కథలు రాసింది. ఈ కథల్లోని ఉద్వేగాలు, విషాదాలు, దుఃఖాలు, ఆనందాలు, సంతృప్తులు పూర్తిగా కొత్తవి. సాహిత్యం కాబట్టి ఇవి పాత్రల వైయుక్తిక స్థాయిలో కనిపిస్తాయి. అంతకుమించి సామూహిక అనుభవాలుగా మారుతున్నట్లు పాఠకులకు తెలుస్తుంది. ముఖ్యంగా విప్లవంలో బిడ్డలను కోల్పోయిన తల్లులను, సహచరులను కోల్పోయిన భార్యలను చిత్రించేటప్పుడు ఆమె ఈ వైయుక్తిక-సామూహిక క్రమాన్ని గొప్పగా చిత్రిస్తుంది. స్త్రీలు తల్లులుగా, భార్యలుగా కోల్పోయినదానితో సమానమైనది మరేదీ ఉండదు. లోతైన స్వీయ విషాదం అది. కానీ విప్లవం దానికి సామూహిక కోణాన్ని చేర్చుతుంది. ఈ మాటను వాచ్యంగా చెప్పి ఒప్పించడం ఎవ్వరి వల్లా కాదు. విప్లవాచరణలోని వాస్తవికతను దగ్గరగా చూసి, వివరించగల జీవన దృక్పథం ఉన్నప్పుడే సాధ్యమవుతుంది. జీవితాన్ని అట్లా చూడగల చూపు రచయిత్రికి ఉన్నది.



విప్లవంలో స్త్రీలు తల్లులుగా, భార్యలుగా కోల్పోయినదానితో సమానమైనది మరేదీ ఉండదు. లోతైన స్వీయ విషాదం అది. కానీ విప్లవం దానికి సామూహిక కోణాన్ని చేర్చుతుంది. ఈ మాటను వాచ్యంగా చెప్పి ఒప్పించడం ఎవ్వరి వల్లా కాదు. విప్లవాచరణలోని వాస్తవికతను దగ్గరగా చూసి, వివరించగల జీవన దృక్పథం ఉన్నప్పుడే సాధ్యమవుతుంది. జీవితాన్ని అట్లా చూడగల చూపు ఈ రచయిత్రికి ఉన్నది.



తెలుగు సాహిత్యానికి ఇది చాలా కొత్త. ఈ కొత్తదనం గాల్లోంచి ఊడిపడలేదు. దండకారణ్యంలోని మనుషులు పాతదాన్ని వదిలించుకొని కొత్తది నిర్మించడం మొదలు పెట్టారు. అదే సమయంలో తమను తాము కొత్తగా తయారు చేసుకుంటున్నారు. ఆ కొత్తదనాన్ని మనుషుల భౌతిక చర్యల్లో, పనుల్లో, వైఖరుల్లో మిడ్కో అద్భుతంగా చిత్రించింది. ఈ కొత్త పనులకు తగినట్లు మనుషులు తమను తాము మార్చుకోవడమంటే వాళ్ల మనస్తత్వాల్లో మార్పు రావడమే. మిడ్కో కథల్లోంచి ఈ సృజనాత్మక మానవ వికాస క్రమాన్ని వివరించవచ్చు.

మానవ మనస్తత్వం కేంద్రంగా రాసే సాహిత్యంలో మార్పు పెద్దగా ఉండదు. కానీ మిడ్కో తీవ్ర వర్గ సంఘర్షణ, యుద్ధం నేపథ్యంలో మానవ మనస్తత్వంలో వచ్చే మార్పులను చిత్రించింది. సామాజిక మార్పులను మానవ సంబంధాల్లోనేగాక వ్యక్తిత్వంలో మార్పుగానూ చిత్రించడం ఆమె ప్రత్యేకత. అలాంటి మానవ వ్యక్తిత్వం పరిపూర్ణత సంతరించుకొనే వరకు మిడ్కో కథలు నిలిచి ఉంటాయి.

■ పాణి





కోట.. కానరాలేదా?

అందాల భామల సందర్శన ప్రాంతాల్లో లేని ఖిలావరంగల్

7

- ఓరుగల్లు రాజసం.. రాష్ట్రీయ చిహ్నం కాకతీయ తోరణం ఉన్నదిక్కడే..
- వేయిస్తంభాల ఆలయం, భద్రకాళి గుడులనూ పట్టించుకోని వైనం
- పర్యాటక శాఖ అధికారుల తీరుపై ఓరుగల్లు వాసుల విస్మయం
- వివిధ దేశాల మిస్సమ్మలకు ఓరుగల్లు చరిత్రను చెప్పలేరా? అంటూ ప్రశ్నలు
- వచ్చేనెల 14న వరంగల్‌కు వస్తున్న 30మంది మిస్‌వరల్డ్ పోటీదారులు
- కాళోజీ కళాక్షేత్రం, రామప్ప ఆలయం వరకే వారి పర్యటన ఖరారు

కాకతీయుల శిల్పా కళా నైపుణ్యం.. ఆకట్టుకునే పేరిణి నాట్యం.. రాజసం ఉట్టి పడే తోరణం.. కళ్లను కట్టిపడేసే మదనికల అందాలు.. కాకతీయుల కళావైభవాన్ని చాటి చెప్పే ఓరుగల్లు చరిత్ర.. ఇలా ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న ఓరుగల్లును విశ్వవ్యాప్తం చేసే అవకాశం వచ్చింది. మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యమిస్తున్న తెలంగాణ ప్రభుత్వం.. పోటీల్లో పాల్గొనే అందాల భామలకు రాష్ట్రంలోని చారిత్రాత్మక ప్రాంతాలను చూపేలా కార్యాచరణను చేపట్టింది. అందులో భాగంగా మే 14న వివిధ దేశాలకు చెందిన 30మంది అందాల భామలు ఓరుగల్లుకు వస్తున్నారు. వారు రామప్పతో పాటు ఇటీవల హనుమకొండలో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని సందర్శించేలా షెడ్యూల్ ఖరారు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఓరుగల్లు ఖ్యాతిని మరింత విస్తృతం చేసే ఇలాంటి అద్భుత అవకాశాన్ని పర్యాటకశాఖ అధికారులు సక్రమంగా వినియోగించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయంతో పాటు, నగరంలోని కాళోజీ కళాక్షేత్రం వరకే వారి పర్యటనను పరిమితం చేయడం సరికాదన్న అభిప్రాయాలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి జిల్లా రాజసంగా.. కాకతీయుల ఠీవీకి నిలువెత్తు నిదర్శనంగా.. రాష్ట్ర చిహ్నంగా ఉన్న వరంగల్ కోటలోని కాకతీయ తోరణం వద్దకు వారిని తీసుకెళ్లే ప్రయత్నం చేయకపోవడం.. అలాగే ఎంతో ప్రాశస్త్యం కలిగిన భద్రకాళి, వేయిస్తంభాల ఆలయాలను మిస్సమ్మలు దర్శించుకునేలా ప్రణాళిక రూపొందించలేకపోవటంపై ఓరుగల్లువాసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం



సమ్మేళన్‌లో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్

దేశంలో ఆదివాసీలపై బీజేపీ దాడులు

- దేశవ్యాప్తంగా అత్యాచారాలు పెరిగాయి..
- ఆదివాసీల సంస్కృతిని కాలరాసే కుట్రలు
- భూ హక్కులను హరించే దౌర్జన్యాలు
- ఆదివాసీలను చైతన్యపరిచే లక్ష్యంతో సమ్మేళన్ నిర్వహణ
- ఏఐసీసీ కార్యదర్శి పి.విశ్వనాథన్
- హనుమకొండలో రెండోరోజు కొనసాగిన సమ్మేళన్

7

కమ్యూనిటీ మీడియేటర్స్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

- రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరి
- ముగిసిన కమ్యూనిటీ మీడియేటర్స్ శిక్షణా తరగతులు



మాట్లాడుతున్న తెలంగాణ న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరి

వరంగల్ లీగల్, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని వ్యక్తులు, సమూహాల మధ్య వైరుధ్యాలు, సంఘర్షణలను పరిష్కరించుకోవడంలో శిక్షణ పొందిన మధ్యవర్తులు, ఇరుపక్షాల మధ్య వివాదాలలో పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారానికి నిష్పక్షపాతంగా తమ వంతు సహాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి సీహెచ్ పంచాక్షరి అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలకు సంబంధించి ఆయా జిల్లాల న్యాయసేవా సంస్థలు గుర్తించిన కమ్యూనిటీ మీడియేటర్ల మూడు రోజుల శిక్షణా కార్యక్రమం ఆదివారం విజయవంతంగా ముగిసింది. సంఘర్షణ ఆరంభ దశలోనే పరిష్కరించబడితే డబ్బు, విలువైన సమయాన్ని కాపాడుకోవచ్చునన్నారు. కమ్యూనిటీ స్థాయిలో వాదనలు, వివాదాల పరిష్కారంలో మధ్యస్థతాతత్వాన్ని ఎలా వినియోగించుకోవాలో శిక్షణ ద్వారా క్లుప్తంగా తెలియచేశారు. వివాదాలను పరిష్కరించడంలో ఏదైనా సహాయం అవసరమైతే వారు నేరుగా జిల్లా న్యాయ సేవాధికార కమిటీని సంప్రదించి సలహాలు, సూచనలు పొందాలని సూచించారు. ఈ సందర్భంగా మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కమ్యూనిటీ మీడియేటర్లకు ప్రశంసా పత్రాలను అందచేశారు. సమాజంలో శాంతి, న్యాయం, సామరస్యం కోసం ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు మరింత అవసరమని కమ్యూనిటీ పెద్దలు అభిప్రాయపడ్డారు. ఈ శిక్షణా కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు వీబీ నిర్మలా గీతాంబ, సీహెచ్ రమేష్‌బాబు, వరంగల్, హనుమకొండ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శులు ఎం.సాయికుమార్, క్షమాదేశ్ పాండే, రిసోర్స్ పర్సన్స్ బాలక్రిష్ణ, సీతాదేవి తదితరులు పాల్గొన్నారు.



అనుగ్రహ భాషణం చేస్తున్న చినజీయర్ స్వామి

రఘునాథుడి మార్గం అందరికీ అనుసరణీయం

- పద్మభూషణ్ చిన జీయర్ స్వామి
- నేత్రపర్వంగా శతతిరు నక్షత్ర వేడుకలు
- 16 మంది పండితులకు విలక్షణ పురస్కారాలు
- విష్ణు సహస్రనామ భాష్యం గ్రంథావిష్కరణ

7

వక్ఫ్ చట్టం ఏ వర్గానికి వ్యతిరేకం కాదు..

- బీజేపీ రాష్ట్ర నాయకుడు రావు అమరేందర్‌రెడ్డి



వర్క్‌షాపులో మాట్లాడుతున్న రావు అమరేందర్‌రెడ్డి

రాంనగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్టం ఏ వర్గానికి వ్యతిరేకం కాదని బీజేపీ రాష్ట్ర నాయకుడు రావు అమరేందర్ రెడ్డి అన్నారు. అదివారం హంటర్‌రోడ్డులోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి అధ్యక్షతన వక్ఫ్ సుధార్ జనజాగరణ అభియాన్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద ముస్లింల మేలు కోసమే కేంద్రప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని సవరణ చేశారన్న విషయం అసదుద్దీన్ ఓవైసీతో పాటు కాంగ్రెస్ నాయకులు గమనించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 2024 ఆగస్టులో జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేసి 25 రాష్ట్రాల్లో పర్యటించి కోటి మందికి పైగా మేధావులు, ప్రజల అభిప్రాయాలను సేకరించిందన్నారు. అనంతరం కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా పార్లమెంట్‌లో సమర్పించి 21గంటల పాటు చర్చించి చట్ట సవరణ చేసిందన్నారు. ఇప్పటి వరకు వక్ఫ్ బోర్డు లాభాలను మత పెద్దలు, ల్యాండ్ గ్రాబర్లు, రియల్ ఎస్టేట్ కంపెనీల మాత్రమే పొందాయన్నారు. ఇక నుంచి అలాంటి మోసాలకు తావు ఉండదన్నారు. వక్ఫ్ బోర్డు లాభాలను మింగిన వారే ఈ రోజు అల్లర్లు చేస్తున్నారన్నారు. వక్ఫ్ సవరణ చట్టానికి ప్రజల మద్దతు పొందేలా బీజేపీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పగడాల కాళాప్రసాద్, విజయ్‌చందర్‌రెడ్డి, వక్ఫ్ సుధార్ జనజాగరణ అభియాన్ జిల్లా కన్వీనర్ ఆర్.పి.జయంత్‌లాల్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంధ్ర మధు, మైనారిటీ నాయకులు చాంద్‌పాషా, రహమాతుల్లా పాల్గొన్నారు.

నేడు బల్దియాలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ వారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు.

నేటి హనుమకొండ కలెక్టరేట్ ప్రజావాణి రద్దు

హనుమకొండ కలెక్టరేట్ : హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రతీ వారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారం అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ దృష్ట్యా రద్దు చేశామని, వచ్చే సోమవారం యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని, జిల్లా ప్రజలు దీనిని గమనించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

నాణ్యతకు తిలోదకాలు

నాసిరకంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు



నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ భవనం

రూ.1,116 కోట్లతో కొనసాగుతున్న పనులు

- ఇష్టారాజ్యంగా కాంట్రాక్టర్ల తీరు
- అప్పుడే బయటపడుతున్న డొల్లతనం
- పగుళ్లు బారుతున్న గోడలు, పిల్లర్లు
- పర్యవేక్షణ లేని ఆర్అండ్‌బీ అధికారులు

మామునూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో పాత సెంట్రల్ జైలు స్థలంలో 24 అంతస్థులతో నిర్మిస్తున్న మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనుల్లో డొల్లతనం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్మాత్మకంగా చేపట్టిన ఈ పనుల్లో నాణ్యత లోపం బయటపడింది. ఆస్పత్రి నిర్మాణం పూర్తికాక ముందే పిల్లర్లు, గోడలు పగుళ్లు బారుతున్నాయి. గోడలకు ప్లాస్టింగ్ పూర్తి కాకముందే నాసిరకపు రంగులు వేస్తున్నారు. పగుళ్లు కనిపించకుండా పుట్టితో కప్పేస్తున్నారు. గోడలలో నాణ్యత లేక ఇటుకలు ఊడిపోతున్నాయి. సిమెంట్‌తో నిర్మించాల్సిన గోడలను.. నాణ్యత లేని ఇటుకలతో ఒకదానిపై ఒకటి పేర్చి పైనుంచి సిమెంట్ పూస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇటుకల్లో కూడా నాణ్యత లేక అందులోని ఇసుక ఎక్కడికక్కడ రాలిపోతోంది. కొన్నిచోట్ల పిల్లర్లకు పెచ్చులు ఊడిపోతుండగా, వాటిని తాత్కాలికంగా సిమెంట్‌తో కప్పేస్తున్నారు.



పగుళ్లు బారిన పిల్లరు

2022లో పనులు ప్రారంభం

ఉత్తర తెలంగాణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1,116 కోట్లతో 56.98 ఎకరాల విస్తీర్ణంలో సూపర్ స్పెషాలీటీ ఆస్పత్రి పనులు చేపట్టింది. దాదాపు 1,750 పడకలు గల 23 అంతస్థుల అతి పెద్ద భవన నిర్మాణానికి 2022 మే 11న శంకుస్థాపన చేశారు. కానీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, ఆర్అండ్‌బీ అదికారుల అలసత్వంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిర్మాణంలో నాణ్యత లోపిస్తోంది. వాటర్‌క్యూరింగ్ లేక అప్పుడే పిల్లర్ల పెచ్చులూడుతున్నాయి. గోడ కట్టకుండా కేవలం ఇటుకపై ఇటుకలు పేర్చి ఆ సందులు ఏర్పడకుండా కొంత కెమికల్ సిమెంట్ పూస్తున్నారు. గోడలకు పూర్తిగా ప్లాస్టింగ్ చేయకుండానే నాసిరకపు రంగులు వేస్తున్నారు. బిల్డింగ్‌లో ఎక్కడ చూసినా బీటలు బారిన గోడలు, గోడ కట్టడాల్లో పగుళ్లు ఏర్పడిన పిల్లర్లు దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల పిల్లర్లను మధ్యలో వదిలేసి గోడతో దాన్ని మూసివేస్తున్నారు. నిర్మాణంలో వాడిన ఐరన్ అప్పుడే తుప్పు పడుతోంది.



గోడలకు ఏర్పడ్డ పగుళ్లు


కేవలం పేర్చిన ఇటుకలు,

వెదజల్లుతున్న దుర్గంధం

భవన నిర్మాణ పనులు చేస్తున్న ఇతర రాష్ట్ర కూలీలకు ఒక పక్కన తాత్కాలిక వసతులు, బాత్రూమ్‌లు ఏర్పాటు చేశారు. దానికి ఒక ఓపెన్ సెప్టిక్ ట్యాంక్ నిర్మించడంతో ఆ ప్రాంతం అంతా దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో కాళోజీ యూనివర్సిటీకి వెళ్లే విద్యార్థులతో పాటు ఆటోనగర్ ప్రజలు నిత్యం నరకం చూస్తున్నారు. ఆ దుర్గంధం తట్టుకోలేక ము క్కుమూసుకొని వెళ్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం


సూపర్ స్పెషాలిటీ నిర్మాణ పనుల్లో నాణ్యతాలోపం కనిపిస్తున్నా.. ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేపట్టిన నిర్మాణ పనులను వారు నిర్లక్ష్యం చేయడంపై ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఆరోపిస్తున్నారు.



సిమెంట్‌తో నిర్మించకుండా కేవలం పేర్చిన ఇటుకలు



నాణ్యత లోపం వల్ల గోడ నుంచి ఊడిపోతున్న ఇటుకలు



నాసిరకపు ఇటుకలు



ప్లాస్టరింగ్ చేయకుండానే ఇటుకలు పేర్చి కప్పేస్తున్న దృశ్యం

అన్నం పెట్టే రాష్ట్రాన్ని ఎడారిగా మార్చారు..

- కాంగ్రెస్ అంటేనే తెలంగాణ ద్రోహుల పార్టీ
- శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదనాచారి

ఎల్కతుర్తి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పచ్చని పంటలతో అన్నం పెట్టే రాష్ట్రాన్ని కాంగ్రెస్ పాలకులు ఎడారిగా మార్చారని శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రాంత ప్రజల ప్రయోజనాల కోసం 2001లో టీఆర్ఎస్ ఆవిర్భవించిందన్నారు. ఉద్యమ సమయంలో తెలంగాణ వ్యతిరేకులను సైతం ఏకం చేసి 14 ఏళ్ల పోరాటం చేసి తెలంగాణను సాధించుకున్నామన్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలను పరిష్కరించుకుంటూ అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి తెలంగాణను దేశానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దిన వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు మించి రేవంత్ అందిస్తాడనే నమ్మకంతో ప్రజలు నమ్మి అధికారం కట్టబెట్టారన్నారు. కానీ వారి ఆశలు కేవలం 15 నెలల్లోనే నీరుగారి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలకు మాయమాటలకు చెప్పి ద్రోహం చేశారని మధుసూదనాచారి మండిపడ్డారు. కాంగ్రెస్ అంటేనే తెలంగాణ ద్రోహుల పార్టీ అని ఆరోపించారు. తెలంగాణలో కొత్త తరహా సిద్ధాంతాలకు తెర లేపి తెలంగాణజాతిని మోసం చేసే విధంగా పాలన సాగుతోందని అన్నారు. కాంగ్రెస్ అవలంబిస్తున్న మోసాలపై బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ 16 మాసాల పాటు మౌనం పాటించారన్నారు. అసమర్థ పాలనకు చరమగీతం పాడటానికి బీఆర్ఎస్ పార్టీ 25 ఏళ్ల పండుగకు ఎల్కతుర్తి వేదిక కానుందన్నారు. ఉద్యమకాలంలో స్పందించిన ప్రతీగొంతుక మరోసారి స్పందించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ ఇంటి నుంచి ఒకరు బహిరంగసభకు కదిలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బాలమల్లు, వరంగల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తరిగొప్పుల పోలీస్ స్టేషన్‌లో ఇద్దరి సస్పెన్షన్

వరంగల్ క్రైం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఓ కుటుంబంలో జరిగిన వివాదం విషయంలో నిందితుడిని కాపాడేందుకు డబ్బులు డిమాండ్ చేసిన నేపథ్యంలో జనగామ జిల్లా తరిగొప్పుల పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. హెడ్‌కానిస్టేబుల్ జి.బాలాజీ, కానిస్టేబుల్ ఎస్.రాజులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ చేపట్టగా వాస్తవమని తేలడంతో పోలీస్ కమిషనర్ సస్పెండ్ చేశారు.

ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకటేశం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు నష్టం కలగకుండా అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని వరంగల్ జిల్లా సెకండ్ క్లాస్ న్యాయమూర్తి అబ్బోజు వెంకటేశం సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు నేపథ్యంలో ఆదివారం అగ్నిమాపక శాఖ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అమరులైన వారిని గుర్తు చేసుకుంటూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి ఎల్.దయాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో 'ఏబీఏఎస్' ఎక్కడ?

- అమలు కాని 'ఆధార్ ఆధారిత హాజరు' విధానం
- ఇష్టారాజ్యంగా కొనసాగుతున్న పీహెచ్‌సీల నిర్వహణ
- నూతన విధానం అమలైతే సక్రమంగా అందనున్న వైద్యసేవలు



పోచమ్మమైదాన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించింది. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించేలా నూతన విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఇందుకోసం ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్(ఏబీఏఎస్) అమలుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు గత నెలలోనే ప్రజారోగ్య డైరక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని ప్రాథమిక కేంద్రాలు, ఉప కేంద్రాలు, యూపీహెచ్‌సీలు, ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ (బస్తీ, పల్లె దవాఖానాలు), డీఎంహెచ్‌వో కార్యాలయాల్లో ఏబీఏఎస్ అమలుచేయాలని ఆదేశించారు. తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ అభివృద్ధి చేసిన మొబైల్ ఫేషియల్ అథెంటిఫికేషన్ సిస్టంను గతంలో ఖమ్మం జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేశారు. ఈ వ్యవస్థ విజయవంతంగా అమలు కావడంతో మార్చి నెల చివరి వారంలోగా అన్ని జిల్లాల్లో అమలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ ఇప్పటి వరకు జిల్లాలో ఏబీఏఎస్ అమలుకు నోచుకోలేదు. కనీసం ఆరోగ్య కేంద్రాలలో ఏబీఏఎస్ పరికరాలను అమర్చలేదు. కేవలం సిబ్బంది ఆధార్‌లు, వివరాలు మాత్రమే సేకరించారు. అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు.

డ్యూటీకి రాకపోయినా వచ్చినట్లు హాజరు

ఆరోగ్య కేంద్రాలలో పనిచేసే మెడికల్ ఆఫీసర్లు తమకు నచ్చిన వేళలో డ్యూటీకి వచ్చి వెళ్తున్నారని ఆరోపణలు వెలువడుతున్నాయి. కొంతమంది అయితే రెండు, మూడు రోజులకు ఒకసారి సైతం వెళ్లడం లేదని, వెళ్లినప్పటికీ తూతూ మంత్రంగా విధులు నిర్వర్తించి ఇంటిముఖం పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు డ్యూటీకి వెళ్లినా..వెళ్లకపోయినా హాజరు పట్టికలో మాత్రం కచ్చితంగా డ్యూటీకి వచ్చినట్లు నమోదు చేస్తున్నారని తెలుస్తోంది. ఇక వారిని చూసి కిందిస్థాయి సిబ్బంది సైతం ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఆరోగ్య కేంద్రాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డ్యూటీలో ఉండాల్సిన సిబ్బంది కొన్నిచోట్ల మధ్యాహ్నం వరకే తాళం వేసి వెళుతున్నారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏబీఏఎస్ అమలైతే ఇలాంటి వారికి చెక్ పెట్టవచ్చని, దీనివల్ల మారుమూల గ్రామాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికైనా జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి దృష్టి సారించి జిల్లాలో వెంటనే 'ఆధార్‌ఆధారిత హాజరు విధానం' అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్య కేంద్రాలలో అరకొర సేవలు

వరంగల్ జిల్లా పరిధిలో ఏడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు సీహెచ్‌సీ సెంటర్లు(సామాజిక ఆరోగ్య కేంద్రాలు), రెండు బస్తీ దవాఖానాలు ఉన్నాయి. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి నేతృత్వంలో జిల్లా పరిధిలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, సీహెచ్‌సీ, బస్తీ దవాఖానాలు కొనసాగుతున్నాయి. అయితే పలు పీహెచ్‌సీలలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర సమయంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలివెళ్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక ఆరోగ్య కేంద్రాలలో సేవలు నామమాత్రంగా అందుతున్నాయని, ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించడం లేదని విమర్శలు వెలువడుతున్నాయి. ఈ తరుణంలో ఏబీఏఎస్ అమలు చేస్తే సక్రమంగా సేవలు అందుతాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి మోషన్ ఆధ్వర్యంలో బ్రిడ్జ్ కోర్సు

రాంనగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రాజస్థాన్ కోటాకు సంబంధించిన మోషన్ కళాశాల ఆధ్వర్యంలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు నేటి నుంచి 30 రోజుల పాటు బ్రిడ్జ్ కోర్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. ఐఐటీ, మెడికల్ కోర్సులకు సంబంధించిన ఫౌండేషన్, బేసిక్స్, కెరీర్ గైడెన్స్ సంబంధించిన విషయాలపై నిష్ణాతులైన అధ్యాపకులతో బోధన చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు నయీంనగర్‌లోని కళాశాలలో కానీ, 9703000850 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

మే 7న భద్రకాళి ఆలయంలో పెరుక కులస్థుల ప్రత్యేక పూజలు


ప్రతాపరుద్ర సంఘంలో పెరుక సంఘం సమావేశంలో పాల్గొన్న సభ్యులు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి అమ్మవారి దేవాలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మే 7న పెరుక సంఘం కులస్థులు ఉభయదాతలుగా ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని బ్రహ్మోత్సవాల కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ వడ్డె రవీందర్ తెలిపారు. ఆదివారం వరంగల్ ప్రతాపరుద్ర కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యేటా అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో పెరుక కులస్థులు ఉభయదాతలుగా వ్యవహరిస్తున్నారని, ఈసారి మే 7న భద్రపీఠ సేవా, డోలోత్సవం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పెరుక కులస్థులందరు ఇందులో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ ఉత్సవాల్లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, వికలంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, మాజీ ఎంపీ బోడకుంటి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యేలు శ్రీరాంభద్రయ్య, బండి పుల్లయ్యతో పాటు అధికారులు, ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో పెరుక సంఘం నేతలు దిడ్డి నరేందర్, సంగాని మల్లేశ్వర్, చుంచు కట్టమల్లు, చింత యాదగిరి, చింతం లక్ష్మీనారాయణ, సోమిశెట్టి శ్రీనివాస్, అల్లం రాజేష్‌వర్మ, పోతరాజు రామేశ్వర్‌రావు, బొలుగొడ్డు శ్రీనివాస్, బేర శంకర్, రామినేని రాజేష్, బుద్దె గణేష్, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు కేటాయించాలి

- రాష్ట్ర అధ్యక్షుడు యువరాజు


గోవిందరావుపేటలో ముదిరాజ్ సమాజ్ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు యువరాజు

గోవిందరావుపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కేటాయించి ముదిరాజ్ కార్పొరేషన్‌కు ఏడాదికి రూ.1000 కోట్లు కేటాయించాలని ముదిరాజ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు దారం యువరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముదిరాజ్ ఆత్మగౌరవ పాదయాత్ర మూడో రోజు ఆదివారం గోవిందరావుపేట మండల కేంద్రంలో కొనసాగగా ఆయన పాల్గొని సమాజ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యువరాజు మాట్లాడుతూ ముదిరాజ్‌ల ఐక్యత, యువత భవిష్యత్ కోసం బీసీ-డీ నుంచి బీసీ-ఏకు మార్చాలని, 75 శాతం సబ్సిడీపై సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ మత్స్యకారులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యత కల్పించి టికెట్లు ఇవ్వాలని, 50ఏళ్లు నిండిన వారికి పింఛన్లు అందించాలన్నారు. ముదిరాజ్ సమాజ్ జిల్లా నాయకుడు వెంకన్న, మండల అధ్యక్షుడు బండి సదయ్య, నాయకులు సురేష్, హరికుమార్, అనిల్, రమేష్, హరీష్,పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి

▸▸ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య

మంగపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర అటవీ అభివృద్ధి శాఖ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన ఆదివారం పర్యటించారు. పలు ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కమలాపురంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నిమ్మల రాజు తల్లి గంగమ్మ ఇటీవల మృతి చెందగా పొదెం వీరయ్య పరామర్శించారు. రాష్ట్రంలో ఎన్నో పార్టీలు వచ్చి పోతున్నాయని, కాంగ్రెస్ మాత్రం పూర్వం నుంచి ప్రజల్లోనే ఉంటోందని అన్నారు. దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన కుటుంబమని అన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై అక్రమ కేసులు పెట్టించి కాంగ్రెస్‌ను బద్నాం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ కుట్ర పన్నుతోందని బీజేపీ తీరుపై మండిపడ్డారు. ఎన్ని కుట్రలు పన్నినా కాంగ్రెస్‌ను ఎవరు ఏమీ చేయలేరని, ప్రజల గుండెల్లో ఉంటుందని అన్నారు. వీరయ్యవెంట కాంగ్రెస్‌మండల అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి, సహకార సంఘం మాజీ డైరెక్టర్ గంగినేని శేషగిరి, కాంగ్రెస్ నాయకులు నిమ్మల రాంబాబు, బూర లక్ష్మీనారాయణగౌడ్, తలారి గోపాల్‌రావు, నిమ్మల నరేష్, చంద్రం, ఆటో సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.


కమలాపురంలో మాట్లాడుతున్న పొదెం వీరయ్య

శాసనమండలిలో ఉపాధ్యాయుల గొంతుకనవుతా..

▸▸ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి


ఆత్మీయ సన్మాన అభినందన సభలో మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. తొలుత మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించి ర్యాలీగా బాలాజీ గార్డెన్స్‌కు ర్యాలీగా చేరుకున్నారు. స్థానిక బాలాజీ గార్డెన్స్‌లో ఆదివారం పీఆర్టీయు-టీఎస్ జిల్లా అధ్యక్షుడు, సంఘం రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ సంకా బద్రినారాయణ అధ్యక్షతన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ఆత్మీయ అభినందన సన్మాన సభను ఏర్పాటు చేసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చడానికి పాటుపడతానని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, మోడల్ స్కూల్, కేజీబీవీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఎజెండాగా పని చేస్తానన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు మంజూరు చేయించడంతో పాటు పీఆర్సీని కూడా అమలు చేసే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో పదోన్నతులు, బదిలీలు చేపట్టే విధంగా ప్రభుత్వంతో మాట్లాడుతానన్నారు. ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సమావేశంలో ఏఐఎఫ్‌టీవో ఉపాధ్యక్షురాలు బి.గీత, ఖమ్మం, వరంగల్, హన్మకొండ జిల్లాల అధ్యక్షులు వై.వెంకటేశ్వరరావు, రవీందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, నాయకులు శ్రీధర్, యాకయ్య, రఫి, వడ్డెబోయిన శ్రీనివాస్, నాగిరెడ్డి, సునీత, వెంకట్‌రెడ్డి, హల్యానాయక్, రాంజీ, సుజాత, నాగరాజు, కనకయ్య, వెంకన్న, పూర్ణచందర్, మిర్యాల్ సతీష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, మహేష్, చందు, రఘు, సంజీవ, 18 మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి Classifieds
Wanted · Real Estate · Health · Jobs · Beautician · For Sale

WANTED
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, సిస్టమ్ ఆపరేటర్స్ కావలెను. జీతం : 8000 - 10000. సం॥ప్ర॥ 6300959432
AJW-217399

WANTED
★ మడికొండ (ధర్మసాగర్) దగ్గరలో ఉన్న పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మంచి ఉత్సాహవంతులైన వర్కర్స్ కావలెను. సం॥ప్ర 8247771016, 8247771525
AJW-4075

JOBS &TRAINING
★ అన్ని రంగాలలో : Training, Internship, Jobs కలవు. మరియు "కంప్యూటర్ కోర్సులలో ఒక్కొక్కరికి (వ్యక్తిగ)శిక్షణ Saraswathi Enterprises (W) 7989199393, 7780473930 శ్రీమతి బుర్ర రమాదేవి. Wanted రిసెప్షనిస్ట్, అటెండర్.
AJW-7550

WANTED
★ Wanted Teachers to teach primary English, E.V.S Maths. high School All Subjects ST.Theresa High School, Nekkonda. Cont : 8801802586, 9397696508
AJW-237061

అర్జెంటుగా కావలెను
★ వరంగల్ యం.జి.యం. దగ్గరలో హాస్పిటల్‌లో క్లీన్ చేయుటకు లేడీ వర్కర్స్ కావలెను. Timings : 6am to 5 pm. Food + అకామిడేషన్ ఫ్రీ. యం.జి. రోడ్, వరంగల్. సం॥ప్ర॥ 9573637686
AJW-6804

సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ కావలెను
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ మరియు సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 12,000-15,000. సం॥ప్ర॥ 9000463426
AJW-217393

PLOT FOR SALE
★ G+2 పర్మిషన్తో (BRS) ఫ్లాట్స్ కలవు. నవభారత్ కాలనీ, Road No.6 ఫిల్టర్ బెడ్ దగ్గర, వడేపల్లి, హనుమకొండ. సం॥ప్ర॥ 8328385925
AJW-217394

PLOT FOR SALE
★ హన్మకొండ, లలితా జ్యూవెల్లర్స్ ఎదురు సందులో గుండం జెండా దగ్గర 700 చ॥గ॥ల ప్లాటు అమ్మబడును. నో బ్రోకర్స్. సం॥ప్ర॥ 9000011381
AJW-237129

PLOTS FOR SALE
★ ములుగు రోడ్ దగ్గరలో ఉన్న ఆరేపల్లి NSR & ప్రతిమ హాస్పిటల్ దగ్గరలో మరియు పరిసర ప్రాంతంలో 30 కిలోమీటర్స్ లోపు ప్లాట్స్ మరియు వ్యవసాయ భూములు,ఇండ్లు,అపార్ట్‌మెంట్స్ అమ్మబడును/కొనబడును. సం॥ప్ర॥ 9281141001.
AJW-4076

KALESHWARI INSTITUTE
★ Tuitions for B.Tech, Diploma and Degree, Home Tuitions also Available. Kaleshwar Institute for Maths and Science. Near MGM Hospital, Wgl. Ph ; 8125080314, 9032857572
AJW-237128

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన/క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

3+2 స్కీం కలదు

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ: 9985400013, 8978510273, 9985411677, 9985411676
వరంగల్: 9985406150, 9985408173
జనగామ: 9866431354
మహబూబాబాద్: 9985418040
తొర్రూర్: 9985418040
నర్సంపేట: 9985418040
భూపాలపల్లి: 9985401232
పరకాల: 9985401232

టీజేఎఫ్ రజతోత్సవాలను నిర్వహిద్దాం

▸▸ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న అల్లం నారాయణ

దామెర, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జర్నలిస్టు ఫోరం (టీజేఎఫ్) రజతోత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్, టీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ తెలిపారు. హనుమకొండ జిల్లా దామెర మండలం దుర్గంపేట శివారులోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం టీయూడబ్ల్యూజే-143 ఆధ్వర్యంలో టీజేఎఫ్ రజతోత్సవసభ సన్నాహక సమావేశం నిర్వహించారు. అల్లం నారాయణ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర స్థాయి నేతలతో పాటు అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ.. 'తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టు' అనే నినాదంతో తెలంగాణ ప్రాంతీయఅస్థిత్వ పోరాటంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జర్నలిస్టులు పోరాటం చేశారన్నారు. 2001న టీఆర్ఎస్ పార్టీ పురుడు పోసుకున్న నెల రోజులకే పుట్టిన మొట్టమొదటి రాజకీయేతర వేదిక తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ అని పేర్కొన్నారు. నాటి ఉద్యమంలో అన్ని రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను సమన్వయం చేస్తూ ఉద్యమాన్ని సంఘటితం చేసిన ఘనత టీజేఎఫ్‌దేనని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ అస్థిత్వ పోరాటంలో వరంగల్ జిల్లా టీజేఎఫ్ పోషించిన పాత్ర గొప్పదని, ఇక్కడి నుంచి సునిల్ అనే జర్నలిస్టు ఆత్మబలిదానం చేసుకోవడం బాధాకర చరిత్ర అని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో 2025 మే 1న టీజేఎఫ్ రజతోత్సవాలను హైదరాబాద్ వేదికగా నిర్వహించుకోవాలని రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయించినట్లు అల్లం నారాయణ వివరించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతీసాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ హజారి, కోశాధికారి యోగానంద్, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు యూనియన్ (తెమ్జు) రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణకుమార్, సీనియర్ జర్నలిస్టు బుచ్చన్న, రాష్ట్ర నేతలు సీహెచ్.సుధాకర్, బీఆర్.లెనిన్, తడక రాజ్‌నారాయణ, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, తుమ్మ శ్రీధర్‌రెడ్డి, కక్కెర్ల అనిల్‌కుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మస్కపురి సుధాకర్, అర్షం రాజ్‌కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, వేణుగోపాల్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ మంచిక అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగాల పునాదులపై ఆవిర్భవించిందే టీపీఎఫ్


మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం

వడ్డెపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో త్యాగాల పునాదులపై ఎంతోమంది అమరత్వంతో ఆవిర్భవించిందే తెలంగాణ ప్రజా ఫ్రంట్ అని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతకింది కాశీం అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం తెలంగాణ ప్రజా ఫ్రంట్ 4వ జిల్లా మహాసభలు టీపీఎఫ్ జిల్లా అధ్య క్షుడు జనగాం కుమారస్వామి అధ్యక్షతన నిర్వహించారు. తొలుత టీపీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కాశీం మాట్లాడుతూ.. తెలంగాణలో మతోన్మాదం పెరిగి పోతోందని, దాన్ని అరికట్టాల్సిన బాధ్యత ప్రజా సంఘాలపై ఉందని అన్నారు. తెలంగాణ ఏర్పాటులో టీపీఎఫ్ కార్యకర్తలు, నాయకులు ముందు వరుసలో ఉన్నారని అన్నారు. భారత్ బచావో రాష్ట్ర బాధ్యు డు గాదె ఇన్నయ్య మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం ఆవిర్భవించిన టీపీఎఫ్ నిధులు, నీళ్లు, నియామకాల కోసం పోరాడిందని తెలిపారు. వీసీకే రాష్ట్ర అధ్యక్షుడు జిలకర శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో అభివృద్ధి పేరుతో తెలంగాణలోని సంపదను కొల్లగొట్టి ఆంధ్రా పెట్టుబడిదారులకు ధారాదత్తం చేశారని విమర్శించారు.

ఈ సభలో టీపీఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ బి. రమాదేవి, సామాజిక ఉద్యమ నాయకురాలు అనిశెట్టి రజిత, ప్రజా సంఘాల నాయకులు నాగభూషణం, గొల్లూరి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ నక్కలగుట్టలోని ఎస్ఎంఆర్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు ఎస్ఎంఆర్ పాఠశాల కరస్పాండెంట్ విముక్తీశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే విద్యార్థులు క్రీడల్లో పాల్గొనే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. చదువులతో పాటు క్రీడల్లో పాల్గొని రాణించాలని హితవు పలికారు.

ఈ సందర్భంగా క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-7 బాలబాలికల టోర్నీలో 14 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన నలుగురు బాలురు, నలుగురు బాలికలు మే నెల 10, 11వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

బాలుర విభాగంలో బైరిదేవాన్ష్‌రెడ్డి ప్రథమ, అక్షాంత్ చౌహాన్ ద్వితీయ, వీయాన్ష్ తృతీయ, హితాన్ష్, చతుర్థ స్థానాల్లో నిలిచారు. బాలికల విభాగంలో మనీషా గాయత్రి ప్రథమ, రిన్వికతేజ ద్వితీయ, ఎం.నిత్య తృతీయ, చైత్రపూర్ణిమ చతుర్థ స్థానాల్లో నిలిచారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్స్ ప్రేమ్‌సాగర్, బైరి రఘువీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో 'వరంగల్ కృష్ణవేణి' విజయకేతనం


విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్

ఖమ్మం ఖానాపురం హవేలి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో వరంగల్ కృష్ణవేణి ఐఐటీ మెడికల్ అకాడమీ విజయకేతనం ఎగురవేశారని కళాశాల డైరెక్టర్స్ గొల్లపూడి జగదీష్, మాచావరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. కళాశాలకు చెందిన బి.సంపత్ 62, బి.బాలాజీ 119, సీహెచ్ త్రిపుర 288, పి.మణిచంద్రసాయి 572, పి.నాగరాజు 1082, ఎ.శ్రీవెంకటసాయి కృష్ణ 1499, టి.దినేష్ 1550, జి.పాల్ జాషువా 1882, బి.పూజిత 1891తోపాటు పలువురు విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తోట రామకృష్ణప్రసాద్, పరుచూరి రవి కిషోర్, అధ్యాప కులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్రం కుట్ర

- 'ఆపరేషన్ కగార్' పేరుతో ఆదివాసీలపై దాడులు
- హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : అడవులను, అటవీ ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్రప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై భౌతికదాడులు, మరణ హోమాన్ని సృష్టిస్తున్నాయని రిటైర్డ్ హైకోర్టు జడ్జి చంద్రకుమార్, అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జాతీయ అధ్యక్షురాలు టాన్య అన్నారు. మహబూబాబాద్‌లోని గంగపుత్ర భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై జరుగుతున్న హత్యాకాండ, భౌతికదాడులను ఆపాలని డిమాండ్ చేశారు. కగార్ పేరుతో జరుగుతున్న హత్యాకాండలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయవిచారణ జరిపించి దాడులకు, హత్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. సమావేశంలో నాయకులు ప్రసాద్, పొమ్మయ్య, ఆనంద్, మదార్, ఉప్పలయ్య, ప్రతాప్‌రెడ్డి, ఆరెల్లి కృష్ణ, బండపల్లి వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి, రాంచందర్, ఉపేందర్, రాంసింగ్, సురేందర్, ఉమ, మల్లేష్, అశోక్, ఐలయ్య, కృష్ణ, శ్రీలత, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కోట.. కానరాలేదా?

అందాల భామల సందర్శన ప్రాంతాల్లో లేని ఖిలావరంగల్

- వేయిస్తంభాల ఆలయం, భద్రకాళి గుడులనూ పట్టించుకోని వైనం
- పర్యాటక శాఖ అధికారుల తీరుపై ఓరుగల్లు వాసుల విస్మయం
- వచ్చేనెల 14న వరంగల్ రానున్న 30మంది మిస్‌వరల్డ్ పోటీదారులు
- కాళోజీ కళాక్షేత్రం, రామప్ప ఆలయం వరకే వారి పర్యటన





(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

హైదరాబాద్ వేదికగా 72వ మిస్ వరల్డ్ పోటీలకు రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యమిస్తోంది. ఇందులో భాగంగా 144 దేశాలకు చెందిన సుందరీమణులు మే 6, 7వ తేదీల్లోనే హైదరాబాద్ చేరుకోనున్నారు. మే 31వ తేదీన మిస్‌వరల్డ్ పోటీలు జరగనుండగా.. అప్పటివరకు ఆ అందాల భామలకు తెలంగాణలోని చారిత్రత్మక ప్రాంతాలను చూపించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. వివిధ దేశాల నుంచి వచ్చే మిస్ వరల్డ్ పోటీదారులను ఐదు బృందాలుగా ఏర్పాటు చేశారు. ఇందులో నుంచి 30 మంది మిస్ వరల్డ్ పోటీదారులతో గల ఒక బృందం చారిత్రక నేపథ్యం ఉన్న ఓరుగల్లుకు మే 14వ తేదీన రానుంది. వీరికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు చారిత్రత్మక ప్రదేశాలను చూపించాల్సి ఉంటుంది. మిస్ వరల్డ్ పోటీదారులు కావడంతో వీరికి సోషల్ మీడియా ప్రపంచవ్యాప్తంగా ఫాలోవర్స్ ఉంటే అవకాశం ఉంది. సోషల్ మీడియా వేదికతో ఓరుగల్లు చరిత్రను వీరు విశ్వవ్యాప్తం చేసే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా వీరి పర్యటనతో పర్యాటకాభివృద్ధికి అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సుందరీమణుల ఓరుగల్లు పర్యటనపై ఆసక్తి నెలకొంది.

రామప్పకే పరిమితం..

వివిధ దేశాల నుంచి వచ్చే మిస్ వరల్డ్ పోటీదారులకు ఓరుగల్లు కేంద్రంలో అనేక చరిత్రాత్మక కట్టడాలు ఉన్నా.. వీరి పర్యటనలో వాటికి చోటు లేకపోవటం చర్చనీయాంశంగా మారింది. వీరి పర్యటనలో చారిత్రాత్మకమైన రామప్ప దేవాలయానికి మాత్రమే చోటు దక్కింది. ఏప్రిల్ 5వ తేదీన హనుమకొండ కలెక్టరేట్‌లో మిస్ వరల్డ్ పోటీదారులు పర్యటించే ప్రాంతాలపై పర్యాటకశాఖ ఎండీ ప్రకాష్‌రెడ్డి, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య సమీక్షించారు. మే 14న ఉదయం 11.30గంటలకు హైదరాబాద్ నుంచి నేరుగా హనుమకొండ హరిత హోటల్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి కాళోజీ కళాక్షేత్రం సందర్శించి, అక్కడే విద్యార్థులతో సుందరీమణులు సమావేశమవుతారు. అక్కడి నుంచి యునెస్కో గుర్తింపు పొందిన రామప్పకు చేరుకుంటారు. కాకతీయుల కళానైపుణ్యం, శిల్పసంపదకు కేరాఫ్‌గా ఉన్న రామప్పను తిలకించనున్నారు. ఆలయ గోడలపై చెక్కిన అద్భుత శిల్ప వైభవం సుందరీమణులను ఆకట్టుకోనుంది. పేరణీ నృత్యా భంగిమలు, రాగిని, నాగిని మదనికల భంగిమలు సుందరీమణులు తిలకించనున్నారు. రామప్పను సందర్శనతో ఓరుగల్లు వారసత్వం, సంస్కృతి, సంప్రదాయాలు మిస్ వరల్డ్ పోటీదారులకు చాటి చెప్పనుంది. దీంతోపాటు ఇప్పటికే రామప్పకు యునెస్కో గుర్తింపు ద్వారా ప్రపంచవ్యాప్తంగా వారసత్వ కట్టడంగా గుర్తింపు రాగా, మిస్‌వరల్డ్ పోటీదారుల సందర్శనంతో అంతర్జాతీయ స్థాయిలో రామప్ప పర్యాటకానికి మరింత గుర్తింపు రానుంది.

వరంగల్ కోటకు ఏదీ చోటు?

ఎంతో ఘన చరిత్ర ఉన్న ఓరుగల్లులోని మిగతా ప్రాంతాలకు కూడా విదేశీ సుందరీమణులను తీసుకరావాల్సిందనే చర్చ జరుగుతోంది. వరంగల్ నగరంలోని చారిత్రత్మక ప్రదేశాల్లో వీరి పర్యటన లేకపోవటం చర్చనీయాంశంగా మారింది. ప్రధానంగా కాకతీయుల కళావైభవానికి, రాజసానికి నిదర్శనంగా నిలిచే తెలంగాణ రాష్ట్ర చిహ్నంగా ఉన్న కాకతీయ తోరణాలకు కేంద్ర మైన వరంగల్ కోటాను సందర్శించే అవకాశం మిస్‌వరల్డ్ పోటీదారులకు కల్పించకపోవడంపై ఓరుగల్లువాసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఓరుగల్లు ఖ్యాతిని చాటే కోట అందాలను అందాల భామలు తిలకించేందుకు ఏర్పాట్లు చేయకపోవటమేంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తోరణాల్లోని రాతి స్తంభాలపై రేఖాగణిత నమూనాలు, పూలు, జంతువుల బొమ్మలు, శాసనలతో నాలుగు దిక్కుల్లో ఈ తోరణాలతో పాటు ఏకశిలపై నిర్మించిన స్వయంభు ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారు. ఇంతటి ప్రాముఖ్యం ఉన్న వరంగల్ కోటలోనే సుందరీమణులతో విద్యార్థులతో సమావేశమయ్యే అవకాశం కల్పిస్తే బాగుండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. కోటాలో ఒక్క తోరణాలే కాదు.. 45బురుజులు, 24వాచ్ టవర్స్, బయట మట్టి గోడ, లోపల రాతి గోడతో పటిష్ఠంగా నిర్మించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి 30 మంది సుందరీమణులు వరంగల్‌కు వస్తుండటంతో చారిత్రత్మక కోటా వైభవాన్ని వారికి తెలియ జేయాల్సిన అవసరం ఉందటనే టాక్ వినబడుతుంది.

చారిత్రక ప్రదేశాలపై దృష్టి పెడితేనే గుర్తింపు

మిస్ వరల్డ్ పోటీదారులు మే 14వ తేదీన వరంగల్‌కు రానున్నారు. వారు రావడానికి ఇంకా చాలా సమయం ఉండటంతో పర్యాటక శాఖ అధికారులు ఓరుగల్లులోని అనేక పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాలను వారి పర్యటన షెడ్యూల్‌లో చేర్చితే బాగుంటుందనే చర్చ జరుగుతోంది. వరంగల్ కోటతో పాటు చారిత్రక వెయ్యి స్తంభాల దేవాలయం, భద్రకాళి ఆలయాలను కూడా మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించేలా అధికారులు దృష్టి పెడితే బాగుంటుందని ఓరుగల్లువాసులు అభిప్రాయ పడుతున్నారు. వీటితో పాటు ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తున్న లక్నవరం సరస్సులోని ఊయల వంతెనను కూడా వీరి పర్యటనలో భాగస్వామ్యం చేయాలని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పర్యాటకశాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ వరంగల్ నగర కమిషనర్‌గా పని చేసిన అనుభవం ఉంది. ఇక్కడి చారిత్రక నేపథ్యంపై ఆమెకు అవగాహన కూడా ఉంది. దీంతో మిస్‌వరల్డ్ పోటీదారుల పర్యటనలో ఓరుగల్లు చారిత్రత్మక ప్రదేశాలను చేర్చాలని కోరుతున్నారు. మొత్తానికి మిస్ వరల్డ్ పోటీదారుల రాకతో ఓరుగల్లు కళావైభవం ప్రపంచ వ్యాప్తం కావడంతో పాటు పర్యాటకులు, పారిశ్రామిక వేత్తల చూపు వరంగల్‌పై పడుతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

తెలుగు వెలుగుల దేవులపల్లి

- భాషాపరిరక్షణకు ప్రభాకర్ రావు విశేష కృషి
- అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా కీలక భూమిక
- ప్రముఖ రచయిత, జర్నలిస్టుగా సేవలు
- తెలంగాణపై గళమెత్తిన ఉద్యమ శీలి
- ఈనెల 21న ప్రభాకర్‌రావు వర్ధంతి



హనుమకొండ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు విశిష్టమైన సేవలు అందించిన ప్రముఖ రచయిత, జర్నలిసు దేవులపల్లి ప్రభాకర్‌రావు మన వరంగల్ వారు. ప్రభాకర్ రావు 1938లో వరంగల్‌లోని దేశాయిపేట ప్రాంతంలో జన్మించారు. ప్రముఖ కవి దేవులపల్లి రామానుజారావు ఈయనకు సోదరుడు. ఈనెల 21న ప్రభాకర్‌రావు వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

భాషా సంఘం అధ్యక్షుడిగా...

తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన తెలుగులో పలు రచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సమాచార పౌరసంబంధాల శాఖలో, రాష్ట్ర ప్రభుత్వ కుటుంబ సంక్షేమ శాఖ మాస్ మీడియా విభాగంలోనూ పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక ప్రచురణ విభాగంలోనూ, సంక్షేమ వాణి మాస పత్రిక సంపాదకుడిగా వ్యవహరించారు. తల్లిదండ్రులు వేంకట చలపతిరావు, ఆండాళమ్మ. ప్రభాకర్‌రావుకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన పాఠశాల చదువు వరంగల్‌లో సాగింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పట్టా అందుకున్నారు.

జర్నలిస్టుగా..

1960 నుంచి పలు తెలుగు పత్రికల్లో రచనలు చేశారు. విద్యార్థి దశలోనే 1968లో రాసిన మహాకవి గురజాడ జీవిత చరిత్ర పుస్తకానికి యునెస్కో అవార్డు లభించింది. గోలకొండ, విశాలంధ్రతోపాటు పలు పత్రిల్లో అనేక ఏళ్లుగా కాలమిస్టుగా పని చేశాడు. ఫీచర్ రచయితగా, అనువాదకుడిగా ఆయనకు మంచి పేరుంది. 'నేను ఎవరు' పుస్తకానికి భారత ప్రభుత్వ అవార్డు, అల్లూరి సీతారామారాజు రేడియో నాటికకకు జాతీయ అవార్డు లభించాయి. సాహిత్యరంగంలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా 2009లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తిపురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ ఉద్యమం నేపథ్యంలో పలు రచనలు చేశారు. పలు పత్రికలకు సంపాదకత్వం వహించారు.

రచనలు

అమరుడు బాపూజీ, మన మహనీయులు, చెపుకోదగ్గ మనుషులు, తెలంగాణ వెలుగు కిరణాలు, ముక్తసరి, టిప్పణి-ఖుల్లమ్ ఖులా (సమకాలీన పరిణామాలపై విశ్లేషణ, విమర్శ), రవి కవి (రవీంద్రనాథ్ ఠాగూర్ జీవిత చరిత్ర), దేవుపల్లి రామానుజరావు జీవిత చరిత్ర, సమరం నుంచి స్వాతంత్ర్యానికి, మహాకవి గురజాడ, పారిజాతాలు కవితా సంకలనం, శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం (నూటా పది సంవత్సరాల చైతన్య చరిత్ర), జ్ఞాపకాలు, మాట కచేరి, పాలికేళీ తదితర ఎన్నో పుస్తకాలను రాశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలుగు భాషకు అధికార హోదా కల్పిస్తూ 2016 ఏప్రిల్ 27న తెలంగాణ అధికార బాషా సంఘం ఏర్పాటైంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ సంఘానికి తొలి అధ్యక్షుడిగా దేవులపల్లి ప్రభాకర్‌రావును నియమించారు.

అవార్డులు

దేవులపల్లి ప్రభాకర్‌రావుకు తెలుగు సాహిత్యంలో చేసిన కృషికి గుర్తింపుగా ఆయనను పలు అవార్డులు వరించాయి. యునెస్కో అవార్డుతో పాటు 2008లో పత్రికా రచన విభాగంలో తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం, 2012లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాహిత్య పురస్కారం తదితర అవార్డులు ఆయన అందుకున్నారు. దేవులపల్లి ప్రభాకర్ రావు అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని హైదర్‌గూడలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 2022 ఏప్రిల్ 21న మరణించారు.

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర

తెలంగాణ వాదాన్ని నరనరాన జీర్ణించుకున్న ప్రభాకర్ రావు తన రచనల ద్వారా 1969 తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచారు. చెన్నారెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రజాసమితి వ్యవస్థాపక సభ్యుడిగా కొనసాగారు. చెన్నారెడ్డి టీపీఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేసిన సందర్భంలో తెలంగాణను తాకట్టుపెట్టారంటూ తీవ్రంగా విమర్శించారు. 2001లో కేసీఆర్ నాయకత్వంలో ప్రారంభమైన మలిదశ ఉద్యమంలోనూ దేవుపల్లి ప్రభాకర్ రావు తన వంతు కీలకపాత్ర పోషించారు. శక్తివంతమైన వ్యాసాలతో తెలంగాణ ఉద్యమాన్ని ఉరకలెత్తించారు. ఉస్మానియా నుంచి మానుకోట వరకు ఆరునెలల ఉద్యమ ప్రస్థానం పేరుతో ఆయన రాసిన వ్యాసాల సంపుటి తెలంగాణ ఉద్యమ చరిత్ర, ప్రస్థానాన్ని కండ్లకు కట్టింది.

రఘునాథుడి మార్గం అందరికీ అనుసరణీయం

- పద్మభూషణ్ చినజీయర్ స్వామి
- నేత్రపర్వంగా శతతిరు నక్షత్ర వేడుకలు

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): శ్రీవైష్ణవ సంప్రదాయంలో దేశంలో ఉన్న విశిష్ట అద్వైత తత్వంప్రదాయ పండితుల్లో అతి విలక్షణ వ్యక్తిత్వం గలవారిలో ఓరుగల్లుకు చెందిన నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్య స్వామిది అగ్రతాంబూలమని, ఆయన అనుసరించిన మార్గం ప్రతీ ఒక్కరికి అనుసరణీయమేనని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి ఉద్బోధించారు. ఆదివారం నగర సమీపంలోని ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని శ్రీ రంగనాథస్వామి ఆలయంలో నేత్ర పర్వంగా నిర్వహించిన రఘునాథాచార్య శత తిరునక్షత్ర వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. సత్సంప్రదాయ పరిరక్షణ కార్యదర్శి సముద్రాల శఠగోపాలాచార్య అధ్యక్షత జరిగిన సదస్సులో చినజీయర్‌స్వామి మాట్లాడారు. మాటలు చెప్పే వ్యక్తులకు రాసే అలవాటు ఉండదని, కానీ రఘునాథాచార్య స్వామి విషయంలో అద్భుత భాషణం, అపార పాండిత్యంతో శతాధిక గ్రంథాలు రాసిన ఘనత వారికే దక్కిందన్నారు. సాంస్కృత సాహిత్యం, వ్యాకరణం, వేదాంతం, ఉపనిషత్తులు, ఆళ్వార్ దివ్య ప్రబంధాలు వారికి కరతామలకమని, భగవత్ రామానుజులు ప్రవేశపెట్టిన శ్రీ వైష్ణవత్వాన్ని, విశిష్టాద్వైతాన్ని సరళం చేసి తమ రచనల ద్వారా సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన సాహితీ మూర్తిగా ఆలయాల జీర్ణోద్ధారకుడిగా రఘునాథాచార్యుల సేవలు అనన్యసామాన్యమైనవన్నారు. శ్రీవైష్ణవ సంప్రదాయంలో వేలాదిమందికి గురుతుల్యులుగా బాసిల్లినట్లు చెప్పారు. విష్ణు సహస్రనామాన్ని ప్రతీ ఒక్కరు చదివితే ఒక్కో అక్షరం కష్టాలను పోగొట్టి సుఖాలను ఇస్తుందని, ఒక్కోశబ్దం ఒక్కో మంత్రంలా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ రోజు తాను ఆవిష్కరించిన విష్ణు సహస్రనామ భాష్యం గ్రంథం కరదీపికగా నిలవాలని ఆకాంక్షించారు.



విష్ణు సహస్రనామ భాష్యం ఆవిష్కరిస్తున్న చినజీయర్‌స్వామి



యాదగిరిగుట్ట ప్రధాన అర్చకుడు కాందూరి వెంకటాచార్యకు రఘునాథ దేశిక పురస్కారాన్ని అందచేస్తున్న జీయర్ స్వామి

పండితులకు సత్కారం

రఘునాథాచార్య స్వామి శతజయంతి సందర్భంగా పదహారు మందికి దుశ్శాలువా, ప్రత్యేక ప్రశంసాపత్రం, రూ.10వేల నగదుతో విలక్షణ పురస్కారాలను అందజేశారు. వారిలో యాదగిరిగుట్ట ప్రధాన అర్చకుడు పాంచరత్న ఆగమ పండితుడు తాళ్లూరి వెంకటాచార్యులు, పాంచరాత్ర ఆగమ ప్రతిష్ఠాచార్యుడు, షైహోం దేవాలయ ప్రధాన అర్చకుడు ముడుంబై క్రిష్ణమాచార్యులు, హనుమకొండ రెవెన్యూకాలనీ ఆచార్యుడు మరుంగంటి శ్రీకాంతాచార్య, పాల్వంచకు చెందిన సంపత్‌కుమార్ అప్పలాచార్య, ఏటూజెడ్ ఆలయ ప్రధాన అర్చకుడు కిలాంబి వెంకట నర్సింహదేశికర్, జమ్మికుంటకు చెందిన డింగిరి హరిక్రిష్ణమాచార్య, ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆలయ అర్చకుడు రఘురామాచార్య, ఎక్సైజ్‌కాలనీ వెంకటేశ్వరాలయానికి చెందిన అఖిత్ ఆచార్య, లిఖిత్ ఆచార్య, నిడిగొండకు చెందిన వెంకటగోపాల క్రిష్ణమాచార్య తదితర పండితులు పురస్కారం అందుకున్నవారిలో ఉన్నారు.

అంతకు ముందు చిన్నజీయర్ స్వామి తాను ఆవిష్కరించిన 1200 పేజీల విష్ణు సహస్రనామ భాష్యం గ్రంథాలను ఎస్ఆర్ విద్యా సంస్థల ఛైర్మన్ ఎ.వరదారెడ్డి, సుమతి దంపతులకు, వికాస తరంగిణి ఉమ్మడి జిల్లా ఛైర్‌పర్సన్ డాక్టర్ బచ్చు రాధాక్రిష్ణ, ఎస్ఆర్ ఆలయ ప్రధాన స్థానాచార్యుడు టికె శ్రీనివాసన్, గీతా భవన్ వ్యవస్థాపకుడు ముడుంబై నర్సింహాచార్య తదితర ప్రముఖులకు ప్రదానం చేశారు. సముద్రాల శఠగోపాలాచార్య అధ్యక్షోపన్యాసం చేస్తూ రఘునాథచార్యుల దేశికుల శత వసంత తిరునక్షత్ర వేడుకలు రెండు తెలుగురాష్ట్రాల్లోని 8ప్రదేశాల్లో మహామహులైన పండితుల సమక్షంలో ఈసారి జరగడం తద్వారా ఓరుగల్లు ఖ్యాతి ఎంతో వెలుగులోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. స్వామివారి తిరునక్షత్ర వేళ.. కర్నూలులో నిర్వహించిన వేడుకలకు ఏడుగురు వైష్ణవ జీయర్ స్వాములు రావడం ఎంతో విశేషమని, ఈ రోజు చిన్న జీయర్ స్వామి రావడం వేడుకలకు ఎంతో వన్నె తెచ్చిందన్నారు. శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కండ్లకుంట్ల యాదగిరాచార్య, ఉభయ వేదాంత ప్రవీణ ఏకే పరకాల స్వామి, త్రిదండి శతకోప ముని జీయర్ స్వాములు స్వామివారి వెంట ఆదివారం వేడుకల్లో పాల్గొన్నారు. అంతకు ముందు రంగనాథస్వామి ఆలయానికి వచ్చిన జీయర్ స్వామికి వందలాది మంది మహిళలు, ఏకరూప దుస్తులతో ప్రమిదలు వెలిగించి అపూర్వరీతి స్వాగతించారు.

వికాస తరంగిణి కార్యాలయంలో..

హనుమకొండ నక్కలగుట్టలోని వికాస తరంగి కార్యాలయ రెండో అంతస్తును చినజీయర్‌స్వామి లాంఛనంగా ప్రారంభించారు. ఓరుగల్లు కేంద్రంగా ఆధ్యాత్మిక పునాదులపై సామాజిక కార్యక్రమాల నిర్వహణకు, సనాతన ధర్మవ్యాప్తికి విశాల కార్యాలయాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొంటూ వికాస తరంగిణి ఛైర్‌పర్సన్ డాక్టర్ బచ్చు రాధాక్రిష్ణ బృందాన్ని ఆయన ప్రశంసించారు. వేసవిలో విద్యార్థుల వికాసానికి నిర్వహించే ప్రత్యేక సమ్మర్ క్యాంపు ప్రజ్ఞా వలంటీర్లకు కొద్దిసేపు మార్గదర్శనం చేశారు. అంతకుముందు హంటర్ రోడ్డులోని విష్ణుప్రియ గార్డెన్ సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ మూర్తులకు ప్రాణప్రతిష్ఠ చేసి సంప్రోక్షణ జరిపారు. స్వయంగా భక్తులకు ఆయన నిర్వహించిన తీర్థగోష్ఠిలో 5వేల మంది భక్తులు పాల్గొడం విశేషం.

దేశంలో ఆదివాసీలపై బీజేపీ దాడులు

- ఆదివాసీలను చైతన్యపరిచే లక్ష్యమే సమ్మేళన్ నిర్వహణ
- ఏఐసీసీ కార్యదర్శి పి.విశ్వనాథన్
- హనుమకొండలో రెండోరోజు కొనసాగిన సమ్మేళన్

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ సర్కారు ఆదివాసీలపై దాడులు చేస్తోందని ఏఐసీసీ కార్యదర్శి పి.విశ్వనాథన్ ఆరోపించారు. ఆదివాసీలను భయకంపితులను చేస్తూ ఆరాచకాలకు పాల్పడుతోందన్నారు. ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళన్ రెండోరోజు కార్యక్రమం ఆదివారం హనుమకొండలోని హరితాహోటల్‌లో కొనసాగింది. విశ్వనాథన్ మాట్లాడుతూ.. బీజేపీ పాలన అప్రజాస్వామికంగా ఉందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆదివాసీలపై దాడులు, అత్యాచారాలు పెరిగాయని ఆరోపించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలిసి ఆదివాసీల సంస్కృతిని కాలరాజే కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. భూహక్కులను హరిస్తున్నాయని మండిపడ్డారు. ఆదివాసీల సంస్కృతి గొప్పదన్నారు. వారిని చైతన్యపరిచి నాయకత్వాన్ని పెంపొందించే లక్ష్యమే సమ్మేళన్ నిర్వహణగా విశ్వనాథన్ చెప్పుకొచ్చారు. ఆదివాసీలకు కాంగ్రెస్ పాలనలోనే సంరక్షణ ఉందన్నారు. ఆదివాసీలు ఆత్మగౌరవంతో బతికేలా కాంగ్రెస్ పోరాడుతుందన్నారు. ఇందుకు ప్రజాస్వామ్యవాదులంతా ఒక్కటై చేయూత నివ్వాలని కోరారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. ఆదివాసీలకు అండగా కాంగ్రెస్ ఉందన్నారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా అగ్రనేత రాహుల్‌గాంధీ పోరాటం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రలను ఛేదించడానికి సమష్టిగా పోరాడుతామని పిలుపునిచ్చారు. ప్రముఖ జర్నలిస్టు రవి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగానికి పునాది ఆదివాసీ సంస్కృతి అని స్పష్టం చేశారు. భూమి మీద మొదటి అధికారం ఆదివాసులదే అన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ఆదివాసీల ప్రాత గొప్పదన్నారు. ఇదే స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణ, హక్కుల కోసం ఆదివాసీలు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లపై ఉద్యమించాలని సూచించారు. నాడు రజాకారులతో పోరాడిన చరిత బీజేపీకి లేదన్నారు. కానీ బీజేపీ మాత్రం ఉనికి కోసం పోరాడినట్లు బూటకపు మాటలు చెబుతోందని విమర్శించారు. రజాకార్లతో పోరాటం చేసిన చరిత్ర కాంగ్రెస్, కమ్యూనిస్టులకు ఉందన్నారు.

ప్రొఫెసర్ కంచ ఐలయ్య మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ పరిరక్షణ, ఆదివాసీల కోసం ఎంపీ రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటం గొప్పదని కొనియాడారు. దేశంలో సామాజిక న్యాయం అమలు కోసం రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి తాము అండగా ఉన్నామన్నారు. రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ.. ఆదివాసీ సంస్కృతి పరిరక్షణ బాధ్యత కాంగ్రెస్ తీసుకుందని వెల్లడించారు. దేశంలో అన్ని వర్గాల మధ్య శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలన్నదే కాంగ్రెస్ ఉద్దేశమన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. దేశంలోని ప్రస్తుత పరిస్థితులు ఆవేదనకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. కుల, మతాల ప్రాతిపదికగా ప్రజలను విభజించి అణచివేత చర్యలకు పాల్పడడం శోచనీయమన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఐక్యతే ఈ దుస్థితిని తప్పించగలదన్నారు. కులగణనను చేపట్టి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు ఇన్నయ్య మాట్లాడుతూ.. బ్రిటీష్ వాళ్లతో తొలుత పోరాడింది ఆదివాసీలే అని, వారి చరిత్ర గొప్పదని పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆదివాసీలపై దాడులు పెరిగాయన్నారు. ఆదివాసీల జీవితాలను చిదిమేస్తోందన్నారు. దేశంలోని అన్ని వర్గాలు ఆదివాసీలకు అండగా నిలవాలని కోరారు. ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ వైస్ ఛైర్మన్ డాక్టర్ తేజవత్ బెల్లయ్యానాయక్ మాట్లాడుతూ.. బీజేపీ కుట్రలను ఛేదిస్తామని, లక్ష్య సాధన వరకు అలు పెరగని పోరాటం చేస్తామని వెల్లడించారు. ఆదివాసీలపై బీజేపీ చేస్తున్న దాడులను ప్రజాస్వామ్యవాదులంతా ఏకమై ఎదురించాలన్నారు. కాంగ్రెస్ ఈ పోరాటంలో ముందుందన్నారు. రాహుల్ గాంధీ అనేక ప్రజా స్వామ్య మార్గాల్లో ఆదివాసీల హక్కులు, భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు.



జై బాపు-జైభీమ్-జై సంవిధాన్ ర్యాలీలో ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కావ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వర్ణ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ కోదండరామ్, ప్రొఫెసర్ కంచ ఐలయ్య



మాట్లాడుతున్న డాక్టర్ రియాజ్, ప్రొఫెసర్ వెంకటనారాయణ, గాదె ఇన్నయ్య



మాట్లాడుతున్న బెల్లయ్యానాయక్

శ్రమదానం చేసిన నేతలు

సమ్మేళన్‌లో భాగంగా ఆదివారం ఉదయం కాంగ్రెస్ నేతలు శ్రమదానం చేశారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో హరిత హోటల్ నుంచి పబ్లిక్‌గార్డెన్ వరకు జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పబ్లిక్‌గార్డెన్‌లో శ్రమదానం చేశారు. చెత్త, ప్లాస్టిక్‌ను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ వైస్ ఛైర్మన్ డాక్టర్ తేజవత్ బెల్లయ్య నాయక్, ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ నాయకులు కూచన రవళి, బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలో ఈస్టర్ వేడుకలు

కాజీపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కాజీపేటలోని పలు చర్చిలలో ఆదివారం ఈస్టర్ వేడుకలు క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఫాతిమా కేథడ్రల్ చర్చి ఆవరణలో శనివారం అర్ధరాత్రి, ఆదివారం తెల్లవారుజామున పాస్కా మహోత్సవ దివ్యబలిపూజ వరంగల్ డయాసిస్ పాలనాధికారి ఫాదర్ డి.విజయపాల్ నిర్వహించారు. చర్చి విచారణ గురువు కాసుమర్రెడ్డి, ప్రత్యేక ప్రార్థనలుచేశారు. క్రీస్తు పునరుత్థానం, దాని ప్రత్యేకతపై ప్రసంగించారు. కాజీపేట సెయింట్ జోసెఫ్ చర్చి పెనుయేలు ప్రార్థనా మందిరంలో పాస్టర్ పి.విక్టర్‌బాబురాజ్ ఈస్టర్ సందేశాన్ని అందించారు. బ్యాలా,



కర్మెల్ చర్చిలలో పాస్టర్‌లు క్రీస్తు పునరుత్థానంపై ప్రసంగించి ప్రార్థనలు చేశారు. ఈస్టర్ పురస్కరించుకుని చర్చిలలో క్రైస్తవులతో కిటకిటలాడాయి.

ఘనంగా పీజీ కళాశాల వార్షికోత్సవం

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ వరలక్ష్మి అధ్యక్షత జరిగిన సమావేశంలో కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ కట్ల, కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వెంకయ్య, పాలకమండలి సభ్యురాలు రమలు హాజరై మాట్లాడారు. విద్యార్థుల చిత్తశుద్ధితో కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని అన్నారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

వరంగల్ క్రైం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆటోలో మరిచిపోయిన ప్రయాణికురాలి బ్యాగును తిరిగి అందజేసి నిజాయితీ చాటుకున్నాడు ఓ ఆటోడ్రైవర్. హనుమకొండ సీఐ సతీష్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన మహిళ రాంషా హనుమకొండ పెట్రోల్ పంపు వద్ద ఆటో ఎక్కి. చౌరస్తాలో దిగుతున్న క్రమంలో బ్యాగ్‌ను మరిచిపోయింది. ఆటోలో ఉన్న హ్యాండ్ బ్యాగును గమనించిన ఆటోడ్రైవర్ జానీపాషా హనుమకొండ పోలీసులను సంప్రదించాడు. హ్యాండ్ బ్యాగులోని బాధితురాలి ఫోన్‌నెంబర్‌కు ఫోన్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఆటోడ్రైవర్ చేతుల మీదుగా బ్యాగ్ అందజేశారు. కాగా, బ్యాగులో రూ.15వేల నగదు ఉంది. ఆటోడ్రైవర్‌కు మహిళ ధన్యవాదాలు తెలుపగా, సీఐ అభినందించారు.

అడుగుకో గుంత.. గజానికో గొయ్యి



గుంతలమయంగా మారిన గుడిబండల్ సర్కిల్‌రోడ్డు

- 8వ డివిజన్‌లో అధ్వానంగా అంతర్గత రోడ్లు
- నరకం చూస్తున్న వాహనదారులు
- నిర్లక్ష్య ధోరణిలో పాలకులు, అధికారులు



గుంతలతో స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ భవన్ నుంచి కుమార్‌పల్లికి వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ 8వ డివిజన్ పరిధిలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. అమృత థియేటర్ నుంచి గుడిబండల్ వరకు వెళ్లే ప్రధాన రోడ్డులో అడుగుకో గుంత దర్శనమిస్తోంది. రోడ్డుపైన ఉన్న గొయ్యి లాంటి గుంతల్లో సర్కస్ ఫీట్లను చేస్తూ వాహనదారులు ప్రయాణిస్తున్నారు. గుంతల్లో పడి వాహనదారులు పలుమార్లు ప్రమాదాలకు గురైన సంఘటనలతో బెంబేలెత్తుతున్నారు. హనుమకొండ చౌరస్తాకు కూతవేటు దూరంలో ఉన్న నేపథ్యంలో ఈప్రాంతం నుంచి నిత్యం వేలాది మంది ప్రజలు, వందల్లో వాహనదారులు ప్రయాణిస్తుంటారు. అయితే ఈ రోడ్లపై ఏర్పడ్డ గుంతలను కనీసం పూడ్చేనాథుడే లేకపోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

అదేవిధంగా డివిజన్ పరిధి అశోకా జంక్షన్ సిగ్నల్ నుంచి కాంగ్రెస్ భవన్ మీదుగా కుమార్‌పల్లి కూరగాయలమార్కెట్, బుద్ధ భవన్, రెడ్డికాలనీ, గుడిబండల్ ప్రాంతాలకు వెళ్లే మరో ప్రధాన రోడ్డు పరిస్థితి అడుగుకో గొయ్యి.. గజానికో గుంతలాగా అధ్వానంగా మారింది. డివిజన్ పరిధిలోని గుడిబండల్, కుమార్‌పల్లి సర్కిళ్ల గుండా వివిధ ప్రాంతాలకు ప్రతీరోజు వాహనదారులు, బాటసారులు నిత్యం ప్రయాణాన్ని కొనసాగిస్తుంటారు. రోడ్డు పక్కనే జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఉండటంతో వందల మంది పార్టీ కార్యకర్తలు ఇదేరోడ్డు మీదుగా రాకపోకలు చేపట్టడంతో ట్రాఫిక్ జామ్ అవుతుంటుంది. అదేవిధంగా ఈ రోడ్డు పలు వాణిజ్య సముదాలకు అనుసంధానంగా ఉండటం, ఇదే రోడ్డు పక్కన ఓ బార్ షాపు, వైన్స్ షాపు ఉండటంతో లిక్కర్ కొనడానికి వచ్చిన మందుబాబులు ఇష్టానుసారంగా తమ వాహనాలను నడిరోడ్డుపైనే పార్కింగ్ చేయడం కారణంగా ట్రాఫిక్ జామ్‌తో స్థానికులు వాహనదారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా ఈ ప్రాంతానికి కూతవేటు దూరంలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే గుంతలమయంగా మారిన రోడ్లు, మరోపక్క ట్రాఫిక్ జామ్ కావడంతో అటుగా ప్రయాణం సాగించాలంటే వాహనదారులు జంకుతున్నారు. రెండేళ్ల కిందట వేసిన రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పట్టించకుండా తూతూమంత్రంగా పనులు చేపట్టడంతో రోడ్డు దెబ్బతిని కంకర తేలి మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డివిజన్ పరిధిలోని అంతర్గత, ప్రధాన రోడ్ల మరమ్మతు పనులు చేపట్టి వాహనదారులకు భరోసా కల్పించాలని వేడుకుంటున్నారు.

మోకాళ్లలోతు గుంతలతో వేగలేక పోతున్నాం..

పల్లెబోయిన రమేష్, స్థానికుడు



ప్రతీ రోజు వివిధ పనుల నిమిత్తం ఇంటి నుంచి గుడిబండల్ సర్కిల్ రోడ్డు మీదుగా ప్రయాణం కొనసాగిస్తుంటాం. మోకాళ్ల లోతు గుంతల కారణంగా అటుగా ప్రయాణం కొనసాగించాలంటే వణుకు పుడుతోంది. చిన్నపిల్లలు, వృద్ధులను వాహనంపై తీసుకుపోవాలంటే ఎక్కడ ఏ గుంతలో పడాల్సి వస్తోందనే భయంతో వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. గుడిబండల్ సర్కిల్ రోడ్డును మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకున్న నాథుడే లేడు. నిత్యం వందలాది మంది ప్రయాణించే ఈ రోడ్డును అధికారులు సందర్శించి వెంటనే మరమ్మతులు చేపట్టి బాటసారులకు, వాహనదారులకు భరోసా కల్పించాలి.

వేసవి తీవ్రత నుంచి పశువులను రక్షించాలి

తిరుకచ్చి మాళవిక

హసన్‌పర్తి మండల పశువైద్యాధికారి



పరామర్శ

ఆంధ్రజ్యోతి: వేసవిలో పశువుల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏవిటి?

పశువైద్యాధికారి: షెడ్లలో పశువులను దూరం దూరంగా కట్టి మేపాలి. వేడి గాలులు పశువుల మీదుగా వీయకుండా గోనె సంచులను వేలాడదీసి నీటిని చల్లాలి.

ఆంధ్రజ్యోతి: పశువుల షెడ్డు ఎంత ఎత్తు ఉండాలి?

పశువైద్యాధికారి: కనీసం 9 అడుగుల ఎత్తు ఉండాలి.

ఆంధ్రజ్యోతి: వేసవి కాలంలో గొర్రెలు, మేకలను రక్షించడానికి ఏం చేయాలి?

పశువైద్యాధికారి: ఉదయం 7 నుంచి 11 గంటల సమయంలో మేకలను మేతకు వదలాలి. తర్వాత చెట్ల కిందకు తీసుకువచ్చి చల్లని నీరు అందివ్వాలి.తతత

ఆంధ్రజ్యోతి: వేసవి తీవ్రత నుంచి వీధి కుక్కలు, పక్షులకు ఎలాంటి రక్షణ కల్పించాలి?

పశువైద్యాధికారి: చెట్ల కింద, కాలనీలలో, పార్కులలో అక్కడక్కడ నీటి తొట్టెలు పెట్టి చల్లని తాగునీరు అందించాలి.

ఆంధ్రజ్యోతి: వేసవి తాపానికి పశువులు గురైనప్పుడు రైతులకు మీరిచ్చే సూచనలు ఏమిటి?

పశువైద్యాధికారి: నీడకు వెంటనే తీసుకువచ్చి చల్లని నీరు అందించి దగ్గరలోని పశువైద్యశాలలో డాక్టర్ సూచనలమేరకు వైద్యం చేయించాలి.

- హసన్‌పర్తి (ఆంధ్రజ్యోతి)

మర్రి యాదవరెడ్డికి పలువురి పరామర్శ



మర్రి యాదవరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి తల్లి మర్రి వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగుర్ల వెంకటేశ్వర్లు, బీరవెల్లి భరత్‌కుమార్ రెడ్డి, మేడిపల్లి శోభన్‌బాబు, చింతల యాదగిరి తదితరులు ఆదివారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామంలోని ఆయన నివాసంలో పరామర్శించారు. తొలుత వెంకటమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చంద్రబాబు నాయుడు పేర ప్రత్యేక పూజలు

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని తెలుగు దేశం నాయకులు ఆదివారం హనుమకొండలోని వేయిస్తంభాలగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. చంద్రబాబు నాయుడికి రుద్రేశ్వరస్వామి ఆశీస్సులు ఉండాలని, మరింత ఎక్కువ కాలంలో ప్రజాసేవా చేయాలని ఆకాంక్షిస్తూ అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ చంద్రబాబు నాయుడు గోత్రనామాలతో పూజలు నిర్వర్తింప చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ వరంగల్ పార్లమెంట్ అడ్‌హక్ కమిటీ చీకటి రాజు, పరకాల అడ్‌హక్ కమిటీ సభ్యుడు గంగాధర వీరాంజనేయులు, దుంపల రమేష్, తత్తరి రాజా నంద్ కుమార్ పాల్గొన్నారు.

ఏపీ సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

కాజీపేట: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం నారాచంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం కాజీపేట వరంగల్ పార్లమెంట్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. పార్లమెంట్ అడహాక్ కమిటీ కన్వీనర్ అర్షనపల్లి విద్యాసాగర్ రావు కేక్‌కట్ చేశారు. పార్టీకి ఆయన చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు కాలమల మహేందర్, నరేందర్, సుబ్బారావు, వినయ్, నరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



వేయిస్తంభాల గుడిలో చంద్రబాబు పేర పూజలు నిర్వహిస్తున్న నాయకులు

రాజీవ్ పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భరత్ బాబు



వడ్డెపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని రాజీవ్ పార్కు వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం పార్కు ఆవరణలో జరిగింది. అనంతరం వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు, అధ్యక్షుడిగా బాల్నె భరత్‌బాబు, సెక్రటరీగా పి.రాంచందర్‌రావు, కోశాధికారిగా టి.శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా రౌండ్‌టేబుల్ సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):కాజీపేట దర్గాలో ఆదివారం వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దర్గా పీఠాధిపతి, హజ్‌కమిటీ చైర్మన్ ఖుస్రుపాషా మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ముస్లింలను టార్గెట్ చేస్తూ తీసుకువచ్చిన నల్లచట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చట్టాన్ని రద్దు చేయకుంటే కులమాతాలకు అతీతంగా, సెక్యులర్ భావాలు కలిగిన ప్రజలను కలుపుకొని పెద్దఎత్తున శాంతి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరైన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్‌తో పాటు ప్రముఖులు మోదీ నల్లచట్టాలపై తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రసంగించారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ముస్లిం మతపెద్దలు హాజరయ్యారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభ పాటల సీడీ ఆవిష్కరణ



తెలంగాణ భవన్‌లో రజతోత్సవ సభ పాటల సీడీని ఆవిష్కరిస్తున్న కేటీఆర్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27న నిర్వహించ తలపెట్టిన బీఆర్ఎస్ 25ఏళ్ల రజతోత్సవ సభపై మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ సలహా మేరకు మాజీ కార్పొరేటర్, కేయూ ఉద్యమ నేత జోరిక రమేష్ ఆధ్వర్యంలో రూపొందించిన రజతోత్సవపాటల సీడీని ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ పాటకు సహకారం అందించిన జోరిక రమేష్‌ను, సాహిత్యం అందించిన జెర్రిపోతుల సంధ్య, సత్యంలను కేటీఆర్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, బీఆర్ఎస్వీ వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ గండ్రకోట రాకేష్‌యాదవ్, సీనియర్ నాయకులు పొలపల్లి రాంమ్మూర్తి, బొల్లెపల్లి కమల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ఆవశ్యకతపై అవగాహన అవసరం

▸▸ ఏఐసీసీ కార్యదర్శి పెరుమాళ్ విశ్వనాథన్

హసన్‌పర్తి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన అవసరమని ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి పెరుమాళ్ విశ్వనాథన్ అన్నారు. గ్రేటర్66వ డివిజన్ కేంద్రంలో డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరిక్షణలో భాగంగా జై భీమ్, జై బాపు, జై సంవిధాన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంతో పాతమార్కెట్ నుంచి హసన్‌పర్తి బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ఆదివారం ర్యాలీని నిర్వహించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలంటూ ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే నాగరాజు, ఏఐసీసీ కోఆర్డినేటర్ పులి అనిల్‌కుమార్ అంబేద్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశాన్ని పాలిస్తున్న బీజేపీ రాజ్యాంగాన్ని అవమానిస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ అప్రజాస్వామ్య పాలన కొనసాగిస్తోందన్నారు. కాంగ్రెస్ పాలనతోనే దేశంలోని బడుగు, బలహీనవర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఏఐసీసీ కార్యదర్శి, మేయర్, ఎమ్మెల్యే, కుడా చైర్మన్

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్రాంరెడ్డి, ఆత్మకూరు మార్కెట్ వైస్‌చైర్మెన్ తంగెళ్లపల్లి తిరుపతి, బంక సరళ, వీసం సురేందర్‌రెడ్డి, పూల, వెంకటస్వామి, మధు, రాజు, సంతోష్, ప్రభాకర్, సురేష్, ఆనంద్, రమేష్, రవీందర్, సతీష్, సాంబయ్య, అనుష తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది

▸▸ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

వడ్డెపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎల్కతుర్తిలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్, 58వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్మడి లోహిత రాజు ఆధ్వర్యంలో 58, 59, 60 డివిజన్లలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్జీవోస్ కాలనీలోని బాలయ్య హోటల్ జంక్షన్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. దుర్మార్గపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓట్లేసిన ప్రజలే ఆ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నారన్నారు. రజతోత్సవ సభకు ప్రతీ ఇంటి నుంచి పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మిడిదొడ్డి స్వప్న, కేశబోయిన అరుణ శ్రవణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు చిన్న , బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆకుల మధు, మచ్చ మహేందర్, చంద్రమౌళి గౌడ్, జైపాల్, సుదర్శన్, ప్రసంగి తదితరులు పాల్గొన్నారు.

చార్లీచాప్లిన్ సేవలు అమోఘం



మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

వడ్డెపల్లి: నవ్వుల రారాజు చార్లీచాప్లిన్ సేవలు అమోఘమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో రోజా ఆర్ట్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన చార్లీచాప్లిన్ 136వ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. రోజా క్రియేషన్స్ సంస్థ నిర్వాహకు డు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులను సత్కరించారు.

పూర్వ విద్యార్థుల సమావేశం

కాజీపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట దర్గా ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న 1989-90 ఏడో తరగతి పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం జరిగింది. నాటి ఉపాధ్యాయులు లక్ష్మి మాణిక్యం, రాంబాబు, స్వర్ణలత, ఇందిరలను ఘనంగా సన్మానించారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో సామాజిక వేత్తలు సిరిమల్ల రాధాకృష్ణ, ఆడెపు రాజన్‌బాబు హాజరయ్యారు.


కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పని చేస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ ఆరోపించారు. ఆదివారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన కార్మిక సంఘాల సమావేశంలో రమేష్ పాల్గొని మాట్లాడారు. 100 ఏళ్ల కిందట పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తీసుకురావడానికి కేంద్రప్రభుత్వం చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, వివిధ అసోసియేషన్లు మే 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయడం కోసం ఈనెల 27న కేయూసీలో జిల్లా సదస్సును నిర్వహిస్తున్నట్లు రమేష్ తెలిపారు. ఈ సమావేశంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్యాంసుందర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జక్కుల రాజుగౌడ్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు నున్న అప్పారావు, ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకులు షైముదా, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడుసారంగపాణి, కార్మిక సంఘాల నాయకులు పుల్ల అశోక్, ఎన్. రజిత, గుంటి రాజేందర్ మల్లేశం, ఆర్.కుమార్, ఎ.మల్లయ్య, డి.భానునాయక్, ఆర్. వంశీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డిపల్లిలో సీపీఎం గ్రామ సర్వే

హసన్‌పర్తి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లారెడ్డిపల్లిలో సీపీఎం పార్టీ మండల కమిటీ సభ్యుడు మంద సుచెందర్, వేలు రజిత ఆధ్వర్యంలో గ్రామ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలలో 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇప్పటి వరకు పెన్షన్ మంజూరు కాలేదన్నారు. అనేక నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు అందలేదని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీ స్కీముల్లో ఒక్కటి అమలు కాలేదని, సీసీ రోడ్ల నిర్మాణం అత్యవసరమని, రేషన్ షాపు ప్రతీనెల సమయానికి సరఫరా చేయడం లేదని ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించినట్లు సర్వే నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు సుధాకర్, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులకు న్యాయం చేయాలి



దీక్షలో పాల్గొన్న కాంట్రాక్టు అధ్యాపకులు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు న్యాయం చేయాలని కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతలు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, సాధు రాజేశ్, మాదాసి కనుకయ్యలు కోరారు. ఆదివారం కేయూ పరిపాలన భవనం ఎదుట వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు నిరవధిక సమ్మెలో భాగంగా రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిరంజన్, జూల సత్య, సూర్యనారాయణ, చంద్రశేఖర్, రఘువర్ధన్‌రెడ్డి, సునిత, సంగీత్‌కుమార్, భాగ్య, సుకన్య, ఉషాకిరణ్, శ్రీలత, సత్యనారాయణ, సిద్ధార్థ, రజిత, మనీశ్, భాగ్యలక్ష్మి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులకు అండగా ప్రజలు నిలవాలి

మడికొండ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రశ్నించే గొంతుకలుగా ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్న కమ్యూనిస్టులకు ప్రజలు అండగా నిలవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కోరారు. మడికొండలో ఆదివారం సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి కొరపల్లి జ్యోతి అధ్యక్షతన జరిగిన మహా సభకు పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రశ్నించే గొంతుకలను ప్రజలకు దూరం చేయాలని చూస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజాసామ్యాన్ని రక్షించడానికి, ప్రజలను చైతన్యం చేయడానికి కమ్యూనిస్టులు నిరంతరం శ్రమించాలని కోరారు. డంప్ యార్డు వల్ల ప్రజలు రోగాల బారిన పడుతూ, అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. డంపింగ్ యార్డును తరలించకుంటే సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా సమీకరణ చేసి డంప్‌యార్డు ఎత్తివేసే వరకు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, నాయకులు మాలోత్ శంకర్‌నాయక్, రాసమల్ల దీన, వేల్పుల సారంగపాణి, కొట్టెపాక రవి, నేదునూరి వెంకట్రాజం, కోరపెల్లి రమ, మాధవి, లావణ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మడికొండ మహాసభలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...

దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !

పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.

సంప్రదించగలరు : హన్మకొండ

Hanamkonda ACO - 9985410935,
Hasanparthy SR - 9059882000, Hanamkonda - 9704361601
Parkal SR- 7396327489, Kazipet SR - 8519926489
ACM - 9985411664

పిల్లలకు ఇవి నేర్పించాలి..!

పిల్లలు బడిలో చదువుతున్నప్పుడే... తల్లిదండ్రులు వాళ్లకి చిన్న చిన్న ఇంటిపనులు చేయడం నేర్పించాలి. దీనివల్ల పిల్లలకు బాధ్యత, సహాయం చేయడం, ఆత్మవిశ్వాసం, విచక్షణా జ్ఞానం, సంఘటిత శక్తి విలువ అవగతమవుతాయి. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు దాన్ని పరిష్కరించుకునే సామర్థ్యం అలవడుతుంది. పిల్లలకు చిన్నతనంలోనే నేర్పించాల్సిన పనులు ఇవే...

- కూరగాయలు కడగడం-కోయడం, మసాలా దినుసుల వివరాలు- వాటి వినియోగం, వంటగది గట్టు తుడవడం, భోజనం వడ్డించడం, పాత్రలు కడగడం లాంటి పనులను పిల్లలకు చెప్పి చేయించాలి.
- నిద్ర లేవగానే దుప్పట్లు మడతపెట్టడం, పరుపు సర్దడం, ఉతికిన బట్టలు ఆరవేయడం-మడతపెట్టడం, బీరువాలో బట్టలు సర్దడం నేర్పించాలి.
- లైట్లు, ఫ్యాన్లు, టీవీ, సోఫా, అద్దం, ఇంట్లోని అలంకరణ వస్తువులను దుమ్ము లేకుండా తుడవడం నేర్పించాలి.
- ఇల్లు ఊడవడం, వ్యాక్యూమ్ క్లీనర్‌ను ఉపయోగించడం, చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు అందివ్వడం లాంటివి నేర్పించాలి.
- న్యూస్ పేపర్లు, పుస్తకాలను అరల్లో సర్దడం చూపించాలి.
- ఇంటికి కావాల్సిన కిరాణా సరుకుల లిస్ట్ రాయడం, బజారు నుంచి కూరగాయలు తీసుకురావడం లాంటివి నేర్పించాలి. ధరలు-నాణ్యతలపై అవగాహన కల్పించాలి
- ఇంటికి వచ్చిన అతిథులను పలకరించడం, ఆదరించడం, గౌరవించడం నేర్పించాలి.
- టూత్‌బ్రష్‌లు, టూత్‌పేస్టు, షాంపూ, సబ్బులు తదితరాలను వినియోగించుకున్న తరవాత వాటిని యథాస్థానంలో ఉంచడం అలవాటు చేయాలి.
- ఇంట్లో బూజులు దులపడం, మొక్కలకు నీళ్లు పోయడం, పరిసరాల్లో చెత్తచెదారం లేకుండా శుభ్రం చేయడం లాంటి పనులు నేర్పించాలి.



వినూత్నం

పచ్చని ప్రకృతి నడుమ గుడారం వేసుకుని ప్రకృతి అందాలను ఆస్వాదించే 'క్యాంపింగ్' గురించి మనందరికీ తెలుసు. అయితే ఈ అనుభవానికి మరింత గ్లామర్‌ను జోడించి, సరికొత్త 'గ్లాంపింగ్' పోకడకు శ్రీకారం చుట్టింది కేరళకు చెందిన ఎలీనా థామస్. కొడైకెనాల్‌కు దగ్గర్లోని పూంబరాయ్ గ్రామంలో 'లక్స్‌గ్లాంప్' ఇకో రిసార్ట్స్‌తో వినూత్న గ్లాంపింగ్ అనుభవాలను పంచుతున్న ఎలీనా 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.

గ్లాంపింగ్‌తో పర్యాటకానికి కొత్త కళ



నాకు చిన్నప్పటి నుంచి కొత్త ప్రదేశాలను సందర్శించడమంటే చాలా ఇష్టం. ఇదే ఆసక్తి పెళ్లయ్యాక కూడా కొనసాగింది. మా వారు యాంటోనీ థామస్‌తో కలిసి యూరప్ మొత్తం పర్యటించాను. నిర్జనమైన చల్లని ప్రాంతాల్లోని గాజు క్యాబిన్లు మొదలు ఆకట్టుకునే ఆల్పైన్ లాడ్జీలు, డోమ్స్, బబుల్ రిట్రీట్స్‌లో కూడా బస చేశాం. కానీ ఇలాంటి అనుభవాన్ని అందించే సౌకర్యవంతమైన బసలేవీ మన దేశంలో నాకు కనిపించలేదు. ఎలాంటి పర్యాటక ప్రాంతానికి వెళ్లినా పూర్తి విలాసవంతమైన హోటళ్లు లేదా ప్రాథమిక వసతులు కూడా లేని క్యాంపింగ్ గుడారాలు మాత్రమే మాకు కనిపించాయి. కానీ పిల్లలతో, పెద్దలతో కలిసి ఒక ప్రశాంతమైన ప్రాకృతిక ప్రదేశంలో కొన్ని రోజులు సురక్షితంగా గడపాలనుకుంటే, అందుకు తగిన ఏర్పాట్లు బసలో ఉండి తీరాలి. ఆ బస అందమైన ప్రకృతి మధ్యలో ఉండాలి. దాన్లో అన్నిరకాల ఆధునిక సదుపాయాలూ ఉండాలి. ఆ ఆలోచనతో గ్లాంపింగ్‌లో భాగంగా 2018లో 'లక్స్‌గ్లాంప్'కు శ్రీకారం చుట్టాం!

మాది కేరళలోని త్రిస్సూరు. నేను ఎమ్‌బిఎ చదివాను. మా వారు యాంటోనీ థామస్, బిజినెస్ డెవలపర్. వృత్తి రీత్యా మేం దుబాయ్‌లో స్థిరపడ్డాం! లగ్జరీతో పాటు క్యాంపింగ్ అర్థం స్ఫురించేలా మా ఇకో రిసార్ట్‌కు లక్స్‌గ్లాంప్ అనే పేరును ఎంచుకున్నాం.

ప్రకృతి, విలాసాలు కలగలసి...

బస కోసం సంప్రదాయ నిర్మాణాలకు బదులుగా డోమ్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించుకున్నాం. అందుకోసం పచ్చని ప్రకృతికి ఆలవాలమైన కొడైకెనాల్, మున్నార్‌లలో లక్స్‌గ్లాంప్‌లను నెలకొల్పాం. దక్షిణ భారతదేశంలో ఇలాంటి డోమ్ నిర్మాణాలు ఎక్కడా లేవు. కాబట్టి ఈ వినూత్నమైన డోమ్ స్ట్రక్చర్స్ నిర్మించడం కోసం ఎంతో కష్టపడ్డాం. ముడి సరుకులన్నిటినీ చైనా, బాలిల నుంచి దిగుమతి చేసుకున్నాం. ఎక్కడా రాజీ పడకుండా, అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా కుటుంబమంతా సౌకర్యంగా బస చేయడానికి తగిన ఏర్పాట్లను డోమ్స్‌లో కల్పించాం. ప్రత్యేకించి లక్స్‌గ్లాంప్ కోసం, కొడైకెనాల్‌కు పాతిక కిలోమీటర్ల దూరంలోని పూంబరాయ్ గ్రామాన్ని ఎంచుకోడానికి కూడా ప్రత్యేక కారణం ఉంది. కోలాహలానికి దూరంగా ప్రశాంతమైన పరిసరాలను వెతుక్కుంటూ కొడైకెనాల్ చేరుకున్నప్పుడు మాకీ కొండ ప్రాంతం కనిపించింది. అప్పట్లో ఈ ప్రాంతమెంతో వెనకబడి ఉంది. సరైన రోడ్డు సదుపాయాలు కూడా లేవు. కానీ శ్రమకోడ్చి లక్స్‌గ్లాంప్‌ను నిర్మించిన తర్వాత, పర్యాటకుల తాకిడి పెరగడంతో ఈ గ్రామానికి కొత్త కళ చేకూరింది. ప్రయాణ సదుపాయాలు కూడా పెరిగాయి. కొందరు స్థానికులకు లక్స్‌గ్లాంప్‌లో ఉద్యోగాలు కూడా కల్పించాం.



వైఫై, టివి లేకుండా....

లక్స్‌గ్లాంప్‌లో బస చేసే అతిథులకు కల్తీ లేని ప్రాకృతిక అనుభవాన్ని అందించాలన్నది మా సంకల్పం. కాబట్టి అత్యవసరమైనప్పుడు మినహా వైఫై సదుపాయాలను అందించకూడదని నిర్ణయించుకున్నాం. అతిథులను ప్రకృతికి మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతోనే డోమ్స్ లోపల టివి సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయలేదు. భవిష్యత్తులో ఇదే తరహా గ్లాంపింగ్ నిర్మాణాలను భారతదేశంలోని మరిన్ని పర్యాటక ప్రదేశాలకు విస్తరించాలన్నది మా సంకల్పం.

• గోగుమళ్ల కవిత

కస్తూరి పుచ్చకాయ మిల్క్‌షేక్!

వేసవిలో తియ్యని కస్తూరి పుచ్చకాయలు (మస్క్ మిలన్) లభిస్తాయి. వీటిలో పీచుపదార్థం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఆరోగ్యానికి మంచిది. వీటికి వేసవి తాపాన్ని తగ్గించే శక్తి కూడా ఉంటుంది. ఈ కస్తూరి పుచ్చకాయతో వి ఎల్క్‌షేక్ ఎలా చేయాలో తెలుసుకుందాం..

తయారీ విధానం

- బాగా పండిన కస్తూరి పుచ్చకాయను తీసుకొని.. దాని లోపల ఉన్న గుజ్జును వి ఎక్సీలో వేసి బాగా తిప్పాలి. దానిలో ఒక గ్లాసు చల్లటి పాలను, తేనెను, పావు స్పూను వెనీలా ఎసెన్స్‌ను వేసి మరో సారి తిప్పాలి.
- దీనిని ఐస్ ముక్కలు వేసిన ఒక గ్లాసులో పోయాలి. మిల్క్‌షేక్ చిక్కగా కావాలనుకొనేవారు పాలను ఫ్రీజర్‌లో పెట్టి .. అది గట్టిపడిన తర్వాత నేరుగా మిక్సీలో వేయవచ్చు.
- పిల్లలకు ఇచ్చే సమయంలో కొద్దిగా ఐస్‌క్రీమ్ వేస్తే రుచి ఇంకా పెరుగుతుంది.



బరువు ఎప్పుడు చూసుకోవాలి..?

మనం సరిగ్గా ఎంత బరువున్నామో తెలియాలంటే విధిగా కొన్ని నియమాలు పాటించాలని నిపుణులు చెబుతున్నారు. వాటి గురించి తెలుసుకుందాం...



- ఉదయం పూట నిద్ర లేవగానే ఖాళీ కడుపుతో బరువును పరీక్షించుకోవాలి. అప్పుడే సరైన బరువు తెలుస్తుంది.
- వారానికి ఒకసారి బరువును పరీక్షించుకోవడం మంచిది. ప్రతిరోజూ శరీరంలో నీటి శాతం, ఆహారం తీసుకునే వి ధానం మారుతూ ఉంటాయి. వీటివల్ల బరువులో హెచ్చు తగ్గులు కనిపించవచ్చు. కాబట్టి ప్రతిరోజూ బరువు చూసుకోకూడదు.
- ప్రతీ వారం... ఒకే రోజున ఒకే సమయానికి ఒకే దుస్తులు ధరించి పరీక్షించుకుంటే కచ్చితమైన బరువు తెలుస్తుంది.
- నెలసరి సమయంలో హార్మోన్ల మార్పుల కారణంగా శరీరంలో నీరు నిలుస్తుంది. కడుపు ఉబ్బరంగా కూడా అనిపిస్తూ ఉంటుంది. ఈ సమయంలో బరువు చూసుకోకూడదు.
- మలబద్ధకం ఉన్న సమయంలో కూడా బరువు చూడకూడదు. తరచూ నీళ్లు తాగుతూ పీచుపదార్థాలు ఉన్న ఆహారాన్ని తీసుకుంటూ సమస్య తీరిన తరవాత మాత్రమే బరువు చూసుకోవాలి.
- రాత్రి పూట పడుకునేముందు బరువు చూడకూడదు.
- భోజనం చేసిన వెంటనే బరువు పరీక్షించుకోకూడదు. తిన్న తరవాత కనీసం పన్నెండు నుంచి ఇరవై గంటలు ఆగిన తరవాతే బరువు చూసుకోవాలి.

అందమైన చర్మం కోసం పానీయాలు..!

సరైన పోషకాలు అందినప్పుడే చర్మం అందంగా కనిపిస్తుంది. ఈ వేసవిలో ఆరోగ్యకరమైన పానీయాలు సేవించి చక్కని చర్మాన్ని సొంతం చేసుకోవచ్చు. చర్మాన్ని మెరిపించే పానీయాలు ఇవే...

- ఎండాకాలంలో తేనె కలిపిన గ్రీన్ టీ తాగడం మంచిది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోని టాక్సిన్లను బయటికి పంపుతాయి. దీంతో చర్మం మృదువుగా మారుతుంది.
- ఒక గ్లాసు నీటిలో రెండు చెంచాల నిమ్మరసం, ఒక చెంచా అల్లం రసం కలుపుకుని తాగితే చర్మానికి కొత్త కాంతి లభిస్తుంది.
- ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లలో ఒక చెంచా కలబంద జ్యూస్ కలుపుకుని తాగితే చర్మం తేమగా ఉంటుంది. ఎండ వల్ల కమిలిన చర్మం యథాస్థితికి వస్తుంది. ముఖం మీద మొటిమలు రావు.
- ఒక గ్లాసు వేడి నీళ్లలో చిటికెడు పసుపు వేసుకుని తాగితే చర్మం బిగుతుగా మారుతుంది. పసుపులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చర్మ సమస్యలను నిరోధిస్తాయి.
- వేసవికాలంలో వారానికి రెండుసార్లు నారింజ రసం తాగుతూ ఉంటే కొల్లాజెన్ ఉత్పత్తి పెరిగి చర్మం మీద ముడతలు మాయమవుతాయి.



- ప్రతిరోజూ క్యారెట్ జ్యూస్ తాగడం వల్ల ఎ, కె, సి విటమిన్లు అంది చర్మం ప్రకాశవంతంగా కనిపిస్తుంది.
- పుచ్చకాయలో ఎక్కువగా నీరు ఉంటుంది. కొద్దిగా ఫైబర్, గ్లూకోజ్ తదితరాలు కూడా ఉంటాయి. తరచూ పుచ్చకాయ రసం తాగుతూ ఉంటే చర్మం ఛాయగా ఉంటుంది.
- ప్రతిరోజూ కీర దోస జ్యూస్ తాగితే...చర్మం పొడిబారకుండా ఉంటుంది.

బాల్యమంతా కష్టాలు... వైవాహిక జీవితం క్షణక్షణం నరకం. 34 ఏళ్ల వయసులో ముగ్గురు పిల్లలతో వీధిన పడిన నీతా... విధిని ఎదిరించి నిలిచారు. పురుషుల ఆధిపత్యం ఉన్న రవాణా రంగంలో... పదమూడు బస్సుల యజమానిగా తనదైన గుర్తింపు సాధించారు. సమాజ సేవలో కూడా 'నేను సైతం' అంటున్న నీతా ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...

ఆత్మస్థైర్యమే ఆయుధంగా...



"చిన్న వయసులో నా తోటి పిల్లలను చూస్తే నాకు చాలా అసూయగా ఉండేది. వారిలో వెల్లివిరిసే సంతోషం నాకు లేనందుకు బాధ కలిగేది. ఎందుకంటే... ఏ రోజూ రాత్రి మా అమ్మ చేతుల్లో తన్నులు తినకుండా, ఏడవకుండా నేను నిద్రపోలేదు. మా నాన్న రోజూ తాగి వచ్చి అమ్మను కొట్టేవాడు. అతణ్ని ఎదిరించలేని నిస్సహాయతను అమ్మ నా మీద ప్రదర్శించేది. నేను పుట్టకపోయినట్లైతే... తను ఎప్పుడో ఈ లోకాన్ని వదిలేసేదాన్ని అని అనేది. నాకు ఆరేళ్ళ వయసున్నప్పుడు... నాన్న వేధింపులు భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకుంది. నాన్న నన్ను పెంచలేనంటూ మా తాతయ్య ఇంట్లో వదిలేశాడు.

నిత్యం వేధింపులే...

మాది మహారాష్ట్రలోని ఒక పల్లెటూరు. బడికి వెళ్ళింది తక్కువే. అయితే చదవడం, రాయడం బాగానే నేర్చుకున్నాను. పెద్ద చదువులు చదివించే స్తోమత మా తాతయ్యకు లేదు. పధ్నాలుగేళ్ళ వయసులో నాకు పెళ్ళి చేసి భారం దించుకున్నారు. అప్పటికి నా భర్తకు ఇరవై రెండేళ్ళు. ఏడాదికే మొదటి బిడ్డను కన్నాను. ముంబయిలోని అత్తవారింటికి వెళ్ళాక... నా బతుకూ మా అమ్మలాగే అయింది. నా భర్త కూడా రోజూ తాగేసి వచ్చేవాడు. నన్ను నానా మాటలతో వేధించేవాడు. దురలవాట్ల కారణంగా అతనికి పని దొరికేది కాదు. దాంతో డిప్రెషన్‌కు గురయ్యాడు. మాకు ముగ్గురు పిల్లలు. ఒక మురికివాడలో మా నివాసం. కుటుంబ పోషణ భారం నా మీదే పడింది. ఒక స్కూల్‌లో ఆయాగా చేరాను. స్కూల్ బస్సులో పిల్లలను ఇళ్ళ దగ్గర నుంచి బడికి తీసుకువెళ్ళి, తిరిగి వారి ఇళ్ళ దగ్గర దింపడం నా బాధ్యత. ఆ సమయంలోనే తోటి ఆయాల దగ్గర స్కూటర్ నడపడం నేర్చుకున్నాను. నా ఉత్సాహం చూసి... స్కూల్ వ్యాన్లు, బస్సులు నడపడం అక్కడి డ్రైవర్లు నేర్పించారు. ఇదంతా నా భర్తకు నచ్చలేదు. ఆయా పని మానేయాలని గొడవ చేసేవాడు. నిత్యం శారీరకంగా, మానసికంగా హింసించేవాడు. ఇదే పరిస్థితి కొనసాగితే... పిల్లల బతుకు కూడా నా మాదిరిగానే అవుతుందనుకున్నాను. వారికి మంచి భవిష్యత్తు కావాలంటే ఈ వాతావరణంలో వాళ్ళు పెరగకూడదనిపించింది. అలా పెళ్ళైన ఇరవై ఏళ్ళ తరువాత నా భర్తను విడిచి పెట్టాలని నిశ్చయించుకున్నాను.

ఎనిమిదేళ్ళ శ్రమ

భర్తను వదిలి వచ్చాక ఎన్నో ఇబ్బందులు ఎదురైనా... ఏనాడూ ఆత్మస్థైర్యాన్ని కోల్పోలేదు. నేను నేర్చుకున్న డ్రైవింగ్ నాకు ఆసరాగా నిలిచింది. లైసెన్స్ తీసుకున్నాను. నేను పని చేస్తున్న స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి... వ్యాన్ డ్రైవర్‌గా కొత్త జీవితం మొదలుపెట్టాను. నా భర్త, అతని విత్రులు నన్ను రకరకాలుగా వేధించారు. అనరాని మాటలెన్నో అన్నారు. డ్రైవర్‌గా పనిచేసే మహిళ అంటే సమాజానికి కూడా చిన్న చూపు ఉంటుంది. అయినా నేను కుంగిపోలేదు. పని ఉండని సమయాల్లో నా పిల్లలతో కలిసి చదువుకోవడం మొదలుపెట్టాను. బ్యాంక్ అధికారులను కలిసి, నా కథ చెప్పాను. వ్యాన్ కొనుగోలు చేయడానికి రుణం ఇవ్వాలని కోరాను.



మా స్కూల్ యాజమాన్యం హామీతో రుణం మంజూరయింది. కొత్త ప్రయాణం ఆరంభమయింది. నా భర్తతో విడాకులు తీసుకున్నాను. పిల్లల చదువుకు, మేము జీవించడానికి అయ్యే ఖర్చులు మినహా... మిగిలిన డబ్బును పొదుపుచేశాను. అప్పును సకాలంలో తీర్చడంతో... బస్సు కొనుగోలుకు రుణం దొరికింది. అప్పుడే 'శ్రీ నీతా ట్రావెల్స్' పేరిట ఒక సంస్థను ప్రారంభించాను. దాదాపు ఎనిమిదేళ్ళపాటు నేను పడ్డ శ్రమ ఫలితాన్ని ఇచ్చింది. ఇప్పుడు మా ట్రావెల్స్ ద్వారా పదమూడు బస్సులు నడుపుతున్నాను. ఎక్కువశాతం బడిపిల్లల కోసమే తిరుగుతాయి. వాటిద్వారా ముప్పై మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నాను.

ధైర్యంగా నిలబడాలి...

మరోవైపు నేను నిర్దేశించుకున్న లక్ష్యం నెరవేరింది. నా పిల్లలు బాగా చదువుకున్నారు. మా అబ్బాయి కెనడాలో స్థిరపడ్డాడు. అమ్మాయిలిద్దరూ నాకు వ్యాపారంలో సాయం చేస్తున్నారు. నేను డిగ్రీ పూర్తి చేశాను. మా ట్రావెల్స్‌కు సంబంధించిన అన్ని వ్యవహారాలు నేనే చూస్తాను. 'నీతా ఫౌండేషన్' పేరుతో ఒక సంస్థను స్థాపించి... పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నాను. ఇప్పుడు నన్ను కలిసే అమ్మాయిల్లో చాలామంది నేనే వారికి స్ఫూర్తి అని చెబుతూ ఉంటారు. మీలా ధైర్యంగా ఉండాలని కోరుకుంటూ ఉంటామంటారు. ధైర్యంగా నిలబడితే అనుకున్నవి సాధించగలమని నేను చెబుతాను. పెళ్ళి అనేది మహిళలకు అంతిమ గమ్యంగా సమాజం పరిగణిస్తుంది. వైవాహిక జీవితంలో హింసకు గురైనవారిలో ఎంతోమంది దాన్ని మౌనంగా భరిస్తున్నారు. లోకం ఏమనుకుంటుందోననే భయం, ఆర్థికపరమైన అభద్రత, పిల్లల భవిష్యత్తుపై బెంగ... ఇలా దీనికి ఎన్నో కారణాలున్నాయి. తలరాతను తిట్టుకుంటూ, కష్టాలను భరించినంత కాలం... జీవితం మరింత దుర్భరంగా మారుతుందే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదు. విధిని ఎదిరించి పోరాడితేనే గెలుపు అందుతుంది. దానికి నేనే ఉదాహరణ."

అల్లంతో కొలెస్ట్రాల్‌కు చెక్

శరీరంలో చెడు కొలెస్ట్రాల్ చేరడం వల్ల పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా రక్తప్రసరణ వ్యవస్థ మందగిస్తుంది. దీంతో శరీర భాగాలకు రక్తాన్ని పంపడం కోసం గుండె ఎక్కువగా కష్టపడాల్సి వస్తుంది. క్రమంగా గుండె బలహీనమవుతుంది. ఇలాంటి పరిస్థితులకు కారణమైన చెడు కొలెస్ట్రాల్‌ను నివారించడానికి అల్లం ఉపకరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అల్లాన్ని ఎలా వాడాలో తెలుసుకుందాం...



- అల్లాన్ని శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా కోసి మెత్తని పేస్టులా చేయాలి. ఒక గిన్నెలో ఒక గ్లాసు నీళ్లు పోసి అందులో ఒక చెంచా అల్లం పేస్టు వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే ఈ నీటిని బాగా మరిగించి గ్లాసులో పోసుకుని మెల్లగా తాగాలి. ఇలా వారానికి రెండుసార్లు తాగుతూ ఉంటే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది.
- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో ఒక గ్లాసు నీళ్లు పోసి అయిదు అల్లం ముక్కలు వేసి బాగా ఉడికించాలి. తరవాత ఈ నీళ్లను గ్లాసులోకి వడబోసి అందులో మూడు చెంచాల నిమ్మరసం కలుపుకొని తాగాలి. వారానికి ఒకసారి ఇలా తాగితే గుండె సిరల్లో పేరుకున్న కొలెస్ట్రాల్ కరిగిపోతుంది.
- ఒక అంగుళం పొడవున్న అల్లం ముక్కను సన్నగా తురమాలి. ఈ అల్లం తురుములో ఒక చెంచా బెల్లం పొడి కలపాలి. ఈ మిశ్రమాన్ని ఉదయాన్నే ఖాళీ కడుపుతో తింటే శరీర భాగాల్లో పేరుకున్న చెడు కొలెస్ట్రాల్ తొలగిపోతుంది. బెల్లానికి బదులు తేనె కూడా కలుపుకోవచ్చు.
- అల్లాన్ని చిన్న ముక్కలుగా కోసి కొద్దిగా ఆరబెట్టాలి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో రెండు అల్లం ముక్కలను నోట్లో వేసుకుని నములుతూ రసాన్ని మెల్లగా మింగాలి. తరచూ ఇలా చేస్తూ ఉంటే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పేరుకోదు. గుండె ఆరోగ్యంగా పనిచేస్తుంది.
- ఉదయాన్నే టీ పెట్టుకునేటప్పుడు అందులో చిన్న అల్లం ముక్కను కచ్చాపచ్చాగా దంచి వేయాలి. ఈ అల్లం టీ తాగడం వల్ల కూడా శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ఏర్పడదు. ఒక గ్లాసు మజ్జిగలో కొద్దిగా అల్లం తురుము కలుపుకుని తాగినా మంచి ఫలితం ఉంటుంది.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్
ఈ నైపుణ్యాలు ఉంటేనే ఆఫర్

విద్యార్థుల జీవితంలో 'క్యాంపస్ ప్లేస్‌మెంట్' కీలకమైన దశ. ప్రధానంగా ఇంజనీరింగ్ డిగ్రీ పొందడానికి ముందే జాబ్ ఆఫర్ అందుకునేందుకు ఇది మంచి అవకాశం. దరిమిలా క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో విజయం సాధించడానికి సరైన ప్రణాళికతో సిద్ధం కావాలి.



మొదటి నుంచే ప్లానింగ్: ఇంజనీరింగ్‌లో చేరిన మొదటి మూడు సంవత్సరాల్లోనే ప్లేస్‌మెంట్స్‌కు అవసరమైన ప్లానింగ్‌పై దృష్టి పెట్టాలి. అది ఎలా అంటే..
అకడమిక్ ఫౌండేషన్: మొదటి సంవత్సరం నుంచి మంచి సీజీపీఏ ఉండేలా చూసుకోవాలి. చాలా కంపెనీలు 7.5 కంటే ఎక్కువ సీజీపీఏ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తాయి.
కోర్ టెక్నికల్ స్కిల్స్ : సీ, సీ++, జావా, పైథాన్‌లతోపాటు డేటా స్ట్రక్చర్ అండ్ ఆల్గరిథమ్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్‌పై దృష్టిపెట్టాలి.
సాఫ్ట్‌స్కిల్స్: కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవడంతోపాటు టీమ్ వర్క్ అలవాటు చేసుకోవాలి. క్లబ్స్/ ఈవెంట్స్ తదితరాల్లో పాల్గొనడం ద్వారా కొంతమేర నాయకత్వ లక్షణాలు అలవడతాయి.
ఇంటర్న్‌షిప్స్ అండ్ ప్రాజెక్ట్స్: ఇంటర్న్‌షిప్, ప్రాజెక్ట్ వర్క్, ఫ్రీలాన్స్ పనులు చేయడం ద్వారా ప్రాక్టికల్ అనుభవం సంపాదించుకోవాలి.
కోడింగ్: కోడ్‌చెఫ్, లీట్‌కోడ్, హాకర్‌రాంక్, కోడ్‌ఫోర్సెస్ తదితర కోడింగ్ పోటీల్లో పాల్గొంటే అనుభవం వస్తుంది.
టార్గెట్ కంపెనీస్ రీసెర్చ్: ఫైనల్ ఇయర్‌లో చేయాల్సిన పని ఇది. ఏయే కంపెనీలు ప్లేస్‌మెంట్స్‌కు వస్తున్నాయో తెలుసుకుని, వాటికి సంబంధించిన ప్రాథమిక సమాచారం యావత్తు సేకరించుకోవాలి.
ప్లేస్‌మెంట్ ట్రెండ్స్‌పై అవగాహన: ప్లేస్‌మెంట్స్ కోసం పలు రకాల కంపెనీలు వస్తుంటాయి. అందులో మీ ప్రాధాన్యం ఏమిటో చూసుకుని సిద్ధం కావాలి. ఉదాహరణకు ఐటీ, కోర్, అనలిటిక్స్, కన్సల్టింగ్ తదితర పనుల్లో విద్యార్థి తనకు దేనిపై ఆసక్తి ఉన్నదో చూసుకోవాలి.
ఏ రకమైన ఉద్యోగాలు: సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, డేటా సైన్స్, కోర్ ఇంజనీరింగ్, కన్సల్టింగ్ తదితర ఉద్యోగాలపై అవగాహన పెంచుకోవాలి.
కంపెనీకి అనుగుణంగా ప్రిపరేషన్: సదరు కంపెనీలు గత సంవత్సరాల్లో రిక్రూట్‌మెంట్ ఎలా నిర్వహించాయో అర్థం చేసుకోండి. ఆప్టిట్యూడ్ టెస్ట్, టెక్నికల్ రౌండ్స్, హెచ్‌ఆర్ ప్రశ్నలు తదితరాలు ఉంటాయి. వీటికి అనుగుణంగా సిద్ధం కావాలి.

టెక్నికల్ ప్రిపరేషన్

ప్రోగ్రామింగ్ అండ్ డీఎస్ఏ: మాస్టర్ కీ కాన్సెప్ట్స్(అరేస్, స్ట్రింగ్స్, లింక్డ్ లిస్ట్స్, ట్రీస్, గ్రాఫ్స్, డైనమిక్ ప్రోగ్రామింగ్) పెంచుకోవాలి.
సీఎస్ ఫండమెంటల్స్: ఓఎస్, డీబీఎంఎస్, ఓఓపీలు, సీఎన్(ఐటీ/సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం) తదితరాలను రివైజ్ చేసుకోవాలి.
కోర్ ఇంజనీరింగ్ సబ్జెక్ట్స్: నాన్ ఐటీ ఉద్యోగాల కోసం కోర్ కాన్సెప్ట్సులను రివైజ్ చేసుకోవాలి.
ప్రాబ్లమ్ సాల్వింగ్ ప్రాక్టీస్: లీట్‌కోడ్, గీక్స్ ఫర్ గీక్స్ తదితర ప్లాట్ ఫారమ్‌లలో కనీసం 200పైన ప్రాబ్లమ్స్‌ను సాల్వ్ చేయడానికి ప్రయత్నించాలి.

రెజ్యూమె, లింక్డిన్ ప్రొఫైల్

రెజ్యూమెను ఆకట్టుకునేలా తయారు చేసుకోవాలి. ఇందుకోసం పలు విషయాలు పొందుపరచాలి. అకడమిక్ పర్ఫార్మెన్స్‌ను హైలైట్ చేయాలి, ప్రాజెక్ట్‌లు, ఇంటర్న్‌షిప్‌లు, నైపుణ్యాలు, సాధించిన ఘనతలు పేర్కొనాలి.
లింక్డిన్, గిట్‌హబ్: ప్రాజెక్ట్‌లు, ఇతర అచీవ్‌మెంట్స్‌తో ప్రొఫైల్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూనే ఉండాలి.

ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్

సబ్జెక్టులతోపాటు ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్‌పై దృష్టిపెట్టాలి.

- **క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్:** ప్రాఫిట్ అండ్ లాస్, టైమ్ అండ్ వర్క్, ప్రాబబిలిటీ, పర్ముటేషన్స్
- **లాజికల్ రీజనింగ్:** పజిల్స్, సిల్లోగిజమ్స్, బ్లడ్ రిలేషన్స్, కోడింగ్- డీకోడింగ్
- **వెర్బల్ ఎబిలిటీ:** గ్రామర్, రీడింగ్ కాంప్రహెన్షన్, ఒకాబులరీ(ఎమ్‌కాట్, కోకుబీస్ లాంటి పరీక్షలు)

మాక్ ఇంటర్వ్యూ, జీడీ, పీఐ ప్రాక్టీస్

టెక్నికల్ ఇంటర్వ్యూ: వైట్‌బోర్డ్‌పై కోడింగ్ ప్రాక్టీస్ చేయాలి. సొల్యూషన్స్‌ను క్లియర్‌గా విడమర్చగలగాలి.
హెచ్‌ఆర్, బిహేవియరల్ రౌండ్స్: సాధారణంగా రెగ్యులర్‌గా అడిగే ప్రశ్నలు కొన్ని ఉంటాయి. వాటికి సమాధానాలు ప్రాక్టీస్ చేయండి. ఉదాహరణకు 'టెల్ మీ అబౌట్ యువర్ సెల్ఫ్', 'వై షుడ్ వి హైర్ యు', 'డిస్క్రైబ్ ఏ చాలెంజింగ్ ప్రాజెక్ట్' తదితరాలు అన్నమాట.
గ్రూప్ డిస్కషన్: కరెంట్ అఫైర్స్‌పై తాజా సమాచారంతో ఉండాలి. లాజికల్‌గా మాట్లాడడం రావాలి.
ప్లేస్‌మెంట్ రోజు: సరైన దుస్తులు ధరించాలి. ముఖ్యంగా ఫార్మల్‌గా ఉండేలా చూసుకుంటే బెటర్. టైమ్ మేనేజ్‌మెంట్ పాటించాలి. ఆత్మవిశ్వాసంతోపాటు, ప్రశాంతంగా ఉండాలి. ఇంటర్వ్యూ సమయంలో ఏదైనా ఇబ్బంది ఎదురైతే గాబరా పడవద్దు.

బ్యాకప్ ప్లాన్

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగం రాకపోయినా ఆందోళన వద్దు. ప్రత్యామ్నాయాలు ఆలోచించుకుంటే చాలు. లింక్డిన్, ఏంజెల్ లిస్ట్, నౌకరీ, ఇండీడ్ తదితర సైట్లలో కూడా రెజ్యూమె అప్లయ్ చేసుకోవాలి.
హయ్యర్ స్టడీస్: గేట్, క్యాట్, జీఆర్ఈ పరీక్షలపై కూడా దృష్టి ఉంచుకోవాలి. ఏదీ వర్కౌట్ కాకుంటే ఎంబీఏ కోర్సుల్లో చేరొచ్చు. స్టార్టప్స్, ఫ్రీలాన్సింగ్ వైపు కూడా ఆలోచించవచ్చు.

చివరగా

కాలేజీ సీనియర్లతో నెట్‌వర్క్ మెయింటెన్ చేయాలి. హైరింగ్ పద్ధతులను తెలుసుకోవాలి. ప్రీ ప్లేస్‌మెంట్ టాక్స్‌కి వెళితే సదరు కంపెనీల అంచనాలు ఏమిటో అర్థం అవుతాయి. టెక్ ట్రెండ్స్ గురించి అవగాహన పెంచుకోవాలి.

ఉదాహరణకు

కంపెనీలు	కావాల్సిన నైపుణ్యాలు
టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో	ఆప్టిట్యూడ్, బేసిక్ కోడింగ్
మైక్రోసాఫ్ట్, గూగుల్	డీఎస్ఏ, ప్రాబ్లమ్ సాల్వింగ్
అమెజాన్, ఫ్లిప్‌కార్ట్	కోడింగ్, సిస్టమ్ డిజైన్
ఎల్ అండ్ టీ, టాటా మోటార్స్	కోర్ ఇంజనీరింగ్ నాలెడ్జ్
జేపీ మోర్గాన్, గోల్డ్‌మెన్ సాచ్	ఆప్టిట్యూడ్, డీఎస్ఏ, ఫైనాన్స్ బేసిక్

ప్రొఫెసర్
ఎన్. వి రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటీ, రాయ్‌పూర్



దిక్సూచి DIKSUCHI

అడ్మిషన్స్

యూజీసీ నెట్ 2025

యూజీసీ నెట్ 2025 నోటిఫికేషన్ వెలువడింది. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ యూనివర్సిటీలు, కళాశాలల్లో పీహెచ్‌డీ, జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) ప్రవేశాలకు 2025 సంవత్సరానికిగానూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 85 సబ్జెక్టులకుగానూ ఈ టెస్టులు జరుగుతాయి. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇది పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్.
చివరి తేదీ: 2025 మే 7
ప్రవేశ పరీక్ష ప్రారంభం: 2025 జూన్ 21 నుంచి 30 వరకు
దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ. 1150/-, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ రూ.600/-, ఎస్సీఎస్టీ పీడబ్ల్యూబీడీ 325/-
వెబ్‌సైట్: https://ugcnet.nta.ac.in

ఐఐటీ మద్రాస్‌లో కొత్త పీజీ డిప్లొమా

ఎమర్జింగ్ టెక్నాలజీ డొమైన్ల మీద నైపుణ్యాలను పెంచుకోవాలనుకునే వారి కోసం ఐఐటీ మద్రాస్ కొత్త పీజీ డిప్లొమా(వెబ్ ఎంటెక్) కోర్సును ప్రారంభించింది. ఈ ఆన్‌లైన్ కోర్సులను తాజా గ్రాడ్యుయేట్లతోపాటు, వర్కింగ్ ప్రొఫెషనల్స్ కూడా చేయవచ్చు. ప్రోగ్రామ్‌ను రకాల వారికి అనుకూలంగా ఉండేలా రూపొందించారు. ఈ తరగతులు సాయంకాలం, వారాంతాల్లో నిర్వహిస్తారు. ఈ సమయాల్లో కూడా హాజరు కాలేజీ వారు రికార్డింగ్ సెషన్‌ల ద్వారా అటెండ్ కావచ్చు.

- ఏరో స్పేస్ ఇంజనీరింగ్(ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఎమ్యునిటేషన్ టెక్నాలజీ), ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్, కమ్యూనికేషన్స్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్, మల్టీ మీడియా, మైక్రో ఎలక్ట్రానిక్స్), మెకానికల్ ఇంజనీరింగ్(మెకానికల్ డిజైన్, ఆటోమేటివ్ టెక్నాలజీ), ఇంజనీరింగ్ డిజైన్(ఈ మొబిలిటీ), ప్రాసెస్ సేఫ్టీపై ఈ కోర్సులను అందిస్తున్నారు.
- ఆసక్తిగల అభ్యర్థులు 2025 మే చివరి వరకు దరఖాస్తు చేయవచ్చు. ఎంట్రెన్స్ పరీక్ష 2025 జూలై 13న జరుగుతుంది. 2025 ఆగస్టు/సెప్టెంబర్ నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి. ఆసక్తిగల అభ్యర్థులు https://code.iitm.ac.in/webmtech వెబ్‌సైట్‌ను చూడవచ్చు.

ఉర్దూ వర్సిటీలో కోర్సులు

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి పలు కోర్సుల అడ్మిషన్లకు నోటిఫికేషన్ వెలువడింది. ఈ పీజీ, పీహెచ్‌డీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు ప్రధాన క్యాంపస్‌తోపాటు, అనుబంధ క్యాంపస్‌ల్లో ఉన్నాయి. దరఖాస్తు చేయాలనుకునే అభ్యర్థులు తప్పనిసరిగా ఉర్దూ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. లేదా టెన్త్/ఇంటర్/గ్రాడ్యుయేషన్‌లో ఉర్దూ మీడియంలో చదివి ఉండాలి. లేదా ఉర్దూ సమానమైన మదరసా కోర్సులు పాసై ఉండాలి. భాషా కోర్సులు తప్ప బోధన ఉర్దూలో ఉంటుంది. దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ 2005 మే 13. ప్రవేశ పరీక్షలు జూన్ రెండో వారంలో ఉంటాయి. పూర్తి వివరాలకు manuucoe.in/regularadmission/ వెబ్‌సైట్ చూడ

మహాత్మా జ్యోతిబా పూలే డిగ్రీ కాలేజీలో ప్రవేశాలు



మహాత్మా జ్యోతిబా పూలే వెనకబడిన తరగతుల రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీలో 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నారు.
అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియేట్ పాసై ఉండాలి.
కోర్సులు: బీఎస్సీ, బీకామ్, బీబీఏ, బీఏ, బీఎఫ్‌టీ, బీహెచ్ఎంసీటీ
చివరి తేదీ: 2025 మే 5
ఎంపిక ప్రక్రియ: విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఉంటుంది.
వెబ్‌సైట్: tgrdccet.cgg.gov.in/

జాబ్ కార్నర్

ఎన్ఎండీసీలో 179 అప్రెంటిస్ ఖాళీలు


భారత ప్రభుత్వ సంస్థ నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్ఎండీసీ)లో 179 అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తు కోరుతున్నారు. ట్రేడ్ అప్రెంటిస్ 130, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ 16, టెక్నీషియన్ అప్రెంటిస్ 13 ఉన్నాయి. సీఓపీఏ, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, ఫిట్టర్, వెల్డర్, మెకానిక్, డీజిల్, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్, కంప్యూటర్, మైనింగ్, ఎన్విరానమెంట్ ఇంజనీరింగ్ తదితరాల్లో ఈ ఖాళీలు ఉన్నాయి. సంబంధిత విభాగాల్లో ఐటీఐ, డిప్లొమా, గ్రాడ్యుయేషన్ ఉన్న గ్రాడ్యుయేట్ అభ్యర్థులు వెబ్‌సైట్‌లో nats.education.gov.in వెబ్‌సైట్‌లో, ట్రేడ్ అప్రెంటిస్ అభ్యర్థులు www.apprenticeshipidia.org దరఖాస్తు చేసుకోవచ్చు.

ఫుడ్ సేఫ్టీ విభాగంలో ఉద్యోగాలు

'ద ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా'(ఫాసీ)లో 33 ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ వెలువడింది. ఇందులో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ మొదలుకుని అసిస్టెంట్ల వరకు పలు రకాల పోస్టులు ఉన్నాయి. దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ 2025 ఏప్రిల్ 30. ఒక్కో పోస్టుకు సంబంధించిన విద్యార్హతలు, అనుభవం తదితర పూర్తి వివరాల కోసం

చిత్రజ్యోతి
SINCE 1965

పోయిరా పోయిరా మావా..



నాగార్జున, ధనుష్, రష్మిక మందన్నా ప్రధాన పాత్రధారులుగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మాతలు. జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ చిత్రం నుంచి మొదటి పాటను మేకర్స్ విడుదల చేశారు. 'పోయిరా పోయిరా మావా... రాజాలాగా దార్జాగ పోయిరా మావా..' అంటూ సాగే గీతాన్ని భాస్కరభట్ల రాయగా ధనుష్ ఆలపించారు. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు సమకూర్చారు. ధనుష్ వేసిన స్టెప్పులు ప్రేక్షకులను కట్టిపడేసేలా ఉన్నాయి. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళంలో ఏకకాలంలో నిర్మిస్తున్నారు. హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో కూడా విడుదల చేయనున్నారు.

ఈ నెలలోనే ఎన్టీఆర్ షెడ్యూల్



జూనియర్ ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, కల్యాణ్ రామ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఇటీవలె ప్రారంభం అయింది. తాజాగా ఈ చిత్రం నుంచి అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ నెల 22 నుంచి ఎన్టీఆర్ ఈ ప్రాజెక్టులోకి అడుగుపెడుతున్నారని తెలుపుతూ 'ఎక్స్'లో ఓ వీడియోను పోస్టు చేశారు. ఇందులో ఎన్టీఆర్ చాలా స్లిమ్‌గా కనిపించారు. ఈ మూవీ షెడ్యూల్ కోసమే ఎన్టీఆర్ సన్నబడ్డారని తెలుస్తోంది. ఇదివరకు ఎన్నడూ లేని విధంగా ఓ డిఫరెంట్ లుక్‌లో మాస్ పాత్రలో ఆయన కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్‌తో పాటు కీలకతారాగణం పాల్గొననుంది. యాక్షన్ సన్నివేశాలతో పాటు కొంత టాకీ పార్ట్ తెరకెక్కించనున్నారు.

ఎప్పటికీ నా మనసులో ఉండిపోయే సినిమా

సంపత్ నంది



"ఆ పరమశివుడి స్ఫూర్తితోనే 'ఓదెల 2' సినిమా కథ పుట్టింది. ఈ ప్రాజెక్ట్ అనుకున్నాక నిర్మాత మధు ఏ దశలోనూ వెనుకంజ వేయలేదు. విడుదలకు ముందే బ్రేక్ ఈవెన్ అయ్యింది. ఎప్పటికీ నా మనసులో ఉండిపోయే సినిమా ఇది" అని సంపత్ నంది అన్నారు. తమన్నా, హెబ్బా పటేల్, వశిష్ఠఎన్.సింహా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓదెల 2'. ఈ సినిమా హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో దర్శకుడు అశోక్ తేజ మాట్లాడుతూ "మా సినిమా కలెక్షన్స్ రోజురోజుకూ పెరుగుతుండటం ఆనందాన్నిస్తోంది. ఇది అందరికోసం తీసిన సినిమా" అని చెప్పారు. నిర్మాత మధు మాట్లాడుతూ "ఈ సినిమా ద్వారా నా లైఫ్‌లో ఎన్నో అద్భుతాలు జరిగాయి. చాలా మంది ఈ సినిమాకు నెగెటివ్ రివ్యూలు ఇచ్చారు. విమర్శకుల అభిప్రాయాల కంటే ప్రేక్షకుల ఆదరణే మాకు ముఖ్యం. ప్రేక్షకులు ఈ సినిమాను గెలిపించారు" అని తెలిపారు.

అన్నదమ్ముల అనుబంధాన్ని ఆవిష్కరిస్తుంది



సంపూర్ణేష్ బాబు, సంజోష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సోదరా'. మన్మోహన్ మేనంపల్లి దర్శకత్వంలో చంద్ర చగంలా నిర్మించారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ "అన్నదమ్ముల అనుబంధాన్ని హృద్యంగా ఆవిష్కరించే ఓ అందమైన కుటుంబ కథ ఇది. ఇందులో నా రోల్ భిన్నంగా ఉంటుంది. అందరికీ తమ జీవితంలోని పలు మధురమైన సందర్భాలను గుర్తుకుతెస్తుంది. అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పిస్తుంది" అని అన్నారు. "ఇది అమాయకుడైన అన్న, అప్‌డేట్ అయిన తమ్ముడి కథ. ఇలాంటి కథాంశంతో తెలుగులో ఇంతవరకూ ఏ సినిమా రాలేదు. అందరూ కనెక్ట్ అవుతారు. ఇందులోని భావోద్వేగాలు ప్రేక్షకులను నవ్విస్తాయి, ఏడిపిస్తాయి" అని సంజోష్ చెప్పారు.



సరికొత్తగా సేతుపతి


విజయ్ సేతుపతి కథానాయకుడిగా నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఏస్'. రుక్మిణి వసంత్ కథానాయిక. అరుముగకుమార్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. మే 23న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో తుపాకి గురిపెట్టిన లుక్‌లో సేతుపతి ఆకట్టుకున్నారు. సరికొత్త అంశాలతో సాగే వినూత్న కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కింది, విజయ్ సేతుపతి పాత్ర కొత్త తరహాలో ఉంటుందని యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సి.ఎస్, సినిమాటోగ్రఫీ: కరణ్ బహదూర్ రావత్,





ముంబై హ్యాట్రిక్

- వరుసగా మూడో విజయం
- ఫామ్ చాటుకున్న రోహిత్
- చెలరేగిన సూర్యకుమార్
- చెన్నై ఖాతాలో ఆరో ఓటమి



రోహిత్ శర్మ (76 నాటౌట్)



సూర్యకుమార్ (68 నాటౌట్)

నేటి మ్యాచ్
కోల్‌కతా x గుజరాత్
వేదిక కోల్‌కతా
రా.7.30 నుంచి

2 ఐపీఎల్‌లో ఎక్కువ పరుగులు (6786) సాధించిన రెండో బ్యాటర్‌గా రోహిత్. కోహ్లీ (8326) టాప్‌లో ఉన్నాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	7	5	2	0	10	0.984
ఢిల్లీ	7	5	2	0	10	0.589
బెంగళూరు	8	5	3	0	10	0.472
పంజాబ్	8	5	3	0	10	0.177
లఖ్‌నవూ	8	5	3	0	10	0.088
ముంబై	8	4	4	0	8	0.483
కోల్‌కతా	7	3	4	0	6	0.547
రాజస్థాన్	8	2	6	0	4	-0.633
హైదరాబాద్	7	2	5	0	4	-1.217
చెన్నై	8	2	6	0	4	-1.392

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ముంబై: సొంతగడ్డపై ముంబై ఇండియన్స్ మరోసారి అదరగొట్టింది. ఫామ్ కోల్పోయి ఇబ్బందిపడుతున్న ఓపెనర్ రోహిత్ శర్మ (45 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 76 నాటౌట్) ఎట్టకేలకు సత్తా చాటుకున్నాడు. అలాగే పసలేని చెన్నై సూపర్ కింగ్స్ బౌలింగ్‌ను సూర్యకుమార్ (30 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 68 నాటౌట్) కూడా చెడుగుడు ఆడడంతో.. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో హార్దిక్ సేన 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆరంభ ఐదు మ్యాచ్‌ల్లో ఒక్క గెలుపే దక్కించుకున్న ముంబైకి హ్యాట్రిక్ విజయం దక్కడం విశేషం. అలాగే సీఎస్‌కేపై వరుసగా నాలుగు ఓటముల తర్వాత ముంబై గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 5 వికెట్లకు 176 పరుగులు సాధించింది. జడేజా (35 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 53 నాటౌట్), దూబే (32 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 50) అర్ధసెంచరీలు సాధించగా, 17 ఏళ్ల ఆయుష్ (15 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 32) అరంగేట్రంలో ఆకట్టుకున్నాడు. బుమ్రాకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ముంబై 15.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 177 పరుగులు చేసి నెగ్గింది. జడేజాకు ఓ వికెట్ దక్కింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రోహిత్ నిలిచాడు.

అజేయ శతక భాగస్వామ్యంతో: ఓ మాదిరి ఛేదనలో ముంబై జోరు ఎక్కడా తగ్గలేదు. మంచు ప్రభావం కూడా ఉండడంతో వేగంగా పరుగులు వచ్చాయి. గత ఆరు మ్యాచ్‌ల్లో కేవలం 82 రన్స్ మాత్రమే చేసిన ఓపెనర్ రోహిత్ చెన్నై పేలవ బౌలింగ్‌పై ఫామ్ అందుకున్నాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడగా జట్టు పది పరుగుల రన్‌రేట్‌తో సాగింది. మూడో ఓవర్‌లో 6,4,4తో తను 14 రన్స్ అందించాడు. మరో ఓపెనర్ రికెల్టన్ (24) కూడా ధాటిని కనబర్చడంతో పవర్‌ప్లేలో జట్టు 56 పరుగులు సాధించింది. అయితే తొలి వికెట్‌కు 63 పరుగులు జత చేరాక రికెల్టన్‌ను జడేజా అవుట్ చేశాడు. చెన్నైకి దక్కింది ఈ ఒక్క వికెట్టే. ఆ తర్వాత రోహిత్‌కు సూర్య అండగా నిలవడంతో సీఎస్‌కే బౌలర్లు ధారాళంగా పరుగులిచ్చుకున్నారు. 33 బంతుల్లో రోహిత్ ఈ సీజన్‌లో తొలి హాఫ్ సెంచరీని అందుకున్నాడు. ఇక స్పిన్నర్లు జడేజా, నూర్ అహ్మద్‌లను లక్ష్యం చేసుకున్న సూర్య బౌండరీలతో చెలరేగాడు. నూర్ వేసిన ఇన్నింగ్స్ 13వ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో చెలరేగిన అతడు.. నూర్ తర్వాతి ఓవర్‌లోనూ 4,6తో భారీగా పరుగులు రాబట్టాడు. ఈ ధాటికి 26 బంతుల్లోనే హాఫ్ సెంచరీని కూడా పూర్తి చేశాడు. మరోవైపు 30 బంతుల్లో 20 రన్స్ కావాల్సిన వేళ, 16వ ఓవర్‌లోనే మూడు సిక్సర్లతో సూర్య మ్యాచ్‌ను ముగించాడు. రెండో వికెట్‌కు ఈ జోడీ అజేయంగా 114 రన్స్ అందించింది.

ఆదుకున్న జడేజా-దూబే: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై ఇన్నింగ్స్ నిదానంగా ఆరంభమైంది. ముంబై పేసర్లు చక్కటి లైన్ అండ్ లెంగ్త్ బంతులకు తోడు ఫీల్డింగ్ కూడా అద్భుతంగా ఉండడంతో సీఎస్‌కేకు పరుగులు రావడమే కష్టమై పోయింది. ఓపెనర్లు రచిన్ (5), రషీద్ (19) సింగిల్స్‌కే పరిమితమయ్యారు. తొలి మూడు ఓవర్లలో 16 పరుగులే రాగా.. ఇందులో పది డాట్ బాల్స్ ఉండడం గమనార్హం. చివరకు 18వ బంతికి చెన్నై తొలి ఫోర్ కొట్టగలిగింది. ఇక నాలుగో ఓవర్ తొలి బంతికే రచిన్‌ను పేసర్ అశ్వని అవుట్ చేశాడు. అయితే నిస్సారంగా సాగుతున్న వీరి ఇన్నింగ్స్‌కు 17 ఏళ్ల ఆయుష్ మాత్రే ఊపు తెచ్చాడు. తొలి ఐపీఎల్ అయినా సొంత వేదికపై చెలరేగాడు. నాలుగో ఓవర్‌లోనే 4,6,6తో 18 రన్స్ రాబట్టాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 48/1 స్కోరుతో నిలువగలిగింది. కానీ ఏడో ఓవర్‌లో రెండు ఫోర్లు బాదాక మాత్రేను పేసర్ చాహర్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 41 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తర్వాతి ఓవర్‌లోనే రషీద్ స్టంప్ అయ్యాడు. ఇక ఆ తర్వాత జడేజా-దూబే పూర్తి రక్షణాత్మకంగా ఆడడంతో 8-11 ఓవర్ల మధ్య ఒక్క ఫోర్ కూడా రాకపోగా కేవలం 14 పరుగులే సమకూరాయి. ఆ తర్వాత దూబే బ్యాట్ ఝుళిపించడంతో చెన్నై కాస్త కోలుకుంది. హార్దిక్ ఓవర్‌లో సిక్సర్‌తో పాటు బౌల్ట్ ఓవర్‌లో 4,6తో జట్టు స్కోరును వంద దాటించాడు. ఇక 16వ ఓవర్‌లో జడేజా 4,6 దూబే 6,6తో 24 పరుగులు రాగా... అటు దూబే 30 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. అయితే 17వ ఓవర్‌లో బుమ్రా మూడు పరుగులే ఇచ్చి ఓ స్లో డెలివరీతో దూబేకు ఝలకిచ్చాడు. దీంతో నాలుగో వికెట్‌కు 79 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. ధోనీ (4) నిరాశపర్చగా.. ఆఖరి ఓవర్‌లో జడేజా 6,4తో 16 రన్స్ రాబట్టి స్కోరును 170 దాటించాడు. అలాగే తను 34 బంతుల్లో అజేయ అర్ధసెంచరీని కూడా పూర్తి చేసుకున్నాడు.

స్కోరుబోర్డు

చెన్నై: రషీద్ (స్టంప్డ్) రికెల్టన్ (బి) శాంట్నర్ 19, రచిన్ (సి) రికెల్టన్ (బి) అశ్వని కుమార్ 5, ఆయుష్ మాత్రె (సి) శాంట్నర్ (బి) చాహర్ 32, జడేజా (నాటౌట్) 53, శివమ్ దూబే (సి) జాక్స్ (బి) బుమ్రా 50, ధోనీ (సి) తిలక్ (బి) బుమ్రా 4, ఓవర్టన్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 176/5; వికెట్ల పతనం:** 1-16, 2-57, 3-63, 4-142, 5-156; **బౌలింగ్:** దీపక్ చాహర్ 4-0-32-1, బౌల్ట్ 4-0-43-0, అశ్వని కుమార్ 2-0-42-1, శాంట్నర్ 3-0-14-1, బుమ్రా 4-0-25-2, విల్ జాక్స్ 1-0-4-0, హార్దిక్ 2-0-13-0.

ముంబై: రికెల్టన్ (సి) మాత్రె (బి) జడేజా 24, రోహిత్ (నాటౌట్) 76, సూర్యకుమార్ (నాటౌట్) 68, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 15.4 ఓవర్లలో 177/1; వికెట్ పతనం:** 1-63; **బౌలింగ్:** ఖలీల్ 2-0-24-0, ఓవర్టన్ 2-0-29-0, అశ్విన్ 4-0-25-0, జడేజా 3-0-28-1, నూర్ 3-0-36-0, పతిరన 1.4-0-34-0.



1 చెన్నై సూపర్‌కింగ్స్ తరఫున ఆడిన అతి పిన్న వయస్కుడి (17 ఏళ్లు)గా ఆయుష్ మాత్రే.

కోచ్ రమేష్‌పై సస్పెన్షన్



- తెలుగు అథ్లెట్లు శ్రీనివాస్, ప్రత్యూష సహా ఏడుగురిపై వేటు
- మరో ఇద్దరు సహాయ కోచ్‌లపైనా..
- డోప్ టెస్టుల నుంచి అథ్లెట్లు తప్పించుకునేందుకు సహకరించారని అభియోగం

న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు అంతర్జాతీయ అథ్లెట్లను తీర్చిదిద్దిన ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్‌ను 'నాడా' (జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ) సస్పెండ్ చేసింది. రమేష్‌తో పాటు సహాయ కోచ్‌లు కరంవీర్ సింగ్, రాకేష్‌పై కూడా వేటు పడింది. జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ జట్టు చీఫ్ కోచ్‌గా హైదరాబాద్‌లోని 'సాయ్' కేంద్రంలో 2023 నుంచి రమేష్ విధులు నిర్వహిస్తున్నారు. గతేడాది అక్టోబరు నుంచి ఇటీవల జరిగిన పలు జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన కొందరు క్రీడాకారులకు డోపింగ్ పరీక్షలు నిర్వహించేందుకు రక్త నమూనాలు ఇవ్వాల్సిందిగా 'నాడా' ఒక జాబితా రూపొందించింది. ఇందులోని ఏడుగురు అథ్లెట్లు ఈ పరీక్షలకు గైర్హాజరయ్యారు. తెలుగు అథ్లెట్లు షణ్ముగ శ్రీనివాస్, సీహెచ్ ప్రత్యూషతోపాటు పరాస్ సింఘాల్, పూజా రాణి, కిరణ్, జ్యోతి, శుభం మహారా తమ రక్త నమూనాలు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నారు. దీంతో నాడా నిబంధనల్లోని ఆర్టికల్ 2.3 కింద వీరిపై సస్పెన్షన్ విధించారు. వీరిలో పరాస్ గత ఏడాది ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో 2000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో స్వర్ణం.. ఫెడరేషన్ కప్, జాతీయ అంతర్ జిల్లాల ఓపెన్ పోటీల్లో శ్రీనివాస్ రజతాలు నెగ్గారు. ప్రస్తుతం రమేష్ వద్ద శిక్షణ తీసుకుంటున్న శ్రీనివాస్, ప్రత్యూషకు డోప్ పరీక్షలు నిర్వహించేందుకు కొద్దిరోజుల కిందట హైదరాబాద్‌లోని గచ్చిబౌలి క్రీడా సముదాయంలో గల 'సాయ్' సెంటర్‌కు నాడా వైద్యుల బృందం చేరుకుంది. ఆ సమయంలో పరీక్షల ఫారాన్ని నింపిన శ్రీనివాస్, ప్రత్యూష రక్త నమూనాలు ఇచ్చే సమయానికి అక్కడ నుంచి జారుకున్నట్టు తెలిసింది. దీంతో నాడా నిబంధనల్లోని ఆర్టికల్ 2.9 ప్రకారం కోచ్ రమేష్‌పై వేటు పడింది. ఈ ఆర్టికల్ ప్రకారం డోపింగ్‌కు సహకరించిన, ప్రోత్సహించిన, కుట్ర చేసిన, దాచిపెట్టడానికి లేదా వారిని తప్పించడానికి ప్రయత్నించిన కోచ్‌లు కూడా శిక్షార్హులే. కాగా, 2023లో కూడా శ్రీనివాస్ సహా మరో ఐదుగురు అథ్లెట్లు డోపింగ్ ఆరోపణలతో వేటుకు గురయ్యారు. నిషేధం ముగియడంతో వీరు గతేడాది నుంచి పోటీల్లో పాల్గొంటున్నారు.

తప్పు చేయలేదు

నేను తప్పు చేయను. తప్పు చేసే వారిని ప్రోత్సహించను. తెలుగు రాష్ట్రాల్లో ప్రతిభావంతులైన పేద అథ్లెట్లను తీర్చిదిద్దడానికే నా జీవితాంతం కృషి చేశా. ఈ విషయంలో ఎలాంటి విచారణకైనా సిద్ధం.
- నాగపురి రమేష్

సస్పెన్షన్ ఎంతకాలం..?

అభియోగాలు నిరూపితమైతే 'నాడా' నిబంధనల ప్రకారం కనీసం రెండేళ్లు, గరిష్ఠంగా జీవితకాలం నిషేధాన్ని రమేష్ ఎదుర్కోవాల్సి వస్తుంది. జకర్తా ఆసియా క్రీడల పతాకధారి ద్యుతీ చంద్, పారిస్ పారాలింపిక్స్ మెడలిస్ట్ జీవాంజి దీప్తి, హాంగ్జౌ ఆసియా క్రీడల కాంస్య పతక విజేత అగసర నందిని, పారిస్ ఒలింపియన్ యర్రాజీ జ్యోతి, దండి జ్యోతికశ్రీ వంటి ఎందరో క్రీడాకారులను రమేష్ తీర్చిదిద్దారు.

ఏఎఫ్‌ఐ ఏమంటోంది..?

ఈ ఉదంతంపై స్పందించడానికి జాతీయ అథ్లెటిక్స్ ఫెడరేషన్ (ఏఎఫ్‌ఐ) నిరాకరించింది. నాడా నిబంధనల ప్రకారం పని చేస్తుందని మాత్రమే తెలిపింది.

డోపింగ్‌పై 'నాడా' ఉక్కుపాదం..

డోపింగ్ నిబంధనలను నాడా కఠినంగా అమలు చేస్తోంది. దేశంలోని అథ్లెట్లతో పాటు వారి కోచ్‌ల వివరాల నమోదు కార్యక్రమాన్ని ఏఎఫ్‌ఐ గతేడాది మొదలుపెట్టింది. సర్టిఫైడ్ కోచ్‌లైనా, కాకపోయినా.. అథ్లెట్లు ఎవరిని తమ కోచ్‌లుగా పేర్కొంటారో వారి వివరాలను తమకు ఇవ్వాలని ఏఎఫ్‌ఐ మార్గదర్శకాలు విడుదల చేసింది. వివరాలివ్వకపోతే ఆ అథ్లెట్లను ఏఎఫ్‌ఐ బ్లాక్‌లిస్ట్‌లో పెడుతోంది. డోపింగ్ కేసులు ఎక్కువ వెలుగు చూస్తుండడంతో ఏఎఫ్‌ఐ ఢిల్లీ పోలీసు స్పెషల్ కమిషనర్ సాగర్‌ప్రీత్ హుడా నేతృత్వంలో హైపవర్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వచ్చాక డోపింగ్ కేసుల విచారణలో వేగం పెరిగింది.

గిల్‌కు రూ.12 లక్షల జరిమానా

అహ్మదాబాద్: స్లో ఓవర్ రేట్ కారణంగా గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు రూ.12 లక్షల జరిమానా విధించారు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ నిర్ణీత సమయానికి ఓవర్ల కోటా పూర్తి చేయలేదు. ఈ సీజన్‌లో గుజరాత్‌కిదే తొలి తప్పిదం. ఇంతకుముందే అక్షర్, శాంసన్, పంత్, పరాగ్, హార్దిక్ స్లో ఓవర్ రేట్‌తో జరిమానా ఎదుర్కొన్న కెప్టెన్ల జాబితాలో ఉన్నారు.

అంబుడ్స్‌మన్ ఆదేశాలపై కోర్టుకెళ్తా!

'స్టాండ్ పేరు' తొలగింపుపై అజరుద్దీన్

హైదరాబాద్: ఉప్పల్ స్టేడియంలో నార్త్ స్టాండ్‌కున్న తన పేరును తొలగించాలంటూ హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అంబుడ్స్‌మన్ రిటైర్డ్ జస్టిస్ ఈశ్వరయ్య ఇచ్చిన ఆదేశాలపై హైకోర్టుకు వెళ్లనున్నట్టు హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు, టీమిండియా మాజీ కెప్టెన్ మహ్మద్ అజరుద్దీన్ తెలిపాడు. హెచ్‌సీఏ అధ్యక్షునిగా ఉన్న సమయంలో అజర్.. జనరల్ బాడీ సమావేశం తీర్మానం లేకుండానే స్టేడియంలో స్టాండ్‌కు తన పేరు పెట్టుకోవడం నిబంధనలకు విరుద్ధమంటూ లార్డ్స్ క్రికెట్ క్లబ్ ఫిర్యాదు చేయడంతో అంబుడ్స్‌మన్ పై ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై అజర్ మాట్లాడుతూ.. 'అంబుడ్స్‌మన్ నిర్ణయంపై కచ్చితంగా న్యాయపరంగా పోరాడతా. 17 ఏళ్ల నా క్రికెట్ కెరీర్‌లో దాదాపు పదేళ్లపాటు భారత జట్టును ముందుండి నడిపించా. ఓ కెప్టెన్ పేరుమీదున్న స్టాండ్‌ను తొలగించాలని ఆదేశాలివ్వడమంటే ఇంత కంటే అన్యాయం మరోటి ఉండదు' అని అన్నాడు. కొంత మంది కావాలనే తనపై కుట్రపన్ని ఇలా చేయిస్తున్నారని అజర్ ఆరోపించాడు.

ఆరో రౌండ్‌లో హంపి గెలుపు

పుణె: ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్ కోనేరు హంపి మహిళల గ్రాండ్ ప్రీ చెస్ టోర్నీ ఆరో రౌండ్‌లో విజయం సాధించింది. ముంగున్‌తూల్ (మంగోలియా)తో ఈ రౌండ్‌లో 33 ఎత్తుల్లో హంపి గెలిచింది. మొత్తం 4.5 పాయింట్లతో హంపి రెండో స్థానంలో కొనసాగుతోంది. ఇక, భారత్‌కే చెందిన దివ్యా దేశ్‌ముఖ్‌తో ఆరో రౌండ్‌ను ద్రోణవల్లి హారిక డ్రా చేసుకుంది. మొత్తం మూడు పాయింట్లతో హారిక ఐదో స్థానంలో నిలిచింది. దివ్య (4) మూడో స్థానంలో కొనసాగుతోంది. భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలిపై నెగ్గిన చైనా జీఎం ఝు జినెర్ (5) టాప్‌లో నిలిచింది.

జైషా 'రికార్డు' పర్యటన



న్యూఢిల్లీ: ఐసీసీకి పిన్న వయస్సు (36 ఏళ్లు) చైర్మన్‌గా ఎన్నికై జైషా ఇప్పటికే రికార్డు సృష్టించారు. అలాగే ప్రపంచానికి పెద్దగా పరిచయంలేని ఆఫ్రికా దేశం బోట్స్‌వానాలో పర్యటించిన తొలి ఐసీసీ చీఫ్‌గా అతడు మరో ఘనత అందుకున్నాడు. ఇటీవల జింబాబ్వేలో జరిగిన ఐసీసీ సమావేశానికి జైషా హాజరయ్యాడు. అనంతరం జింబాబ్వే పక్క దేశమైన బోట్స్‌వానా వెళ్లాడు. ఆ దేశ క్రికెట్ సంఘం అధ్యక్షుడు సుమోద్ దామోదర్‌తో భేటీ అయ్యాడు. బోట్స్‌వానాలో క్రికెట్ అభివృద్ధి గురించి దామోదర్‌తో చర్చించాడు.

బెంగళూరు.. ప్రతీకారం

కోహ్లీ, పడిక్కల్ అర్ధ శతకాలు



విరాట్ కోహ్లీ (54 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 73 నాటౌట్)

7 వికెట్లతో పంజాబ్ చిత్తు

ముల్లన్‌పూర్: విరాట్ కోహ్లీ (54 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 73 నాటౌట్), దేవ్‌దత్ పడిక్కల్ (35 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 61) అదరగొట్టడంతో.. పంజాబ్ కింగ్స్‌పై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ప్రతీకారం తీర్చుకొంది. శుక్రవారం సొంతగడ్డపై అయ్యర్ సేన చేతిలో చిత్తయిన బెంగళూరు.. 48 గంటలు తిరక్కుండానే లెక్కసరి చేసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ 7 వికెట్లతో పంజాబ్‌పై ఘన విజయం సాధించింది. తొలుత పంజాబ్ 20 ఓవర్లలో 157/6 స్కోరు చేసింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (33), శశాంక్ సింగ్ (31 నాటౌట్), జోష్ ఇంగ్లిస్ (29), మార్కో జెన్సన్ (25 నాటౌట్) పర్వాలేదనిపించారు. క్రునాల్ పాండ్యా, సుయాష్ శర్మ చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో బెంగళూరు 18.5 ఓవర్లలో 3 వికెట్లకు 159 రన్స్ చేసి గెలిచింది. కోహ్లీ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

కష్టపడకుండా కొట్టేశారు: బెంగళూరు ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే ఓపెనర్ సాల్ట్ (1)ను అవుట్ చేసిన అర్ష్‌దీప్ షాకిచ్చాడు. కానీ, మరో ఓపెనర్ విరాట్ కోహ్లీ సహకారంతో దేవ్‌దత్ పడిక్కల్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 69 బంతుల్లో 103 రన్స్ జోడించడంతో.. మ్యాచ్ బెంగళూరువైపు మొగ్గింది. బౌండ్రీతో ఖాతా తెరిచిన పడిక్కల్.. ఆ తర్వాత చెలరేగాడు. మరోవైపు వీలుచిక్కినప్పుడల్లా కోహ్లీ షాట్లు ఆడడంతో 6 ఓవర్లకు బెంగళూరు 54/1తో నిలిచింది. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పరుగుల వేగం మందగించింది. కానీ, సింగిల్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొన్న పడిక్కల్.. 12వ ఓవర్‌లో స్టొయినిస్ బౌలింగ్‌లో 6,4తో బ్యాట్ ఝుళిపించడంతో జట్టు స్కోరు సెంచరీ దాటింది. అయితే, ఎదురుదాడి చేసే ప్రయత్నం చేస్తున్న పడిక్కల్‌ను హర్‌ప్రీత్ క్యాచవుట్ చేశాడు. అనంతరం విరాట్, కెప్టెన్ రజత్ పటీదార్ (12) మూడో వికెట్‌కు 34 రన్స్ చేర్చడంతో.. ఆర్‌సీబీ గెలుపునకు మరింత చేరువైంది. పటీదార్‌ను చాహల్ పెవిలియన్ చేర్చినా.. కోహ్లీ, జితేశ్ (11 నాటౌట్) 7 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించారు.

బ్యాటర్ల తడబాటు: మందకొడి పిచ్‌పై క్రునాల్, సుయాష్ తిప్పేయడంతో.. బలమైన బ్యాటింగ్ లైనప్ కలిగిన పంజాబ్ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్‌కు ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య (22), ప్రభ్‌సిమ్రన్ 4.2 ఓవర్లలో 42 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యంతో దూకుడైన ఆరంభాన్నిచ్చారు. యశ్ వేసిన రెండో ఓవర్‌లో ఆర్య 6,4 బాదగా.. ఆ తర్వాతి ఓవర్‌లో భువీ బౌలింగ్‌లో ప్రభ్‌సిమ్రన్ 3 ఫోర్లు కొట్టాడు. అయితే, ఐదో ఓవర్‌లో వ్యూహాత్మకంగా క్రునాల్‌కు బంతిని ఇవ్వడం బెంగళూరుకు లాభించింది. భారీ షాట్లు ఆడే జోరు మీదున్న ప్రియాన్ష్‌ను క్రునాల్ బోల్తా కొట్టించాడు. కానీ, కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (6)తో కలసి ప్రభ్‌సిమ్రన్ స్కోరు బోర్డును నడిపించాడు. హాజెల్‌వుడ్ బౌలింగ్‌లో ప్రభ్‌సిమ్రన్ సిక్స్ బాదగా.. అయ్యర్ బౌండ్రీ కొట్టాడు. దీంతో పవర్‌ప్లేను పంజాబ్ 62/1తో మెరుగ్గానే ముగించింది. కానీ, తర్వాతి ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్‌ను కూడా క్రునాల్ పెవిలియన్ చేర్చాడు. దీంతో.. పంజాబ్ 68/3తో ఒక్కసారిగా తడబడింది. ఇంగ్లిస్‌తో సమన్వయ లోపం కారణంగా నేహల్ వధేరా (5) రనౌటయ్యాడు. ఆ దశలో ఇంగ్లిస్, శశాంక్ ఐదో వికెట్‌కు 36 రన్స్ భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. కానీ, 14వ ఓవర్‌లో ఇంగ్లిస్, స్టొయినిస్ (1)ను సుయాష్ బౌల్డ్ చేశాడు. ఇక, డెత్ ఓవర్లలో భువీ, హాజెల్‌వుడ్ కట్టుదిట్టంగా బంతులేయడంతో.. శశాంక్, జెన్సన్ భారీ షాట్లు ఆడలేకపోయారు. వీరిద్దరూ స్ట్రయిక్ రొటేట్ చేస్తూ ఏడో వికెట్‌కు అజేయంగా 43 రన్స్ జోడించడంతో.. స్కోరు కష్టంగా 150 దాటింది. ఆఖరి బంతికి జెన్సన్ సిక్స్‌తో ఇన్నింగ్స్‌ను ముగించగా.. చివరి 5 ఓవర్లలో పంజాబ్ 38 పరుగులు చేసింది.



దేవ్‌దత్ పడిక్కల్ (61)

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ ఆర్య (సి) డేవిడ్ (బి) క్రునాల్ 22, ప్రభ్‌సిమ్రన్ (సి) డేవిడ్ (బి) క్రునాల్ 33, శ్రేయాస్ (సి) క్రునాల్ (బి) షెపర్డ్ 6, ఇంగ్లిస్ (సి) సుయాష్ 29, నేహల్ (రనౌట్) 5, శశాంక్ (నాటౌట్) 31, స్టొయినిస్ (బి) సుయాష్ 1, జెన్సన్ (నాటౌట్) 25; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 157/6; వికెట్ల పతనం:** 1-42, 2-62, 3-68, 4-76, 5-112, 6-114; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-26-0, యశ్ దయాళ్ 2-0-22-0, హాజెల్‌వుడ్ 4-0-39-0, క్రునాల్ 4-0-25-2, షెపర్డ్ 2-0-18-1, సుయాష్ 4-0-26-2.

బెంగళూరు: సాల్ట్ (సి) ఇంగ్లిస్ (బి) అర్ష్‌దీప్ 1, కోహ్లీ (నాటౌట్) 73, పడిక్కల్ (సి) వధేరా (బి) హర్‌ప్రీత్ 61, రజత్ (సి) జెన్సన్ (బి) చాహల్ 12, జితేశ్ (నాటౌట్) 11; **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 18.5 ఓవర్లలో 159/3; వికెట్ల పతనం:** 1-6, 2-109, 3-143; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3-0-26-1, బ్రాట్‌లెట్ 3-0-28-0, హర్‌ప్రీత్ 4-0-27-1, జెన్సన్ 3-0-20-0, చాహల్ 4-0-36-1, స్టొయినిస్ 1-0-13-0, నేహల్ వధేరా 0.5-0-9-0.

అర్జున్‌కు రజతం



లిమా (పెరూ): ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో భారత షూటర్ అర్జున్ బబూటకు రజతం దక్కింది. ఆదివారం జరిగిన పురుషుల 10మీ. ఎయిర్ రైఫిల్ విభాగంలో అతను 252.3 పాయింట్లు సాధించగా.. కేవలం 0.1 పాయింట్ తేడాతో ఒలింపిక్ చాంపియన్ షెంగ్ లిహావో (చైనా 252.4)కు స్వర్ణాన్ని కోల్పోవడం గమనార్హం. మరో భారత షూటర్ రుద్రాంక్ష్ పాటిల్ నిబంధనల్ని అతిక్రమించి అనర్హతకు గురయ్యాడు. ఓవరాల్‌గా పతకాల పట్టికలో భారత్ రెండు స్వర్ణాలు, రెండు రజతాలు, ఓ కాంస్యంతో మూడో స్థానంలో ఉంది.

ఆసియా క్వాలిఫయర్స్ టైటిళ్లు కైవసం
'ప్రపంచ స్క్వాష్'కు అనహత్, వీర్



న్యూఢిల్లీ: భారత యువ స్టార్లు అనహత్ సింగ్, వీర్ చోత్రాని ఈ ఏడాది ప్రపంచ స్క్వాష్ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించారు. మలేసియాలోని కౌలాలంపూర్‌లో ఆదివారం జరిగిన ఆసియా క్వాలిఫయర్స్‌లో విజేతలుగా నిలిచి ప్రపంచ టోర్నీకి బెర్త్ దక్కించుకున్నారు. మహిళల ఫైనల్లో 17 ఏళ్ల అనహత్ 11-4, 9-11, 11-2, 11-8తో టోబీ సే (హాంకాంగ్)ను ఓడించింది. పురుషుల టైటిల్ పోరులో 23 ఏళ్ల వీర్ 11-3, 11-4, 11-8తో అమీషెన్‌రాజ్ (మలేసియా)పై గెలిచాడు. ప్రపంచ చాంపియన్‌షిప్ వచ్చేనెల 9 నుంచి 17 వరకు చికాగోలో జరగనుంది.

అమోఘం.. అతని అరంగేట్రం!



న్యూఢిల్లీ: 14 ఏళ్లకే ఐపీఎల్ అరంగేట్రం.. ఎవరూ కలలో కూడా ఊహించని నిజం. బిహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీ ఈస్థాయికి ఎదుగుతాడని అతడి తండ్రి సంజీవ్ తప్ప ఎవరూ ఊహించలేదు. గొప్ప కోచింగ్ అకాడమీల్లో ప్రాక్టీస్ చేయలేక పోయినా.. ఖరీదైన కిట్‌లు, బ్యాట్లు లేకపోయినా ఆటపై ఉన్న ప్రేమతోనే అతడు అందరి దృష్టినీ ఆకర్షించాడు. తొలి గురువైన తండ్రి శిక్షణలోనే రాటుదేలాడు. 12 ఏళ్లకే రంజీల్లోకి అడుగుపెట్టి ప్రకంపనలు సృష్టించిన వైభవ్.. 13 ఏళ్లకే టీ20లు ఆడాడు. గతేడాది ఐపీఎల్ వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు అతడిని రూ. కోటికి కొనుగోలు చేసినప్పుడే వైభవ్ సత్తా ఏంటో తెలిసింది. ఇక, శనివారం లఖ్‌నవూ సూపర్‌జెయింట్స్‌తో మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన వైభవ్.. ఎదుర్కొన్న తొలిబంతినే సిక్స్‌గా మలచడం మేటి క్రికెటర్లను కూడా అబ్బురపరచింది. ఆ మ్యాచ్‌లో 20 బంతులు ఆడిన వైభవ్.. 34 పరుగులు చేశాడు. అతడి టెక్నిక్ మరింత పదును తేలాల్సి ఉన్నా.. తనకంటే ఎక్కువ వయసు, అనుభవం ఉన్న బౌలర్లను బెరుకులేకుండా ఎదుర్కొన్న తీరు అందరితో ఔరా అనిపించింది. ఇక, వైభవ్ బ్యాట్ స్వింగ్ చేస్తున్న తీరు యువరాజ్‌ను గుర్తు చేస్తోందని ఇంగ్లండ్ క్రికెటర్ సామ్ బిల్లింగ్స్ ప్రశంసించాడు.



ఎనిమిదో తరగతి విద్యార్థి ఆటను చూసేందుకు ఉదయాన్నే నిద్రలేచా. ఐపీఎల్‌లో అద్భుత అరంగేట్రం.
గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్

30 సెకన్ల మాయాబజార్

రీల్స్, షార్ట్స్‌తో సోషల్ మీడియా ద్వారా వ్యాపారం

- ఆన్‌లైన్ వ్యాపారుల్లో గృహిణులే అధికం
- చేసుకున్న వారికి చేసుకున్నంత బిజినెస్
- ఒక్క వీడియో హిట్ అయినా కాసుల పంటే
- కాస్త తేడా జరిగినా.. సర్వం పాయే!



ఒకప్పుడు ఊళ్లలో ఏదైనా హోల్‌సేల్ వ్యాపారం చేసే దుకాణదారులను గొప్పగా చూసేవారు. చిన్న చిన్న దుకాణాలు నడిపే రిటైల్ వ్యాపారులకు వారి పరిధిలో కొంత గుర్తింపు ఉండేది. కానీ ఆన్‌లైన్ విప్లవంతో వ్యాపారం చేసే పద్ధతి మారిపోయింది. పొద్దున్నే దుకాణం తలుపులు తీసి కొనుగోలుదారుల కోసం ఎదురుచూసే రోజులు పోయి.. 30 సెకండ్ల నిడివి ఉన్న వీడియోల(రీల్ లేదా షార్ట్)తో సోషల్ మీడియా వేదికగా కొనుగోలుదారులను ఆకర్షించే పద్ధతి మొదలైంది. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో పెట్టడం.. తాము అమ్మే అగ్గిపెట్టో, మరచెంబో.. వస్తువేదైనా కానీ.. అదో అద్భుతమని ఎలివేషన్ ఇచ్చి అమ్ముకోవడం ట్రెండ్‌గా మారింది. సోషల్ మీడియాకు అవధులు లేకపోవడంతో.. వ్యాపార అవకాశాలు కూడా విస్తృతం అయ్యాయి. అంటే, ఎక్కడో శ్రీకాకుళంలో ఓ వ్యాపారి ఆన్‌లైన్‌లో పెట్టిన వీడియోను చూసి అక్కడెక్కడో అమెరికాలో ఉన్న వారు కూడా కొనేస్తున్నారు. ఆన్‌లైన్‌లో నగదు అందుకోగానే వ్యాపారి.. వినియోగదారుడికి వస్తువును కొరియర్ చేస్తున్నాడు. ఇలా, ఇంట్లో కూర్చొని.. ఉన్న ఊరు, పొరుగురు, పక్కరాష్ట్రాలతోపాటు విదేశాల్లో వ్యాపారం చేసే వాళ్లు ఇటీవల ఎక్కువైపోయారు. పెద్దపెద్ద హోల్‌సేల్ వ్యాపారులతోపాటు చిన్నచిన్న వ్యాపారులు, పెద్దసంఖ్యలో గృహిణులు ఈ ఆన్‌లైన్ బజార్‌లోకి వచ్చి వ్యాపారవేత్తలు అయిపోతున్నారు.

30 సెకండ్ల మ్యాజిక్..!!

సోషల్ మీడియాను నమ్ముకుని వ్యాపారం చేసే వాళ్లు విక్రయించని వస్తువు లేదు. చీరలు, దుస్తులు, సౌందర్య ఉత్పత్తులు, గృహోపకరణాలు, సీజనల్ పండ్లు, సేంద్రియ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు అమ్మే వాళ్లు అధికంగా ఉంటున్నారు. 30 నుంచి 45 సెకండ్ల నిడివి ఉన్న ఇన్‌స్టా, షార్ట్స్ వీడియోలతో తమ వద్ద ఉన్న సరుకులకు ప్రచారం చేస్తున్నారు. వీడియోల రూపకల్పనలో చాలా మంది తమ ప్రత్యేకతను చాటుకుని వినియోగదారులను ఆకట్టుకుంటున్నారు. ఈ దుకాణం మాది కాదు మనది అంటూ ఓ చీరల వ్యాపారి వీడియోలు చేసి మహిళలను ఆకర్షిస్తూ తన వ్యాపారాన్ని విస్తరించుకుపోతున్నారు. ఆ వ్యాపారిని అనుసరిస్తూ మరికొందరు వీడియోలు చేస్తూ వ్యాపారాన్ని పెంచుకునేందుకు పోటీ పడుతున్నారు. చీరలు అమ్మే మరో మహిళ అయితే.. గెట్ రెడీ అంటూ ఏదో అద్భుతాన్ని చూపిస్తున్నట్టు చీరలు చూపెట్టడం, ఆర్డర్లు అందించడం నా వల్ల కావడం లేదు బాబోయ్ అని మొత్తుకుంటూ వీడియోలు చేస్తూ ఆకర్షిస్తున్నారు. నేరుగా తమ వద్దకు వచ్చి కొనుగోళ్లు చేసిన వినియోగదారులతో మాట్లాడించి రివ్యూలు తీసుకుని ఆ వీడియోలతోనూ వ్యాపారాన్ని ప్రమోట్ చేసుకుంటున్నారు. ఇలా వీడియోలు చేయలేని వారు ఇన్‌స్టా, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లో వేల సంఖ్యలో ఫాలోయర్లు ఉన్న ఇన్‌ఫ్లుయెన్సర్లతో వీడియోలు చేయించుకుని తమ వ్యాపారాలను ప్రమోట్ చేయించుకుంటున్నారు.

ఒక్కటి హిట్ అయితే చాలు..

సోషల్ మీడియా వేదికగా వ్యాపారం చేసే వాళ్లు చేసిన వీడియోల్లో ఒక్కటి హిట్ అయితే చాలు.. ఆ వ్యాపారం మూడు లైక్‌లు, ఆరు రీపోస్టులతో కళకళలాడుతుంది. వీడియోలు ట్రెండింగ్‌లో ఉన్నంత కాలం ఆర్డర్లు, సరుకు కోసం విచారణకు లెక్కకు మించి కాల్స్, మెసేజ్‌లు వస్తుంటాయి. వీటిని మేనేజ్ చేసేందుకు కొందరు ప్రత్యేకంగా సిబ్బందిని కూడా నియమించుకుంటున్నారు. ఇక, వ్యాపారుల బ్యాంకు ఖాతాలో నగదు జమలు ఒక్కసారిగా పెరిగిపోతాయి. ఇలా వ్యాపారం చేసే వాళ్లు ప్రీపెయిడ్ లావాదేవీలే అధికంగా చేస్తుంటారు. వినియోగదారుడు తమకు డబ్బు పంపితే దానిని నిర్ధారించుకున్న తర్వాతే సరుకును పంపిస్తారు.

సోషలైజింగ్ ముదిరి..

రీల్స్, షార్ట్స్ రూపంలో 30 సెకండ్ల నుంచి 60 సెకండ్ల లోపు నిడివి ఉన్న వీడియోలు చేయడం, ఫాలోయర్లను పెంచుకోవడం ఆ ఆన్‌లైన్ వ్యాపారంలో కీలకం. అయితే, వేల సంఖ్యలో ఫాలోయర్లు ఉన్నవారు తమని తాము ఎక్కువగా ఊహించుకోవడం లేనిపోని సమస్యలకు దారితీస్తోంది. సోషల్ మీడియాలో ఉన్న వ్యాపార విస్తృతిని అర్థం చేసుకోలేకపోవడం సమస్యకు కారణం అవుతోంది. తమ సోషల్ మీడియా ఖాతాకు ఉన్న ఆదరణను చూసుకుని.. తాము ఏమన్నా చెల్లుతుంది అనే ధోరణితో కొందరు హద్దులు దాటుతున్నారు. వినియోగదారుల నుంచి వచ్చే రివ్యూలకు, సందేహాలకు దురుసుగా బదులివ్వడం వంటివి చేస్తున్నారు. అలాంటి దురుసు వ్యాఖ్యలు బయటపడితే మొదటికే మోసం జరిగి ఆసాంతం నష్టపోతున్నారు. ఇందుకు అలేఖ్య చిట్టి పికిల్స్ ఉదంతం ఓ ఉదాహరణ. ఇక, ఎక్కువ మంది ఫాలోయర్లు ఉన్న కొందరు వ్యాపారులైతే సమకాలీన అంశాలపై మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో సరికొత్త చర్చలకు తెరలేపుతున్నారు. ఈ క్రమంలో వివాదాల్లో ఇరుక్కుని నష్టపోతున్నారు. ఏదేమైనా సోషల్ మీడియా వేదికలను నమ్ముకుని వ్యాపారాలు చేసే వాళ్లు స్వీయ నియంత్రణ పాటించడం వారికే మంచిది.

-సెంట్రల్ డెస్క్

మాయాబజార్‌తో జాగ్రత్త సుమా..!!

ఇంతకంటే మంచి ఆఫర్ ఉండదు.. ఇంతకంటే నాణ్యమైన వస్తువు దొరకదు.. మేము తయారు చేసిన తైలం వాడితే రోజుల వ్యవధిలో మీ జుట్టు ఒత్తుగా పెరిగిపోతుంది.. మేము అమ్మే ఆహారం తింటే నెల తిరిగే సరికి సంపూర్ణ ఆరోగ్యవంతులైపోతారు.. ఫలానా ఆకుపసరు కంటిలో వేసుకుంటే మీ కంటి చూపు సమస్య నయమైపోతుంది.. మేము అమ్మే వస్తువులు మరెక్కడా దొరకవు.. ఇలా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు రీల్స్, షార్ట్స్‌లో చెప్పే మాటలను గుడ్డిగా నమ్మడం, వారు సూచించిన ఉత్పత్తులను కొనుగోలు చేయడం ఏమాత్రం సరికాదు. సైబర్ నేరాలు రోజురోజుకి అధికమవుతున్న వేళ ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌ల్లోని వీడియోలను చూసి వస్తు కొనుగోళ్లు చేసేవారు కూడా జాగ్రత్తగా ఉండాల్సిందే. బహిరంగ మార్కెట్‌లో చాలా ఖరీదు ఉండే వస్తువులను చూపెట్టి చాలా తక్కువ ధరకు ఇస్తామని.. చెప్పేవారి మాటలు నమ్మడం అమాయకత్వమే అవుతుంది. గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన మాటలు నమ్మి డబ్బు చెల్లించడం, తర్వాత ఆ వస్తువు రాక మోసపోవడం వంటి ఘటనలు ఇటీవల అధికం అవుతున్నాయి. ఎవరో వ్యాపారి పోస్టు చేసిన వీడియోను.. మరెవరో నకిలీ ఖాతా సృష్టించి పోస్టు చేసి దాని ద్వారా అందినకాడికి డబ్బులు దండుకుంటున్న ఘటనలు కూడా వెలుగు చూస్తున్నాయి. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వస్తు కొనుగోళ్లు చేసేటప్పుడు ఉత్పత్తుల నాణ్యత తదితర వివరాలను ముందే సమగ్రంగా తెలుసుకోవాలి. నమ్మకం కుదిరిన తర్వాతే డబ్బు పంపాలి. నకిలీల విషయంలో కొనుగోలుదారులు అప్రమత్తంగా వ్యవహరించాలి.

ట్రంప్‌పై న్యాయపోరాటం!

కోర్టు మెట్లెక్కిన భారత్, చైనా విద్యార్థులు .. తమ స్టూడెంట్ వీసా రద్దును సవాలు చేస్తూ కేసు దాఖలు

- అధ్యక్షుడి తీరుకు నిరసనగా మరోసారి రోడ్లపైకి అమెరికన్లు



ట్రంప్‌కు వ్యతిరేకంగా న్యూయార్క్‌లో ర్యాలీ

వాషింగ్టన్, ఏప్రిల్ 20: అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలపై అమెరికాలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. వలసదారుల బహిష్కరణ అంశంతో పాటు విశ్వవిద్యాలయాలపై ఆయన వైఖరి పట్ల ప్రజలు మండిపడుతున్నారు. ఈ వ్యవహారం ఇప్పుడు నిరసనల స్థాయిని దాటి కోర్టుల్లో కేసులు వేసే స్థాయికి చేరుకుంది. ఎఫ్-1 విద్యార్థి వీసాల రద్దుకు నిరసనగా అమెరికాలో భారత్, చైనా విద్యార్థులు చేతులు కలిపారు. ట్రంప్ యంత్రాంగం తీసుకున్న నిర్ణయాన్ని ముగ్గురు భారతీయ విద్యార్థులు, ఇద్దరు చైనా విద్యార్థులు కోర్టులో సవాలు చేశారు. డీహెచ్ఎస్, ఇమిగ్రేషన్ అధికారులపై న్యూహాంప్‌షైర్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ ఎఫ్-1 హోదాను అధికారులు ఏకపక్షంగా రద్దు చేశారని, దీనివల్ల తమ భవిష్యత్తు అనిశ్చితిలో పడిపోయిందని, వీసాలు రద్దు చేసేముందు ప్రభుత్వం తమకు ఎలాంటి నోటీసు ఇవ్వలేదని ఆరోపించారు. విద్యార్థి వీసాను చట్టవిరుద్ధంగా రద్దు చేయడం వల్ల నిర్బంధం, బహిష్కరణ ముప్పుతో పాటు ఓపీటీకి అనర్హులు కావడంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. తమతో పాటు విదేశీ విద్యార్థుల వీసాలన్నీ పునరుద్ధరించాలని, నిర్బంధాలు, బహిష్కరణలను తక్షణం నిలిపివేయాలని కోరారు. ఈ వ్యవహారంలో కోర్టు జోక్యం చేసుకొని ప్రభుత్వానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు అభ్యర్థించారు. కాగా, ట్రంప్ యంత్రాంగంపై కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన ముగ్గురు భారతీయ విద్యార్థులు రివియర్ యూనివర్సిటీ (న్యూహాంప్‌షైర్)లో చదువుతున్నారు. వీరిలో లింఖిత్ బాబు గొర్రెల గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకొని మే 20 నుంచి మాస్టర్స్ డిగ్రీలో చేరాల్సి ఉంది. ఇక మణికంఠ పసుల, తనూజ్ కుమార్ గుమ్మడవెల్లిల మాస్టర్స్ డిగ్రీ పూర్తికావడానికి మరో సెమిస్టర్ మాత్రమే మిగిలి ఉంది.

ఇదిలా ఉండగా, ట్రంప్ విధానాలను నిరసిస్తూ అమెరికా వ్యాప్తంగా ప్రజలు 15 రోజుల వ్యవధిలోనే మరోసారి రోడ్డెక్కారు. శనివారం వేలాది మంది నిరసనకారులు పలు నగరాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. ప్రతీకార సుంకాలు, వలసదారుల బహిష్కరణ, ఇమిగ్రేషన్, ఆర్థిక విధానాలు, ఫెడరల్ ఉద్యోగాల్లో కోతలు తదితర అంశాలపై ఆందోళనకారులు తీవ్రంగా మండిపడ్డారు. అధ్యక్ష భవనం వైట్‌హౌస్ వద్దకు ర్యాలీగా చేరుకున్న నిరసనకారులు ట్రంప్ ప్రభుత్వంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, 'సిగ్గుచేటు' అంటూ నినాదాలు చేశారు.

అమెరికా వినియోగదారులకు డీహెచ్ఎల్ షాక్!

బెర్లిన్, ఏప్రిల్ 20: జర్మనీకి చెందిన కొరియర్ సేవల దిగ్గజం డీహెచ్ఎల్ ఎక్స్‌ప్రెస్.. అమెరికా వినియోగదారులకు షాక్ ఇచ్చింది. అమెరికా కస్టమ్స్ నిబంధనల్లో ఇటీవల తెచ్చిన మార్పుల నేపథ్యంలో ఆ దేశంలోని వినియోగదారులకు 800 డాలర్లకన్నా ఎక్కువ విలువైన సరుకు రవాణాను సోమవారం నుంచి తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. కొత్త నిబంధనలతో షిప్‌మెంట్ల క్లియరెన్స్‌కు ఎక్కువ సమయం పడుతుందని పేర్కొంది. ఈ నిబంధనల మేరకు 800 డాలర్లకన్నా ఎక్కువ విలువైన అన్ని షిప్‌మెంట్లకు అధికారిక ప్రవేశ ప్రక్రియ అవసరం ఉంటుంది. తాజా విధానంలో మార్పులతో కస్టమ్స్ పేపర్ వర్క్‌తోపాటు కఠిన తనిఖీలు ఉంటాయి.

ఈస్టర్ వేళ జడ్జిలపై ట్రంప్ తీవ్ర విమర్శలు

వాషింగ్టన్, ఏప్రిల్ 20: ఈస్టర్ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ట్రూత్ వేదికగా తన ప్రత్యర్థులపై విరుచుకుపడ్డారు. "హంతకులను, డ్రగ్స్ వ్యాపారులను, నేరస్థులను, ఎంఎస్-13 గ్యాంగ్ సభ్యులను అమెరికాలోకి తీసుకొచ్చేందుకు తీవ్రంగా యత్నిస్తున్న రాడికల్ వామపక్షవాదులకు ఈస్టర్ శుభాకాంక్షలు" అని పోస్టు చేశారు. నేరస్థులను దేశంలోకి అనుమతిస్తున్న బలహీన న్యాయమూర్తులు, దర్యాప్తు అధికారులకు కూడా ఈస్టర్ శుభాకాంక్షలంటూ పోస్టులో ప్రస్తావించారు. బైడెన్ అసమర్థుడని, లక్షలాది మంది క్రిమినల్స్‌ను దేశంలోకి అనుమతించారని మండిపడ్డారు.

అమెరికాకు తగ్గిన విమాన చార్జీలు

- ఈ వేసవిలో ఢిల్లీ-అమెరికా టికెట్ ధరలు 15% పడిపోయిన వైనం.. ట్రంప్ విధానాలే కారణం

ముంబై, ఏప్రిల్ 20: ఈ వేసవిలో ఆశ్చర్యకరంగా అమెరికాకు విమాన చార్జీలు పడిపోయాయి. అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత అనుసరిస్తున్న విధానాల కారణంగానే ఈ ట్రెండ్ చోటుచేసుకుందని అంటున్నారు. ఢిల్లీ-అమెరికా విమానాల చార్జీలు 10 నుంచి 15 శాతం వరకు తగ్గాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మధ్య కాలానికి సంబంధించి ఢిల్లీ, ముంబై నుంచి అమెరికాలోని కీలక నగరాలకు విమాన చార్జీల్లో సగటున 5-8 శాతం తగ్గుదల కనిపిస్తోందని ట్రావెల్ సంస్థ 'థామస్ కుక్ (భారత్) అండ్ ఎస్‌వోటీసీ ట్రావెల్ ప్రెసిడెంట్, గ్రూపు హెడ్ ఇండైవర్ రస్తోగి పేర్కొన్నారు. శనివారం ఉన్న ధరల ప్రకారం.. మే నెల మధ్యలో ముంబై నుంచి న్యూయార్క్‌కు వన్‌వే ప్రయాణానికి టికెట్ ధర కనిష్ఠంగా రూ.37 వేలు చూపించడం గమనార్హం. అదేవిధంగా చౌకైన తిరుగు ప్రయాణ చార్జీ రూ.76 వేలుగా ఉంది. అమెరికాలో రెండవ అతిపెద్ద వలస సమాజంగా భారతీయులు ఉన్నారు. అక్కడ ఉన్న వాళ్లు భారత్‌లోని తల్లిదండ్రులను చూడటానికి లేదా ఇక్కడ ఉన్న తల్లిదండ్రులు అమెరికాలోని తమ పిల్లలను చూసేందుకు, విద్యాసంస్థలకు వేసవి సెలవుల సీజన్‌లో ప్రయాణాలు చేస్తుంటారు. అదేవిధంగా ఉన్నత విద్య కోసం భారతీయులు భారీగా అమెరికాకు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో అమెరికాకు వెళ్లే విమాన సర్వీసులకు ఏడాది అంతా విపరీతమైన డిమాండ్ ఉంటుంది. దీంతో గత కొన్నేళ్లుగా భారత్, అమెరికా మధ్య నడిచే విమానాల్లో చార్జీలు కూడా ఎక్కువగా ఉండేవి. అయితే ట్రంప్ విధానాలతో ఈ వేసవిలో సీన్ మారిపోయింది.

బిజినెస్

24,250 పైన బుల్లిష్

(ఏప్రిల్ 21-25 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 23,207-23,872 పాయింట్ల మధ్యన కదలాడి 1,023 పాయింట్ల లాభతో 23,852 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,250 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,437, 22,867, 23,122, 22,936 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 24,250 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23,450

నిరోధ స్థాయిలు: 24,050, 24,150, 24,250 (23,950 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 23,650, 23,550, 23,450

నిఫ్టీ స్ట్రాటజీ

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	122
వరంగల్	120	గుంటూరు	122
కరీంనగర్	120	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	77
కర్నూలు	120	నెల్లూరు	82
విశాఖపట్నం	111	అనంతపురం	82
గోదావరి	122		

మార్కెట్లోకి రూ.2 లక్షల కోట్ల విలువైన షేర్లు!



ముగియనున్న యాంకర్ ఇన్వెస్టర్ల లాకిన్ పీరియడ్

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో దేశీయ స్టాక్ మార్కెట్ ఇప్పటికే తీవ్ర ఆటుపోట్లకు లోనవుతోంది. ఇది చాలదన్నట్టు వచ్చే నెల రోజుల్లో దేశీయ మార్కెట్‌కు మరో ప్రమాదం కనిపిస్తోంది. ఇటీవల పబ్లిక్ ఇష్యూకి వచ్చిన 22 కంపెనీల ఐపీఓల్లో ఫర్మ్ అలాట్‌మెంట్లు పొందిన యాంకర్ ఇన్వెస్టర్లు వచ్చే నెల రోజుల్లో తమ వద్ద ఉన్న దాదాపు రూ.2.36 లక్షల కోట్ల విలువైన షేర్లను మార్కెట్లో కుమ్మరించే ప్రమాదం కనిపిస్తోంది.

లాకిన్ పీరియడ్ కారణంగానే

సెబీ నిబంధనల ప్రకారం ఐపీఓల్లో ఫర్మ్ అలాట్‌మెంట్ పద్ధతిలో షేర్లు పొందిన యాంకర్ ఇన్వెస్టర్లు కనీసం మూడు నెలల వరకు ఆయా కంపెనీల షేర్లను అమ్మకూడదు. ఆ తర్వాత ఇష్టమైతే అమ్మి సొమ్ము చేసుకోవచ్చు. అయితే మంచి కంపెనీల ఐపీఓల్లో కొంతమంది యాంకర్ ఇన్వెస్టర్లు తమ వద్ద ఉన్న షేర్లలో కొద్ది మొత్తాన్ని అయినా అమ్మి సొమ్ము చేసుకోవాలనుకుంటారు. ఈ కారణంగానే వచ్చే నెల రోజుల్లో అనేక మంది యాంకర్ ఇన్వెస్టర్లు తమ వద్ద ఉన్న ఐపీఓ షేర్లలో పెద్ద మొత్తాన్ని సెకండరీ మార్కెట్లో కుమ్మరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

జాబితాలోని కంపెనీల షేర్లు

యాంకర్ ఇన్వెస్టర్ల లాక్ పీరియడ్ ముగిసే షేర్లలో హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) కూడా ఉంది. ఈ కంపెనీ గత ఏడాది అక్టోబరులో రూ.27,870 కోట్ల అతిపెద్ద భారీ ఐపీఓ జారీ చేసి రికార్డు సృష్టించింది. ఈ కంపెనీ యాంకర్ ఇన్వెస్టర్లకు జారీ చేసిన షేర్లలో 50.78 కోట్ల షేర్లకు వచ్చే నెల లాకిన్ పీరియడ్ ముగియబోతోంది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం వీటి విలువ ఎంత లేదన్నా రూ.81,821.65 కోట్ల వరకు ఉంటుంది.

హ్యుండయ్ మోటార్‌తో పాటు డాక్టర్ అగర్వాల్ హెల్త్‌కేర్, స్విగ్గీ, వారీ ఇంజనీర్స్, డెంటా వాటర్ అండ్ ఇన్‌ఫ్రా, అజాక్స్ ఇంజనీరింగ్, డిఫ్యూజన్ ఇంజనీర్స్, నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్, గోదావరి బయోరిఫైనరీస్ వంటి కంపెనీల షేర్లు కూడా ఉన్నాయి. దీంతో ఈ కంపెనీల షేర్లు సెకండరీ మార్కెట్లో తీవ్ర ఆటుపోట్లకు లోనయ్యే ప్రమాదం కనిపిస్తోంది.

చమురు దిగుమతులు జూమ్..

2024-25లో రూ.13.76 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: మన దేశ చమురు దిగుమతులు ఏటికేటికి పెరిగి పోతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2024-25) భారత్.. విదేశాల నుంచి 24.24 కోట్ల టన్నుల ముడి చమురు దిగుమతి చేసుకుంది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2023-24)తో పోలిస్తే ఇది 4.2 శాతం ఎక్కువ. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మన మొత్తం చమురు అవసరాల్లో 89.1 శాతం దిగుమతుల ద్వారానే భర్తీ అయింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది అర శాతం ఎక్కువ. ఇదే సమయంలో దేశీయ చమురు ఉత్పత్తి మాత్రం 2.94 కోట్ల టన్నుల నుంచి 2.87 కోట్ల టన్నులకు పడిపోయింది.

పెరిగిన భారం: 2024-25 ఆర్థిక సంవత్సరంలో చమురు, పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి బిల్లు 15,630 కోట్ల డాలర్ల నుంచి 16,100 కోట్ల డాలర్లకు (సుమారు రూ.13.76 లక్షల కోట్లు) చేరింది. ఇదే సమయంలో గ్యాస్ దిగుమతులూ 15.4 శాతం పెరిగి 3,669.9 కోట్ల ప్రామాణిక ఘనపు మీటర్ల (ఎంఎంఎస్‌సీఎం)కు చేరాయి. కాగా దేశీయ గ్యాస్ ఉత్పత్తి 3,611.3 ఎంఎంఎస్‌సీఎంకు పడిపోయింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 0.9 శాతం తక్కువ.

ఇంధన స్టోరేజీలోకి రూ.4.79 లక్షల కోట్ల పెట్టుబడులు: మన దేశ ఇంధన స్టోరేజీ రంగం 2032 నాటికి భారీగా పెట్టుబడులను ఆకర్షించనుంది. ఇది ఎంత లేదన్నా రూ.4.79 లక్షల కోట్ల వరకు ఉంటుందని ఇండియా ఎనర్జీ స్టోరేజీ అలయెన్స్ (ఐఈఎస్ఏ) అంచనా. 2026-32 మధ్య కాలంలో ఈ రంగం ఐదింతలు పెరగనుంది. టెక్నాలజీ నవకల్పనలతో గత రెండున్నర సంవత్సరాల్లో నెలకు ఒక మెగావాట్ ఇంధన స్టోరేజీ ఖర్చులు రూ.10 లక్షల నుంచి రూ.2.5 లక్షలకు తగ్గినట్టు ఐఈఎస్ఏ తెలిపింది.

మార్కెట్లోకి నియో ఆహార్ ఉత్పత్తులు

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న టియోనాట్ నియోకేర్ మార్కెట్లోకి నియో ఆహార్ పేరుతో మార్కెట్లోకి సరికొత్త పోషకాహార ఉత్పత్తులను తీసుకువచ్చింది. ఈ ఉత్పత్తులను సినీ నటుడు తనికెళ్ల భరణి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుచికి పోషక విలువలను జత చేయటంతో పాటు ఈ తరానికి తగ్గట్టుగా ఐదు నిమిషాల్లోనే ఆహారాన్ని సిద్ధం చేయటం నియో ఆహార్ ఉత్పత్తుల ప్రత్యేకత అని అన్నారు. సాంప్రదాయ రుచులతో పాటు ఆరోగ్యకరమైన పోషక విలువలను నియో ఆహార్ ఉత్పత్తులు కలిగి ఉంటాయని టియోనాట్ నియోకేర్ ఎండీ సత్య ప్రసాద్ తెలిపారు. ఫోర్టిఫైడ్ దాల్ మిక్స్, ఫోర్టిఫైడ్ వడ మిక్స్, ఫోర్టిఫైడ్ చోలే విక్స్ వంటి పలు రకాలైన ఉత్పత్తులు నియో ఆహార్ ద్వారా అందుబాటులో ఉంటాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకుడు వీఎన్ ఆదిత్య, మాజీ ఆర్‌టీఐ కమిషనర్ పి విజయ్ బాబు, మోడ్రన్ ఫుడ్ ఇండస్ట్రీస్ మాజీ సీఎండీ ఎంఎం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	420
వరంగల్	407	గోదావరి	395
చిత్తూరు	440	విశాఖపట్నం	425
		డజను గుడ్లు రూ. 60	

ఈ వారం నిలదొక్కుకుంటేనే!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలున్నాయి. డొనాల్డ్ ట్రంప్ టారిఫ్స్‌కు విరామం ప్రకటించటంతో గత వారం దుమ్ము రేపిన మార్కెట్లు ఈ వారం పుంజుకుంటే నిలదొక్కుకున్నట్టే. ఇక ప్రపంచ మార్కెట్లతో సంబంధం లేకుండా దేశీయ మార్కెట్లు స్థిరంగా కొనసాగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఐటీ, ఇన్‌ఫ్రా, మెటల్స్, ఆటోమొబైల్ యాన్సిలరీ రంగాల షేర్లు బలహీనంగా ఉన్నా బ్యాంకింగ్, ఫైనాన్స్, ఏవియేషన్, షిప్ బిల్డింగ్, టెలికాం రంగ షేర్లు బుల్లిష్‌గా ఉన్నాయి. నిఫ్టీ 23,850 ఎగువన నిలదొక్కుకోవటం కీలకం. అంతర్జాతీయ పరిణామాలు, ట్రంప్ వ్యాఖ్యలపై అప్రమత్తంగా ఉండటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

ఎన్‌టీపీసీ గ్రీన్: గత డిసెంబరు నుంచి డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు ప్రస్తుతం ఐపీఓ స్థాయి వద్ద కదలాడుతోంది. మంచి బేస్ ఏర్పడింది. మూమెంటమ్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. గత గురువారం రూ.108 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.100/105 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.135/145 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.95 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

గుజరాత్ గ్యాస్ లిమిటెడ్: గత ఏడాది ఆగస్టు నుంచి ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లోనే పయనిస్తోంది. ఫిబ్రవరి నుంచి మంచి బేస్ ఏర్పడింది. టర్న్ అరౌండ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం 10,20 రోజుల మూవింగ్ యావరేజెస్ పైనే కదలాడుతోంది. గత గురువారం రూ.445 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.440/430 వద్ద ప్రవేశించి రూ.520/550 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.410 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ప్రీమియర్ ఎనర్జీస్: గత ఏడాది సెప్టెంబరులో మార్కెట్లో లిస్టయిన ఈ షేరు డిసెంబరులో జీవితకాల గరిష్ఠాన్ని తాకింది. ఆ తర్వాత క్రమంగా డౌన్‌ట్రెండ్‌లోకి జారుకుంది. లిస్టింగ్ అయిన రూ.880 శ్రేణిలోనే చక్కని బేస్ ఏర్పడింది. చివరి ఐదు సెషన్లలో జోరు ప్రదర్శించిన ఈ షేరు మరింత పటిష్ఠతను సూచిస్తోంది. గత గురువారం రూ.967 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.950 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,250 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.915 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్: గత ఏడాది జూలై నుంచి డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతోంది. తాజాగా జనవరి నాటి గరిష్ఠాన్ని బ్రేక్ చేసింది. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ క్రమంగా పెరుగుతోంది. గత గురువారం రూ.604 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.600 శ్రేణిలో ఎంటరై రూ.660/680 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.585 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఆదిత్య బిర్లా క్యాపిటల్: ప్రస్తుతం ఈ షేరు చక్కని మూమెంటమ్‌తో దూసుకుపోతోంది. డౌన్‌ట్రెండ్ నుంచి ఫిబ్రవరిలోనే టర్న్ అరౌండ్ అయ్యింది. పైగా చక్కని రిస్క్ రివార్డు రేషియోతో అందుబాటులో ఉంది. గత గురువారం రూ.198 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.195 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.220/230 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.190 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.


- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

24,000 స్థాయిలో పరీక్ష

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రధాన నిరోధం 23,000ని బ్రేక్ చేసుకుంటూ బలమైన ర్యాలీలో పురోగమించి చివరికి 23,850 వద్ద వారం గరిష్ఠ స్థాయిలో బలంగా క్లోజయింది. వారం మొత్తంలో 1,000 పాయింట్లకు పైగా లాభపడింది. గత ఏడు రోజుల కాలంలో సుమారు 2,000 పాయింట్ల మేరకు రికార్డు లాభం నమోదు చేసింది. ఈ వారంలో కూడా మార్కెట్ సానుకూలంగానే ప్రారంభం కావచ్చు. ఈ క్రమంలో కీలక మానసిక అవధి 24,000 వద్ద పరీక్ష ఎదుర్కొనే ఆస్కారం ఉంది. గత వారంలో మిడ్‌క్యాప్ సూచీ 2,150 పాయింట్లు, స్మాల్‌క్యాప్ సూచీ 415 పాయింట్లు లాభపడ్డాయి.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ 24,000 పాయింట్ల కీలక స్థాయిలో మూడోసారి పరీక్ష ఎదుర్కొనబోతోంది. గత కొద్ది రోజుల్లో నిట్టనిలువుగా లాభపడినందు వల్ల తదుపరి దిశ తీసుకునే ముందు తొలుత కన్సాలిడేట్ కావచ్చు. మరింత స్వల్పకాలిక సానుకూల సంకేతం కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి.

బేరిష్ స్థాయిలు: ప్రస్తుత కీలక స్థాయి 23,800 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే స్వల్పకాలిక బలహీనత కనబరుస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 23,500. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనత తప్పదు.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం రికార్డు స్థాయిలు 3,300 పాయింట్లు లాభపడి 54,300 వద్ద ముగిసింది. గత ఏడాది సెప్టెంబరు 26వ తేదీన నమోదైన జీవితకాల గరిష్ఠ స్థాయి 54,460కి సమీపంలో ఉంది. ప్రధాన నిరోధం 54,600. ఇక్కడ కన్సాలిడేషన్‌తో పాటు పుల్‌బ్యాక్ రియాక్షన్ కూడా ఏర్పడవచ్చు. ఏదైనా బలహీనత ఏర్పడినా సానుకూలత కోసం 54,000 కన్నా పైన నిలదొక్కుకుని తీరాలి.

పాటర్న్: మార్కెట్ 24,000 స్థాయిలో ఉన్న 200 డీఎంఏకి చేరువవుతోంది. ఇక్కడ కన్సాలిడేట్ కావచ్చు. మరింత సానుకూలత కోసం ఇదే స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి రివర్సల్ ఉంది.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,000, 24,080
మద్దతు	23,940, 23,850

బీజేపీ విధానాలపై కాంగ్రెస్ పోరు

» దేశవ్యాప్తంగా అధికార ప్రతినిధుల నియామకం
» తెలంగాణకు రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా
» ఏపీకి ఠాకూర్, సాల్మాన్ సోజ్.. కేరళకు కొప్పుల రాజు


రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా బీజేపీ విధానాలపై కాంగ్రెస్ ఉద్యమ కార్యాచరణను ప్రకటించింది. తొలివిడతలో మీడియా సమావేశాల ద్వారా బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలు ఎండగట్టాలని నిర్ణయించింది. ఇందుకోసం ఆదివారం రాత్రి అన్ని రాష్ట్రాలకు 57 మంది అధికార ప్రతినిధులను ప్రకటించింది. ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. విజయవాడ-వారాణసీ, కాశ్మీర్-తిరువనంతపురం వరకు స్వాతంత్ర్య పోరాట సజీవ స్మారక చిహ్నాన్ని ధ్వంసం చేయడానికి బీజేపీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని కాంగ్రెస్ స్పష్టం చేసింది. సోమవారం నుంచి గురువారం(ఈనెల 24) వరకు దేశంలోని 57 నగరాల్లో మీడియా సమావేశాలను నిర్వహించేలా.. తాజాగా ప్రకటించిన అధికార ప్రతినిధులను ఆదేశించింది. తెలంగాణకు కాంగ్రెస్ సీనియర్ నేత రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా, ఆంధ్రప్రదేశ్‌కు సీనియర్ నేతలు మాణిక్కంఠాకూర్, సాల్మాన్ సోజ్, కేరళకు కొప్పుల రాజును నియమించింది. ఏపీ, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, కేరళ, తమిళనాడు సహా పలు రాష్ట్రాలకు రెండు కంటే ఎక్కువ మంది నేతలను ఎంపిక చేసింది. వీరంతా నాలుగు రోజుల పాటు ఆయా రాష్ట్రాల్లో మీడియా సమావేశాల ద్వారా బీజేపీ తీరును ఎండగట్టనున్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై దర్యాప్తు సంస్థల కేసులపైనా నిజాలను ప్రజలకు వివరించాలని అధికార ప్రతినిధులకు సూచించింది.

ఆ అధికారిని రిటైరయ్యాక కొనసాగించండి

» సీఎం రేవంత్‌కు ఓ కీలక శాఖ మంత్రి లేఖ
» ఈ నెల 30న రిటైరవుతున్న సదరు ఎస్ఈ

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ తర్వాత ఆయా శాఖల్లో కొనసాగుతున్న, కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగే వారిని ప్రభుత్వం తొలగిస్తోంది. అయితే ఓ కీలక శాఖలో పూర్తి అదనపు బాధ్యతల్లో సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)గా పనిచేస్తున్న అధికారిని రిటైరయ్యాక కూడా కొనసాగించాలంటూ ఓ మంత్రి సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. తన శాఖకు అనుబంధంగా ఉండే ఓ విభాగానికి ఎస్ఈగా ఉన్న సదరు అధికారి ఈనెల 30న పదవీ విరమణ చేస్తున్నారని, అయితే ఆ విభాగంలో ఇంకా నిర్వహించాల్సిన పనులు చాలా ఉన్నాయని, అందులో ప్రభుత్వం "సూపర్ గేమ్ చేంజర్"గా భావిస్తున్న ప్రాజెక్టు కూడా ఉందని లేఖలో తెలిపారు. ఆయా పనులను సక్రమంగా, వేగంగా జరిపేందుకు సదరు అధికారి అవసరమని, పదవీ విరమణ తర్వాత కూడా శాఖలో ఆయన కొనసాగేలా అవకాశమివ్వాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో జాతీయ ప్రాజెక్టులు ఆశించిన సమయానికి పూర్తయ్యేందుకుగాను ఢిల్లీ అధికారులతో పరిచయమున్న ఈ అధికారి అవసరమని తెలిపారు. ఏడాదిపాటు ఎక్స్‌టెన్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తూ ఈ నెల 8న మంత్రి లేఖ రాయగా తాజాగా అది వెలుగులోకి వచ్చింది. సీఎం ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్నందున దీనిపై ఆయన ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిసింది. రిటైరైన వాళ్లను ప్రభుత్వం వద్దని పంపిస్తుంటే మంత్రి ఇలా సీఎంకు లేఖ రాయడం పట్ల శాఖలో చర్చ జరుగుతోంది.

ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలను ఆదుకుంటాం

» వారికి ఉపాధి కల్పిస్తాం: మంత్రి సీతక్క

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం ఇంద్రవెల్లి స్థూపం వద్ద నిర్వహించిన సంస్మరణ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమరవీరులకు నివాళి అర్పించి, సంప్రదాయ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడారు. 44 ఏళ్ల క్రితం జరిగిన ఘటనలో ఎందరో ఆదివాసీ బిడ్డలు అమరులవడం దురదృష్టకరమన్నారు. వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. ఇందులో భాగంగానే అమరవీరుల సంస్మరణ దినోత్సవం రోజున అమరుల కుటుంబాలకు ట్రైకార్ ఆధ్వర్యంలో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను అందించామని తెలిపారు. ఇంద్రవెల్లిలో రూ.కోటితో స్మృతివనం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఇంద్రవెల్లి పోరాటంలో 15 మంది అమరులయ్యారని ఆనాటి ప్రభుత్వాలు నిర్ధారించాయని, వాస్తవంగా ఆ సంఖ్య మరింత ఎక్కువ ఉంటుందని పేర్కొన్నారు. వారి వివరాలను ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలో గుర్తించి, ఆ కుటుంబాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

3 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాల సరఫరాకు సిద్ధం

» రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): వచ్చే వానాకాలం సీజన్‌లో తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రైతులకు 3 లక్షల క్వింటాళ్ల విత్తనాలు సరఫరా చేయనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ సుంకెట అన్వేషరెడ్డి తెలిపారు. 15 లక్షల ఎకరాలకు సరిపోయేలా ముల్కనూరు లాంటి సహకార సంఘాల నుంచి నాణ్యమైన వరి విత్తనాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048, కేఎన్ఎం-1638 రకాల విత్తనాలు కూడా రైతులకు పంపిణీ చేస్తామన్నారు. విత్తనాభివృద్ధి సంస్థ సొంత విక్రయ కేంద్రాల్లో విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు 6% రాయితీ ఇస్తామన్నారు. వరితోపాటు 1,000 క్వింటాళ్ల కంది విత్తనాలు, పెసర విత్తనాలు కూడా రైతులకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వెల్లడించారు.

నిజామాబాద్‌లో నేటి నుంచి రైతు మహోత్సవం

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల ఆవరణలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు రైతు మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి తెలిపారు. మంత్రులు తుమ్మల నాగేశ్వ రావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు వ్యవసాయ, అనుబంధరంగాల స్టాళ్ల ఏర్పాటు, పంట ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖల శాస్త్రవేత్తలు, అనుబంధశాఖల అధికారులు.. నూతన వ్యవసాయ పద్ధతులపై మూడు రోజుల వర్క్‌షాపు నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

15 రోజుల్లోగా ఖాళీ చేయండి

» తిరుమలలో శారదాపీఠానికి టీటీడీ నోటీసులు

తిరుమల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో విశాఖ శారద పీఠానికి టీటీడీ నోటీసులు జారీ చేసింది. 15 రోజుల్లోపు మఠం మొత్తాన్ని ఖాళీ చేసి తనకు అప్పగించాలని పేర్కొంది. కొండపై నిబంధనలకు విరుద్ధంగా స్థలాన్ని ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మించారని టీటీడీ గతంలో షోకాజ్ నోటీసులు జారీ చేయడం.. మఠం నిర్వాహకులు కోర్టును ఆశ్రయించడం.. స్టే రావడం తెలిసిందే. టీటీడీ ఇచ్చిన షోకాజ్ నోటీసులో ఎలాంటి తప్పూ లేదని కోర్టు తీర్పు ఇవ్వడంతో.. 15 రోజుల్లోపు మఠాన్ని ఖాళీ చేసి అప్పగించాలని శనివారం అధికారులు నోటీసులు జారీ చేశారు.

గ్వాలియర్ వ్యాపారికి 'లడ్డూ' సిట్ నోటీసులు

గ్వాలియర్, ఏప్రిల్ 20: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించారనే ఆరోపణలపై ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజాగా మధ్యప్రదేశ్‌లో గ్వాలియర్‌కు చెందిన ఓ వ్యాపారికి నోటీసులు జారీచేసింది. ఈ విషయాన్ని గ్వాలియర్ నగర ఎస్పీ రాబిన్ జైన్ ఆదివారం ఈ విషయం తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ ఏర్పాటు చేసిన ఈ సిట్ సభ్యుల్లో కొందరు ఇటీవల ఇక్కడకు వచ్చారన్నారు. గ్వాలియర్ దాల్ బజార్‌కు చెందిన ఓ వ్యాపారికి ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు కనుగొన్నారని.. నోటీసివ్వడానికి తమ సాయం కోరారని వెల్లడించారు. ఈ వ్యవహారంతో తదుపరి చర్యలను సిట్ తీసుకుంటుందన్నారు. కాగా, సిట్ బృందం ఇప్పటికే కొన్ని కంపెనీల అధికారులను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే.

కొత్త పెన్షన్లు ఇవ్వండి!

» కౌలు రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించండి
» కులగణన సర్వే, ప్రజావాణి భేష్
» గ్యారెంటీల అమలుపై ప్రజల్లో సంతృప్తి
» టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌తో భేటీలో భారత్ జోడో అభియాన్ బృందం

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): చేయూత పథకం కింద కొత్తగా అర్హులైన వారిని గుర్తించి.. ప్రభుత్వం వారికి పెన్షన్లు మంజూరు చేయాలని యోగేంద్ర యాదవ్ నేతృత్వంలో భారత్ జోడో అభియాన్ బృందం సూచన చేసింది. అలాగే కౌలు రైతుల సమస్యల పరిష్కారంపైనా దృష్టి పెట్టాలంది. గిగ్ వర్కర్ల తరహాలో అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసమూ ఒక చట్టాన్ని తీసుకురావాలని కోరింది. టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసిన యోగేంద్రయాదవ్ బృందం.. ఈమేరకు సూచనలు చేసింది. యోగేంద్ర యాదవ్‌తో పాటు ఈ సమావేశంలో బృందం సభ్యులు విస్సా కిరణ్‌కుమార్, గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ నేత సలావుద్దీన్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పనితీరుపై క్షేత్రస్థాయిలో తాము సేకరించిన వివరాలను టీపీసీసీ చీఫ్‌తో వారు పంచుకున్నారు. కొన్ని అంశాలు మినహాయిస్తే ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజల్లో సంతృప్తి నెలకొని ఉందని యోగేంద్ర యాదవ్ బృందం సభ్యులు తెలిపారు. గతంతో పోలిస్తే సమస్యలపై అధికారులను కలిసినప్పుడు వారు మెరుగ్గా స్పందిస్తున్నారన్న భావన ప్రజల్లో వ్యక్తమవుతోందన్నారు. ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. దీన్ని వికేంద్రీకరించి జిల్లా, మండల స్థాయుల్లోనూ నిర్వహించాలని సూచించారు. ఎన్నికల ముందు కౌలు రైతుల సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీలు ఇచ్చారని, వాటి పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. వారికి ఎల్ఈసీ కార్డుల మంజూరుపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజాసంఘాలు, విద్యార్థులకు నిరసనలు తెలిపే స్వేచ్ఛ కల్పించాలన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే మెరుగ్గా ఉన్నప్పటికీ.. పలు సందర్భాల్లో నిరసనకారుల పట్ల పాత పద్ధతిలోనే వ్యవహరించారని, అలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వం నిర్వహించిన ఆర్థిక, సామాజిక, రాజకీయ కులగణన సర్వేను తాము స్వాగతిస్తున్నామని చెప్పారు. సర్వే వివరాలను ప్రకటించి.. పరిష్కారం కోసం ప్రభుత్వం ఏం చేయనుందో కూడా వెల్లడించాలని సూచించారు. ఈ విషయంలో ప్రభుత్వం కోరితే తమ వంతు సహకారమూ ఉంటుందన్నారు. మహిళల సమస్యలపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. కాగా.. వృద్ధాప్య, వితంతు, వికలాంగ తదితర పెన్షన్లకు కొత్తగా అర్హులైన వారు రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ఉన్నారని, ముందుగా వారిని గుర్తించి పెన్షన్లు జారీ చేయాలని సూచించారు. యోగేంద్ర యాదవ్ బృందం సూచనలు సావధానంగా విన్న టీపీసీసీ చీఫ్.. సంబంధిత శాఖల మంత్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.

హైదరాబాద్‌లో ఎకో టౌన్

జపాన్‌లోని కిటాక్యుషు మాదిరిగా భాగ్యనగరం .. భవిష్యత్తు తరాలకు ఆహ్లాదకరమైన వాతావరణం

» పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం: ముఖ్యమంత్రి రేవంత్
» కిటాక్యుషు నగరాన్ని సందర్శించిన సీఎం
» జపాన్ సంస్థలతో తెలంగాణ ఒప్పందం


కిటాక్యుషు నగర మేయర్ కజుహిసా టేకుచి బృందంతో సీఎం రేవంత్, మంత్రి దుద్దిళ్ల

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఎకో టౌన్ అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్తు తరాలకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించగలమనే విశ్వాసాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తం చేశారు. సుస్థిరత ఇకపై ఐచ్ఛికం కాదని, అవసరమని అన్నారు. ఉపాధి కల్పన, అభివృద్ధి, సంపద సృష్టితోపాటు పర్యావరణ పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జపాన్ పర్యటనలో భాగంగా సీఎం నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం ఆదివారం పర్యావరణహిత కిటాక్యుషు నగరాన్ని సందర్శించింది. హైదరాబాద్‌లో ఎకో టౌన్ ఏర్పాటుకు జపాన్‌కు చెందిన ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందులో భాగంగా పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ రంగాల్లో భాగస్వామ్యం పంచుకోనుంది. కాగా, కిటాక్యుషు నగర మేయర్ కజుహిసా టేకుచితో సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు అధికారులు భేటీ అయ్యారు. పర్యావరణ అనుకూల సాంకేతికతలు, పరిశుభ్రమైన నగర నమూనాలు, నదుల పునరుజ్జీవ విధానాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఈఎక్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, పీ9 ఎల్ఎల్పీ, నిప్పాన్ స్టీల్ ఇంజనీరింగ్, న్యూ కెమికల్ ట్రేడింగ్, అమితా హోల్డింగ్స్ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ మేరకు సీఎం సమక్షంలో లెటర్స్ ఆఫ్ ఇంటెంట్‌పై తెలంగాణ ప్రభుత్వ అధికారులు, కంపెనీల ప్రతినిధులు సంతకాలు చేశారు. కిటాక్యుషు మాదిరిగా హైదరాబాద్‌ను శుభ్రమైన, సుస్థిర నగరంగా తీర్చిదిద్దే దిశగా ఈ ఒప్పందాలు జరిగాయి. ఒకప్పుడు పారిశ్రామిక కాలుష్యంతో ఇబ్బందులు పడ్డ కిటాక్యూషు నగరం ఇప్పుడు ప్రపంచంలోని పరిశుభ్రమైన నగరాల్లో ఒకటిగా ఎలా మారిందో మేయర్ టేకుచి వివరించారు. తమ అనుభవాలు, పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణతో పంచుకునేందుకు ఆసక్తి ప్రదర్శించారు.

పెట్టుబడులకు అనువైన వాతావరణం..

పరిశ్రమల అభివృద్ధికి తెలంగాణ అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా వృద్ధి చెందిందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తితోపాటు తమ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన జపాన్ కంపెనీల పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా హైదరాబాద్- కిటాక్యుషు నగరాల మధ్య విమాన ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేయాలనే అంశం చర్చకు వచ్చింది. హైదరాబాద్‌లో జపనీస్ భాష పాఠశాల ఏర్పాటు చేసే ప్రతిపాదనను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. జపాన్‌లో యువశక్తి అవసరం ఎక్కువగా ఉందని, మన యువతకు జపనీస్ భాషపై నైపుణ్యం కల్పిస్తే.. అంతర్జాతీయంగా వారికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ పర్యటనలో భాగంగా తెలంగాణ ప్రతినిధి బృందం మురాసాకి పునరుజ్జీవ ప్రాజెక్టును సందర్శించింది. గతంలో కాలుష్య కాసారంగా ఉన్న ఈ నది.. పరిశుభ్రమైన నదీతీరంగా మారిన తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. అంతకు ముందు సీఎం రేవంత్ బృందానికి కిటాక్యుషులో స్థానిక సంప్రదాయ రీతిలో స్వాగతం లభించింది.

నిర్బంధం బద్దలైంది.. ఇంద్రవెల్లి రెక్కలు విప్పుకొంది: రేవంత్

జల్.. జంగిల్.. జమీన్ అంటూ హక్కుల కోసం పోరాడి, అసువులు బాసిన అడవి బిడ్డలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళి అర్పించారు. వారి పోరాటం సదా స్ఫూర్తిదాయకమన్నారు. ఇంద్రవెల్లి అమరుల సంస్మరణ దినం సందర్భంగా ఆయన ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "నాలుగు దశాబ్దాల నిర్బంధం బద్దలైంది. ఇంద్రవెల్లి స్వేచ్ఛగా రెక్కలు విప్పుకొంది. నాకు అండగా నిలిచి.. ఇంద్రవెల్లి కొండల్లో దండోరా మోగించిన ఆదివాసీలకు అన్నగా, ఆత్మీయులకు దన్నుగా తీసుకున్న నిర్ణయం స్వేచ్ఛ" అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

'వక్ఫ్' సవరణను అమలు కానివ్వం: షబ్బీర్

» నిజామాబాద్‌లో ముస్లింల భారీ ర్యాలీ



సుభాష్‌నగర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఎట్టి పరిస్థితుల్లోనూ వక్ఫ్ బోర్డు చట్ట సవరణను అమలు కానివ్వబోమని, చట్ట ప్రకారం కోర్టుల ద్వారా అడ్డుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బోధన్ రోడ్డులో వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు వ్యతిరేకంగా ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. వక్ఫ్ ఆస్తులను తమ ఆధీనంలోకి తీసుకుని ముస్లిం మైనార్టీ సమాజాన్ని బలహీనపర్చేలా కేంద్రం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. వక్ఫ్ బోర్డు చట్ట సవరణను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ తరఫున సుప్రీంకోర్టులో సొంత ఖర్చులతో పిటిషన్ దాఖలు చేశానని తెలిపారు. ఈ సవరణ చట్టబద్ధతపై సుప్రీంకోర్టు ఇప్పటికే విచారణ మొదలు పెట్టి కేంద్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేస్తూ వివరణ కోరిందని షబ్బీర్ అలీ చెప్పారు. గతంలో ముస్లింలు మాత్రమే వక్ఫ్ కౌన్సిల్ బోర్డులో భాగమని, సవరణ తర్వాత హిందువులు కూడా భాగం కావచ్చునని, ఇది పార్లమెంటరీ చట్టం ప్రాథమిక హక్కులను ప్రత్యక్షంగా ఉల్లంఘించడమేనని ఆయన పేర్కొన్నారు. భారత అత్యుత్తమ న్యాయస్థానం సుప్రీంకోర్టుపై తమకు పూర్తి నమ్మకం ఉందని, తప్పక న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, జావీద్ అక్తర్, ఖుద్దుస్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


వక్ఫ్ సవరణతో పేద ముస్లింలకు న్యాయం

» చట్టానికి వ్యతిరేకంగా బడా చోర్‌ల సభ
» ఆ సభకు అంతా సమకూర్చింది రేవంత్
» కేంద్ర మంత్రి బండి సంజయ్



పెద్దపల్లి టౌన్/హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పేద ముస్లింలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే కేంద్రం వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకువచ్చిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదివారం పెద్దపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. పేద ముస్లింలను దోచుకున్న ఎంఐఎం పార్టీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా బడా చోర్‌లందరూ కలిసి మీటింగ్ పెట్టారని విమర్శించారు. టైటిల్ డీడ్ లేని భూములను వక్ఫ్ పేరుతో ఆక్రమించుకున్న చరిత్ర ఎంఐఎం పార్టీదని మండిపడ్డారు. 8 లక్షల ఎకరాల భూమి, రూ.10 లక్షల కోట్ల సంపద ఉన్నా.. ఒక్క పేద వాడికి కూడా వక్ఫ్ సంస్థ ఉపయోగపడలేదని విమర్శించారు. తాము సభ పెడితే పరిస్థితి మరోలా ఉంటుందని హెచ్చరించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సభకు కర్త, కర్మ, క్రియ రేవంత్‌రెడ్డి అని.. మీటింగ్‌కు నిధులు సమకూర్చింది కూడా ఆయనేనని ఆరోపించారు. మంచి ఉద్దేశంతో వక్ఫ్ సవరణ చట్టాన్ని తెస్తే మత కోణంలో ప్రతిపక్షాలు విద్వేషాలను రెచ్చగొడుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

బీబీపీ పార్టీల కుమ్మక్కు: విశ్వేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం భాయ్ భాయ్‌కే పార్టీ(ఎంఐఎం), బాప్ బేటీకే పార్టీ (బీఆర్ఎస్), బేటా బేటీకే పార్టీ(కాంగ్రెస్)లు కుమ్మక్కయ్యాయని బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఈ ఎన్నిక బీజేపీ వర్సెస్ బీబీపీ అని తెలిపారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విశ్వేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలో ఎందుకు పోటీ చేయడం లేదని బీఆర్ఎస్‌ను నిలదీశారు. బారిస్టర్ చదివిన అసదుద్దీన్ ఒవైసీ, ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. కేసీఆర్ వాడిన భాషనే ఒవైసీ మాట్లాడారని విమర్శించారు. ఉర్దూ భాషను సైతం కించపరిచేలా ఒవైసీ విమర్శలు చేశారన్నారు. వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలని ఒవైసీ అంటున్నారని.. వక్ఫ్ చట్ట సవరణ కూడా అందుకోసమే అని విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు.

క్యాన్సర్ పరీక్షలు ఫ్రీ

(మొదటిపేజీ తరువాయి)

ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించింది. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే.. రోగులను ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని సర్కారు భావిస్తోంది. రాష్ట్రంలో వెలుగు చూస్తున్న కేసుల్లో 41% వరకు ఓరల్, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రోగులు ఉంటున్నారు. ఈ నేపథ్యంలో.. ఈ మూడు కేటగిరీలపై వైద్య ఆరోగ్య శాఖ దృష్టి సారించనుంది. అయితే.. ఈ కార్యక్రమం ఎప్పటి నుంచి ప్రారంభమవుతుందనేదానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. క్యాన్సర్ పరీక్షల కోసం ప్రభుత్వం పది ప్రాంతీయ కేంద్రాలను ఏర్పాటు చేసి, జిల్లాకు ఒకటి చొప్పున 'మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్' వాహనాలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ప్రాంతీయ కేంద్రాలను రెండు దశల్లో ప్రారంభించనుంది. మొదటి దశలో భద్రాద్రి-కొత్తగూడెం, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లో ఒక్కోచోట రూ.50 కోట్ల చొప్పున వెచ్చించి, ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. తదుపరి దశలో మరో ఐదు చోట్ల ప్రాంతీయ కేంద్రాలు ఏర్పాటవుతాయి. ఈ కేంద్రాల్లో క్యాన్సర్‌కు మెడికల్, సర్జికల్, రేడియో థెరపీ సేవలందిస్తారు. దీంతోపాటు.. అన్ని జిల్లా కేంద్రాల్లో క్యాన్సర్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువస్తారు. ఇక్కడ కీమో థెరపీ, పాలియేటివ్ కేర్ సేవలందిస్తారు. దీంతోపాటు.. ప్రతి జిల్లాకు ఒకటి చొప్పున మొబైల్ వాహనం సేవలను ప్రవేశపెడతారు. ఈ వాహనంలో ఆంకాలజిస్టులు, పారామెడికల్ సిబ్బంది ఉంటారు.

ప్రతి గ్రామంలో స్క్రీనింగ్స్

ప్రాంతీయ, జిల్లా క్యాన్సర్ కేంద్రాలకు అనుబంధంగా పనిచేసే మొబైల్ వాహనాలు ప్రతి గ్రామాన్ని సందర్శిస్తాయి. ముందుగానే నిర్ణీత గ్రామంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల తేదీలను ప్రకటిస్తారు. కంటివెలుగు మాదిరిగానే.. అన్ని గ్రామాల్లో 18 ఏళ్ల



దాటిన వారందరికీ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తామని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. ఈ పరీక్షల్లో ఎవరిలోనైనా క్యాన్సర్ లక్షణాలు బయటపడితే.. జిల్లాస్థాయి క్యాన్సర్ చికిత్స కేంద్రానికి తరలిస్తారు. సర్జరీలు అవసరమైతే ప్రాంతీయ కేంద్రాలకు.. తీవ్రత మరింత ఎక్కువగా ఉంటే హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రికి సిఫారసు చేస్తారు. వీటితోపాటు.. ప్రతి ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఒక క్యాన్సర్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి.. ఉచితంగా స్క్రీనింగ్ నిర్వహిస్తారు.

మహిళలకు ప్రత్యేకంగా..

మహిళలకు అన్ని సర్కారీ దవాఖానాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్‌ను అందుబాటులోకి తీసుకువస్తారు. ఇప్పటికే 'ఆరోగ్య మహిళ' పేరుతో మంగళవారాల్లో ప్రభుత్వాస్పత్రుల్లో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది.

ఈ మూడు క్యాన్సర్లే ఎక్కువ

ఎంఎన్‌జే ఆస్పత్రిలో నమోదవుతున్న కొత్త కేసుల్లో ఓరల్, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడ్డ వారే అధికంగా ఉంటున్నారు. కేటగిరీల వారీగా ఆ వివరాలు..

నోటి క్యాన్సర్	19%
రొమ్ము క్యాన్సర్	12%
గర్భాశయ ముఖద్వార క్యాన్సర్	10%
మొత్తం	41%

పరీక్షలకు ప్రపంచ బ్యాంకు నిధులు..

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల కోసం ప్రపంచ బ్యాంకు నిధులను వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వైద్యశాఖకు ప్రపంచ బ్యాంకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు గాను.. ఆరేళ్ల ప్రాజెక్టులో భాగంగా రూ.4,150 కోట్ల రుణం ఇవ్వనుంది. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు సంబంధించి ప్లానింగ్ రిపోర్టును ప్రపంచ బ్యాంకు బృందానికి వైద్యశాఖ ఇప్పటికే అందజేసింది. ఈ నిధులు వస్తే.. పరీక్షల కోసం జిల్లాకు ఒకటి చొప్పున మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాన్ని కొనుగోలు చేస్తారు. అందులో వైద్య పరీక్షలు చేసే వైద్యులు, ఇతర సహాయక సిబ్బందితోపాటు యంత్ర పరికరాలుంటాయి. ప్రాంతీయ, జిల్లాస్థాయి కేంద్రాలు ఏర్పాటైతే.. ఇప్పటి వరకు హైదరాబాద్‌కే పరిమితమైన క్యాన్సర్ పరీక్షలు, చికిత్సలు.. జిల్లాలకు కూడా విస్తరిస్తాయి. మొబైల్ వాహనాల ద్వారా గ్రామగ్రామానికీ సేవలు అందుతాయి.

'మొబైల్' ద్వారా రోజుకు 200 మందికి..



మొబైల్ వాహనం ద్వారా రోజుకు కనీసం 200 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసే అవకాశం ఉంటుంది. ఒక్కో వాహనంలో 12 మంది వైద్య సిబ్బంది ఉంటారు. వీరిలో నలుగురు ఆంకాలజిస్టులు కాగా.. మిగతా వారు పారా మెడికల్ సిబ్బంది. మహిళలకు సర్వైకల్ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల కోసం పాప్‌స్మియర్ పరికరం, రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించేందుకు మామోగ్రఫీ యంత్రాలుంటాయి. ఓరల్ క్యాన్సర్ విషయంలో టార్చ్‌లైట్ సాయంతో మౌఖికంగా పరీక్షించి, నిర్ధారించవచ్చు.

- డాక్టర్ ఎం.శ్రీనివాసులు, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్

వైద్య బోధన సిబ్బందికి 'ముఖ హాజరు'

మే 1 నుంచి అమలుకు ఎన్ఎంసీ సన్నాహాలు.. వైద్య విద్య సంచాలకులు, కళాశాలలకు లేఖలు

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్య కళాశాలల్లో నకిలీ బోధన సిబ్బందికి చెక్ పెట్టే దిశగా జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) నిర్ణయించింది. వచ్చే నెల 1వ తేదీ నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ముఖ హాజరు విధానాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల హెల్త్ సెక్రటరీలు, వైద్య విద్య సంచాలకులు, ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు లేఖలు పంపింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఆధార్ ఆధారిత హాజరు విధానాన్ని(అబాస్‌ను) రద్దు చేసి.. ముఖ హాజరు విధానానికి శ్రీకారం చుట్టనున్నట్లు అందులో పేర్కొంది. సంబంధిత మార్గదర్శకాలను అందులో ప్రస్తావించింది. ముఖ హాజరులో రెండు విధానాలున్నాయని ఎన్ఎంసీ పేర్కొంది.

సిలికాన్ థంబ్‌లతో దొంగ హాజరు

ప్రైవేట్ వైద్య కళాశాలల్లో అధ్యాపకులు అబాస్‌ను దుర్వినియోగం చేస్తున్నారన్న ఫిర్యాదులున్నాయి. వేలిముద్ర వేస్తే హాజరుపడే అవకాశం ఉండడంతో సిలికాన్ థంబ్స్ తయారు చేయించి, కాలేజీలోని క్లర్క్‌లకో, కిందిస్థాయి సిబ్బందికో ఇచ్చి అటెండెన్స్ వేయించుకునేవారు. అబాస్ ఏర్పాటైన తొలిరోజుల్లో కొద్దిమందికే పరిమితమైన ఈ వ్యవహారం క్రమంగా పెద్ద కుంభకోణంగా మారింది. దీనిపై ఎన్ఎంసీకి పెద్దఎత్తున ఫిర్యాదులందడంతో కొత్తగా ముఖ హాజరు విధానానికి ఎన్ఎంసీ శ్రీకారం చుట్టింది. కొత్త విధానంలో వైద్య కళాశాలల్లో హాజరు శాతం కచ్చితంగా మెరుగవుతుందని వైద్య విద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అలాగే, దేశవ్యాప్తంగా అన్ని వైద్య కళాశాల్లో పని చేస్తున్న అధ్యాపకుల వివరాలను ఎన్ఎంసీ వెబ్‌సైట్‌లో పొందుపరిస్తే.. ఘోస్ట్ ఫ్యాకల్టీకి చెక్ పడుతుందని చెబుతున్నారు. ఎన్ఎంసీ తనిఖీలకు వచ్చినప్పుడు కాలేజీ యాజమాన్యాలు చెప్పే అధ్యాపకుల పేర్లకు, ఎన్ఎంసీ వెబ్‌సైట్‌లో ఉన్న పేరుతో పోలిక ఉందో లేదో అప్పుడే తెలుసుకోవచ్చని అంటున్నారు.

ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య

» శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికుల పడిగాపులు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో శంషాబాద్ విమానాశ్రయంలో రెండున్నర గంటలు ప్రయాణికులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఆదివారం ఉదయం 7.05 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి 225 మంది ప్రయాణికులతో గోవా వెళ్లాల్సిన విమానం ఆలస్యమైంది. గోవా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చి తిరిగి అదే విమానం గోవా వెళ్లాల్సి ఉంది. కానీ సాంకేతిక కారణాలతో గోవా నుంచి రావాల్సిన ఆ విమానం రెండున్నర గంటలు ఆలస్యమైంది. దీంతో ప్రయాణికులు ఎయిర్‌లైన్స్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎయిర్‌లైన్స్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎట్టకేలకు ఉదయం 8 గంటలకు గోవా నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న ఇండిగో విమానం ప్రయాణికులతో తిరిగి ఉదయం 9.30 గంటలకు గోవా బయలుదేరి వెళ్లింది.

మావోయిస్టులను చంపే అధికారం ఎవరిచ్చారు?

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

కరీంనగర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మావోయిస్టులను చంపే అధికారం కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ఎవరిచ్చారు?, మావోయిస్టులను చంపమని రాజ్యాంగంలో ఏమైనా పొందుపరిచారా? అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తప్పు చేస్తే కేసులు పెట్టి కోర్టు ఎదుట హాజరుపరచాలి కానీ చంపడం ఎందుకని, దేశంలో ప్రశ్నించే వారిని చంపడమే బీజేపీ ఎజెండానా అని నిలదీశారు. మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి బీజేపీ కుట్ర చేస్తోందన్నారు. రాజ్యాంగంలోని అంశాలను పక్కదారి పట్టించడం కోసం ప్రజల దృష్టిని మరల్చడానికి బీజేపీ చేయని ప్రయత్నం లేదన్నారు. వక్ఫ్‌బోర్డు కమిటీలో ముస్లిమేతరులను ఎలా చేరుస్తారని కూనంనేని ప్రశ్నించారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లుపై కేంద్ర వైఖరేంటి?: జాజుల

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లను పెంచుతూ రాష్ట్రప్రభుత్వం చేసిన చట్టంపై తన వైఖరేంటని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అసెంబ్లీలో చేసిన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తమిళనాడు తరహాలో తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చి బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. దానికోసం ఢిల్లీలో బీసీ హిందూ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్ ఇరవై రోజులుగా చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు మద్దతు ప్రకటించారు. అసెంబ్లీలో బీసీ బిల్లుకు మద్దతు తెలిపిన బీజేపీ, కేంద్రంలో ఎందుకు జాప్యం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. దీక్ష చేస్తున్న సిద్దేశ్వర్‌కు ఏదైనా జరిగితే దేశవ్యాప్తంగా ఉన్న బీసీలను ఏకం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ఇప్పటికైనా సిద్దేశ్వర్‌తో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మాట్లాడి దీక్ష విరమింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆదివాసీలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాడులు

» సంస్కృతిని కాలరాసే కుట్రలు: ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల నుంచి ఆదివాసీలను రక్షించాలని ఏఐసీసీ కార్యదర్శి పి.విశ్వనాథన్ పిలుపునిచ్చారు. ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళన్ రెండోరోజు కార్యక్రమం ఆదివారం హనుమకొండలోని హరిత హోటల్‌లో కొనసాగింది. ముఖ్య అతిథిగా హాజరైన విశ్వనాథన్ మాట్లాడుతూ.. ఆదివాసీలపై కేంద్రంలోని బీజేపీ సర్కారుతో పాటు ఆర్ఎస్ఎస్ దాడులు చేస్తుందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆదివాసీలపై దాడులు, అత్యాచారాలు పెరిగాయన్నారు. వారి సంస్కృతిని కాలరాసే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. భూ హక్కులను హరిస్తున్నారని మండిపడ్డారు. ఆదివాసీల సంస్కృతి గొప్పదన్నారు. వారిని చైతన్యపరిచి నాయకత్వాన్ని పెంపొందించే లక్ష్యంతోనే సమ్మేళన్ నిర్వహిస్తున్నట్లు విశ్వనాథన్ చెప్పుకొచ్చారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. ఆదివాసీలకు కాంగ్రెస్ అండగా ఉందని అన్నారు. దేశవ్యాప్తంగా రాహుల్‌గాంధీ ఈమేరకు పోరాటం చేస్తున్నారన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రలను ఛేదించడానికి సమష్టిగా పోరాడుదామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ఆదివాసీల పాత్ర గొప్పదన్నారు. అదే స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణ, హక్కుల కోసం ఆదివాసీలు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లపై ఉద్యమించాలని సూచించారు. ప్రొఫెసర్ కంచ ఐలయ్య మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ పరిరక్షణ, ఆదివాసీల కోసం రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటం గొప్పదని కొనియాడారు. ఈ సమ్మేళన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ వైస్‌చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, ఎంపీ కావ్య, మేయర్ సుధారాణి పాల్గొన్నారు.

పేరుకే ముగ్గురు మంత్రులు.. అభివృద్ధి శూన్యం

» ఖమ్మంలో మంత్రుల మధ్య ఆధిపత్య పోరు: కవిత

ఖమ్మం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లా నుంచి ఉపముఖ్యమంత్రితో పాటు ఇద్దరు మంత్రులున్నా వారి మధ్య ఆధిపత్య పోరు తప్ప ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదని, అకాల వర్షాలతో జరిగిన పంట నష్టంపై కనీసం సమీక్షించలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. ఖమ్మంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అకాల వర్షాలతో రాష్ట్రం అతలాకుతలం అవుతుంటే సీఎం కనీసం రెవెన్యూ అధికారులతో మాట్లాడలేదన్నారు. పంట నష్టపోయిన రైతులందరికీ ఎకరానికి రూ.20 వేలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సోనియా, రాహుల్‌పై ఈడీ కేసులు నమోదు చేస్తే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆందోళనలు చేపట్టిందని, కానీ.. సీఎం రేవంత్‌రెడ్డికి మాత్రం కనీసం ట్విట్టర్‌లో పోస్టు పెట్టేందుకూ తీరిక లేకుండా పోయిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో భక్తరామదాసు ప్రాజెక్టు పూర్తిచేసి వేల ఎకరాలకు సాగునీరు అందించామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క కొత్త ప్రాజెక్టు చేపట్టలేదన్నారు. వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఖమ్మం నుంచి ప్రజలు భారీగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీలో కొలువుల జాతర

త్వరలో 3,038 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ)లో త్వరలో కొలువుల జాతర ప్రారంభం కానున్నది. ఇప్పటికే 3,038 ఉద్యోగాలను భర్తీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, త్వరలో నోటిఫికేషన్ జారీ అవుతుందని ఆదివారం ఓ ప్రకటనలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. చాలా రోజుల తర్వాత ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీ ప్రారంభం కానుండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీలో భారీస్థాయిలో ఉద్యోగాల భర్తీకి ఆమోదం తెలిపినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలోనే ఈ ఉద్యోగాలు భర్తీ చేయాలని భావించినా.. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ కొనసాగుతుండటంతో ఆలస్యమైందన్నారు. ఇప్పుడు ఎస్సీ వర్గీకరణ పూర్తి కావడంతో ఉద్యోగాల భర్తీకి మార్గం సుగమమైందని చెప్పారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తమ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. దీంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని వెల్లడించారు. ఇప్పటిదాకా మహాలక్ష్మి పథకం కింద 165కోట్ల టికెట్లు జారీ చేయగా, రాష్ట్ర మహిళలకు రూ.5,500కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుకు కొత్త బస్సులు కొనుగోలు చేశామని వెల్లడించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక 60వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మరోసారి జాబ్ క్యాలెండర్ విడుదల చేసి భారీగా ఉద్యోగాలను భర్తీ చేయనుందని పేర్కొన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భర్తీ చేసే ఉద్యోగాలు : 3,038

డ్రైవర్: 2,000.. శ్రామిక్: 743

డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్): 84

డిప్యూటీ సూపరింటెండెంట్ (మెకానికల్): 114

డిపో మేనేజర్/ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్: 25

అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్: 18

అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్): 23

సెక్షన్ ఆఫీసర్ (సివిల్): 11

అకౌంట్ ఆఫీసర్లు: 6

మెడికల్ ఆఫీసర్లు (జనరల్): 7

మెడికల్ ఆఫీసర్లు (స్పెషలిస్ట్): 7

ప్రైవేటుకు దీటుగా..!

ప్రభుత్వ ఆస్పత్రులు.. పాఠశాలల అభివృద్ధి



» సీఎస్ఆర్ నిధులతో కొత్తరూపు

» రెండు శాఖల అధికారులతో బృందాల ఏర్పాటు.. త్వరలోనే సర్కార్‌కు నివేదికలు

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్య, వైద్యం విషయంలో ప్రైవేటు దందా రోజురోజుకూ పెరిగిపోతోంది. పాఠశాలల ఫీజులు, ఆస్పత్రుల బిల్లుల విషయంలో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాయి. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో జనం ప్రైవేటుకు వెళ్లాల్సి వస్తోంది. దీనిని ఆసరాగా చేసుకుని ప్రైవేటు యాజమాన్యాలు ధనార్జనగా మార్చుకుంటున్నాయి. దీంతో ఈ దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా అభివృద్ధి చేయాలని సర్కారు భావిస్తోంది. తద్వారా ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించాలని సర్కారు యోచిస్తోంది. ఇందుకోసం ఆయా శాఖల్లోని పలువురు అధికారులతో బృందాలను ఏర్పాటు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆయా బృందాలు ఈ రెండు అంశాలపై అధ్యయనం చేసి ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రతిపాదనలు ఇవ్వాలని సర్కారు సూచించింది. ఈ మేరకు అధికారుల బృందాలు పలు రాష్ట్రాల్లో అధ్యయనం చేయనున్నాయి. ఆస్పత్రుల విషయంలో ఎయిమ్స్, చండీగఢ్‌లో ఉన్న పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ సెంటర్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అమలవుతున్న విధానాలను అధికారుల బృందం సేకరించనుంది. వైద్యఆరోగ్య శాఖలోని బృందం ఇప్పటికే కొన్ని వివరాలు సేకరించినట్లు, త్వరలోనే ప్రభుత్వానికి ప్రాథమిక నివేదికలు సమర్పించనున్నట్లు తెలిసింది. మరోవైపు పాఠశాలల నిర్వహణకు సంబంధించి విద్యాశాఖ అధికారులు కేరళ సహా మరికొన్ని రాష్ట్రాల్లో పర్యటించి వివరాలు సేకరించనున్నారు.

సీఎస్ఆర్ నిధుల వినియోగంతో..

రాష్ట్రంలో వైద్యరంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా వరంగల్‌తోపాటు హైదరాబాద్‌లోని సనత్‌నగర్, ఎల్బీ నగర్, అల్వాల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల విషయంలో ప్రత్యేక దృష్టి సారించింది. వీటిలో హైదరాబాద్‌లోని మూడు తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్)లను కార్డియాక్, గ్యాస్ట్రో, న్యూరో విభాగాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటితోపాటు జిల్లాల్లో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులను కూడా మరింతగా బలోపేతం చేయాలని భావిస్తోంది. ఇప్పటికే పలు జిల్లాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆన్‌లైన్‌లో ఓపీ ఇస్తున్నారు. ఇకపై ఏ వ్యాధితో ఆస్పత్రికి వచ్చారు, పరీక్ష కోసం డాక్టర్ మళ్లీ ఎప్పుడు రమ్మన్నారు అనే వివరాలన్నింటినీ పొందుపర్చుతూ ప్రత్యేకంగా రశీదు కూడా ఇవ్వాలని భావిస్తున్నారు. పేషంట్ మొబైల్ నంబరును ఆస్పత్రి కంప్యూటర్‌లో ఒక్కసారి నమోదు చేశాక.. మళ్లీ గడువులోపు సదరు పేషంట్ వచ్చి మొబైల్ నంబరు చెప్పగానే వారి వివరాలతో కూడిన రశీదును, సంబంధిత డాక్టర్ దగ్గరకు పంపించే విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నారు. దీంతోపాటు ఇన్‌పేషంట్‌గా ఉన్నవారి వద్దకు వైద్యులు రోజులో ఒకటి, రెండుసార్లు వెళ్లి పరిశీలించేలా మార్పులు తీసుకురావాలని భావిస్తున్నారు. ఎమర్జెన్సీ వైద్యులబృందాన్ని కూడా ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూడనున్నట్లు సమాచారం. ఆసుపత్రిలో శుభ్రతను పాటించేలా చూడనున్నారు. మొత్తంగా ప్రభుత్వ ఆస్పత్రులను చూడగానే 'ప్రొఫెషనల్ అవుట్‌లుక్'వచ్చేలా తీర్చిదిద్దాలన్నది సర్కారు భావన. ఈ మొత్తం వ్యవహారాలకు ఖర్చు కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను సేకరించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం.

సర్కారులో ప్రీ ప్రైమరీ స్కూళ్లు..

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో భాగంగా.. ఆయా స్కూళ్లలో విద్యార్థుల నమోదు శాతం పెరిగేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వీటికితోడు మరికొన్ని సేవలను అందుబాటులోకి తెస్తే పాఠశాలలు బలోపేతమయ్యే అవకాశం ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా కమిషన్ సూచించింది. ఈ నేపథ్యంలో ప్రీ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించింది. మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలోని అంగన్‌వాడీల్లోనూ ప్రీ ప్రైమరీని ప్రవేశపెట్టాలని ఆ శాఖ నిర్ణయించింది. ఇదే విధానాన్ని ప్రభుత్వపాఠశాలల్లోనూ ప్రవేశపెడితే బాగుంటుందన్న నిపుణుల సూచనమేరకు రాష్ట్ర వ్యాప్తంగా 990 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ స్కూళ్లను ప్రారంభించాలని సర్కారు సూత్రప్రాయంగా నిర్ణయించింది. ప్రీ ప్రైమరీల్లో 4వ ఏటనే పిల్లలను చేర్చుకోవడం, ప్లే స్కూల్ తరహాలో ఏర్పాట్లు చేయడం, ప్రత్యేకంగా టీచర్లను నియమించడం వంటి చర్యలు చేపట్టనుంది. ప్రీ ప్రైమరీలో చేరినవిద్యార్థి పదో తరగతి పూర్తయ్యేవరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకునేలా స్కూళ్లను తీర్చిదిద్దాలని సర్కారు భావిస్తోంది. ఈ మేరకు ప్రస్తుతం అమల్లో ఉన్న విద్యా విధానంలో పలు కీలక మార్పులు చేపట్టనున్నట్టు తెలిసింది. ఇందుకోసం ఏయే రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు ఎలా ఉన్నాయనే దానిపై అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

తన బిడ్డ ఏమైపోతుందోననే బెంగతో..

» 4 ఏళ్ల కూతురికి విషమిచ్చి తానూ తాగిన తల్లి

» చిన్నారి మృతి..చావు బతుకుల మధ్య మహిళ

» అనారోగ్యాన్ని భరించలేక ఆత్మహత్యాయత్నం



జశ్విక (ఫైల్)

జీడిమెట్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పుట్టుక నుంచి మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న ఓ తల్లి.. తాను చనిపోతే కుమార్తె ఏమైపోతుందోనన్న బెంగతో బిడ్డతో సహా ఆత్మహత్యకు యత్నించింది. కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు కలిపి చిన్నారికి తాగించి.. ఆపై తానూ అదే విషాన్ని మింగింది. ఈ క్రమంలో కుమార్తె మృతి చెంద గా.. తల్లి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఈ ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రగతి నగర్‌లో జరిగింది. గుంటూరు జిల్లా నర్సారావుపేటకు చెందిన నంబూరి సాంబశివరావు.. బాపట్ల మండలం మిన్నేకల్లు గ్రామానికి చెందిన కృష్ణ పావని(33)కి తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లయిన నాలుగేళ్లకు వీరికి పాప పుట్టింది. సాంబశివరావు హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. పావని ఇంటి వద్దనే ఉంటూ కుమార్తెను చూసుకుంటోంది. పావని పుట్టుకతోనే మానసిక వ్యాధితో బాధపడుతోంది. నరాల బలహీనత, తీవ్ర కోపం వంటి సమస్యలతో ఆమె సతమవుతుండేది. ఇదే వ్యాధి తన కుమార్తె జశ్విని(4) కూడా ఉందన్న అనుమానం పావనిలో బలపడింది. ఈ బాధను భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్న పావని.. తాను మరణిస్తే కుమార్తె భవిష్యత్ ఎమవుతుందోనని ఆందోళనకు గురైంది. ఈ క్రమంలో 18న భర్త ఉద్యోగానికి వెళ్లగా.. సాయంత్రం 4.30 గంటల సమయంలో కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు కలిపి కుమార్తెకు తాగించి, తాను కూడా తాగింది. శనివారం తెల్లవారుజామున తల్లీ కూతుళ్ల పరిస్థితి విషమిస్తుండటంతో భర్తకు అనుమానం వచ్చి గట్టిగా నిలదీశాడు. దీంతో పావని జరిగిన విషయం చెప్పింది. వెంటనే సాంబశివరావు తల్లీ బిడ్డలను ఆసుపత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి జశ్విక చనిపోయింది. పావని పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.



'ఒక ప్రస్థానం యాభై ఏళ్ల ప్రయాణం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, కొప్పుల, చాడ తదితరులు

యువనేతలకు కొప్పుల ఈశ్వర్ ఆదర్శం

ఈశ్వర్ జీవిత కథ 'ఒక ప్రస్థానం యాభై ఏళ్ల ప్రయాణం' పుస్తకావిష్కరణలో మాజీ మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వారికి, రాజకీయాల్లోకి రావాలని అనుకుంటున్న వారికి కొప్పుల ఈశ్వర్ ఆదర్శమని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు అన్నారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జీవితానుభవాల సమాహారం 'ఒక ప్రస్థానం యాభై ఏళ్ల ప్రయాణం' అనే పుస్తకాన్ని హైదరాబాద్‌లోని జలవిహార్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో హరీశ్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. కోపం, అసహనం ఇసుమంతైనా లేని ఈశ్వర్‌లోని పోరాటయోధుడిని ఈ పుస్తకం పరిచయం చేస్తుందని పేర్కొన్నారు. బొగ్గు గని కూలీ నుంచి మంత్రి వరకు సాగిన ఈశ్వర్ ప్రస్థానం ఆదర్శనీయమని కొనియాడారు. నమ్మిన సిద్ధాంతం కోసం, పార్టీ కోసం నిజాయతీగా పనిచేస్తే పదవులు వాటంతటవే వస్తాయనడానికి కొప్పుల ఈశ్వర్ నిదర్శనం అన్నారు. ఈశ్వర్ ఎదుగుదలలో ఆయన జీవిత భాగస్వామి స్నేహలత సహకారం ఎంతో ఉందని ప్రశంసించారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికోద్యమ, నక్సల్బరీ, మలిదశ తెలంగాణ పోరాటాల చరిత్రను అధ్యయనం చేయడానికి ఈ పుస్తకం ఉపయోగపడుతుంది అన్నారు. మాజీ మంత్రులు మొహమ్మద్ అలీ, జగదీశ్ రెడ్డి, గంగుల కమలాకర్ తదితరులు మాట్లాడుతూ కొప్పుల ఈశ్వర్ వ్యక్తిత్వాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత నూతి మల్లన్న, సినీ రచయిత, ఎంపీ ప్రసాద్, జస్టిస్ చంద్రయ్య, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ గంటా చక్రపాణి, మండలి ఉప సభాపతి బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ రమణ, సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి, సీపీఐ (ఎంఎల్) నేత వేములపల్లి వెంకట్రావు, సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, సినీ దర్శకుడు ఎస్.శంకర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను లేకుండా చేయాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కంకణం

ఆ రెండు పార్టీలు తెలంగాణకు శత్రువులే.. ప్రజలకు రక్షణ గులాబీ జెండానే

వైఎస్ఆర్ తెచ్చిన ఆరోగ్య శ్రీ భేష్.. ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసిన చంద్రబాబు

వారిద్దరినీ అభినందించాల్సిందే: కేటీఆర్



రాజేంద్రనగర్/హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): "బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి బీఆర్ఎస్‌ను లేకుండా చేయాలని కంకణం కట్టుకున్నాయి. రెండు జాతీయ పార్టీలు తెలంగాణకు శత్రువులే. తెలంగాణ ప్రజలకు రక్షణ కవచం గులాబీ జెండా. ప్రజలకు ఏ కష్టం వచ్చిన అండగా ఉండేది బీఆర్ఎస్ పార్టీయే" అని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వనం శ్రీరాంరెడ్డి తన అనుచరులతో కలిసి ఆదివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. దేశంలో ఎన్నో కొత్త పార్టీలు వచ్చాయి.. పోయాయి.. రాజకీయ చరిత్రలో నిలిచిపోయిన పార్టీలు తెలుగుదేశం, బీఆర్ఎస్ మాత్రమేనని పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి వచ్చిన వారి ఉత్సాహం చూస్తుంటే తొందరలోనే పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ఎమ్మెల్యే అవుతాడనిపిస్తోందని చెప్పారు. 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రులుగా పనిచేసిన దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్య శ్రీ పథకం తీసుకువచ్చి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, చంద్రబాబు ఐటీ రంగాన్ని అభివృద్ధి చేశారని కొనియాడారు. వారిద్దరినీ అభినందించాల్సిందేనన్నారు. వాళ్లు తీసుకొచ్చిన పథకాలను తాము కొనసాగించామని, మంచి పనులను బీఆర్ఎస్ ఎప్పుడూ అడ్డుకోదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తామంటూ.. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధిని అథఃపాతంలో పడేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల మాటలు పెద్దవి.. చేతలు చిన్నవి అన్నట్లు ఉన్నాయని విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల ఇండ్లు, వ్యాపార సముదాయాలు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉంటే ముట్టుకోరని, హైడ్రా పేరుతో పేదల ఇండ్లను మాత్రం కూల్చుతున్నారని ఆరోపించారు. తెలంగాణకు బీజేపీ ఒక్క మంచి పని చేయలేదని దుయ్యబట్టారు. మత పిచ్చి, కుల పిచ్చి తప్ప ఆ పార్టీకి మరొకటి లేదన్నారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 'సమరశంఖ గర్జన గెరిల్లా ఉద్యమాల ఖిల్లా.. ఓరుగల్లు జిల్లా ' అంటూ సాగే పాటను కేటీఆర్ విడుదల చేశారు.

ఎండల మంట, వానల తంటా!

» ఆదిలాబాద్ సహా పలు జిల్లాల్లో మండిన సూరీడు

» నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి జిల్లాల్లో రైతులను దెబ్బతీసిన అకాల వర్షం

» వనపర్తిలో పిడుగుపాటుకు 25 గొర్రెల మృతి

» ములుగు జిల్లాలో వడదెబ్బకు ఒకరి మృతి

» నేడు వర్షాలు, రేపట్నించి తీవ్రం కానున్న ఎండలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



నాగర్‌కర్నూల్‌లో ధాన్యం తడువకుండా కవర్లు కప్పుతున్న రైతులు

రాష్ట్రంలో కొద్ది రోజులుగా విచిత్ర వాతావరణం ఉంటుంది. తెల్లవారుజాము నుంచే చాలా చోట్ల సూర్యుడు ప్రతాపం చూపుతుండగా.. పలు చోట్ల ఒక్కసారిగా వాతావరణం మారిపోయి అకాల వర్షం బీభత్సం సృష్టిస్తోంది. ఆదివారం కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో ఎండలు దంచికొట్టగా..నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి జిల్లాల్లో అకాల వర్షం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఆదిలాబాద్ జిల్లాలో ఆదివారం రాష్ట్రంలోనే అత్యధికంగా 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆ తర్వాత నిజామాబాద్‌లో 43.1, మెదక్‌లో 41.8, రామగుండంలో 41.4, నల్లగొండ, హన్మకొండ, మహబూబ్‌నగర్‌లలో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోపక్క, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి బిజినేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఆరబోసిన ధాన్యం తడిచిపోయింది. తాడూరు మండలంలో మొక్కజొన్న, పెసర్లు, వరి పంటలు నేలకొరిగాయి. తెలకపల్లి మార్కెట్‌యార్డులో రైతులు ఆరబోసుకున్న మొక్కజొన్న, వడ్లు తడిచిపోయాయి. జిల్లాలో చాలా చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. వనపర్తి జిల్లాలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి పెద్దమందడి, కొత్తకోట, గోపాల్‌పేట, రేవల్లి, వనపర్తి మండలాల్లో చేతికి వచ్చిన వరి పంట నేలకొరిగింది. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తడిచిపోయింది. గోపాల్‌పేట మండలంలోని చాకల్‌పల్లి, లక్ష్మీదేవిపల్లి గ్రామాల సమీపంలో పిడుగుపడి రాములు, విశ్వనాథం అనే గొర్రెల కాపరులు గాయపడగా, 25 గొర్రెలు మృతి చెందాయి. జోగుళాంబ గద్వాల జిల్లా ఆలంపూర్, ఉండవెల్లి, మానవపాడు మండలాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది. అయిజ మండలంలో వరి పైర్లు దెబ్బతిన్నాయి. మల్దకల్ మండలంలో పిడుగుపాటు వల్ల ఎద్దులు మరణించాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆదివారం ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన మోస్తారు నుంచి భారీ వర్షాలు అక్కడక్కడ కురిశాయి. పిడుగుపాటుకు ఓ ఆవు మరణించగా, యాచారం మండలంలో పంటలు దెబ్బతిన్నాయి.

వడదెబ్బతో వలస కూలీ మృతి

ములుగు జిల్లా వెంకటాపురం మండలం వీరభద్రవరం సమీపంలో.. పూనెం సన్ను(32) అనే వలస కూలీ వడదెబ్బకు గురై మరణించాడు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సన్ను స్థానిక మిర్చితోటలో పని చేయడానికి వచ్చాడని, పని ప్రాంతంలో వడదెబ్బకు గురై అక్కడికక్కడే మరణించాడని పోలీసులు వెల్లడించారు.

నేడు వర్షాలు, రేపట్నించి మంటలు

రాష్ట్రంలో పలుచోట్ల సోమవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని జిల్లాల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగం కలిగిన ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఇక, మంగళవారం నుంచి రాష్ట్రంలో ఎండలు మరింత పెరగనున్నాయని వాతావరణ కేంద్రం తెలియజేసింది. 44-45 డిగ్రీల దాకా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని పేర్కొంది.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.